www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★




న్యూరెంబర్గ్ ట్రయల్స్‌కు 80 ఏళ్ళు 06
'లొంగుబాట'లో మరికొందరు మావోయిస్టులు 03
నైరుతి నిష్క్రమణ.. ఈశాన్య రుతుపవనాలు ఆగమనం 05

సంపుటి 08, సంచిక: 316 | శుక్రవారం | 17-10-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## కేంద్రం సహకరించినా.. లేకపోయినా

# మొత్తం ధాన్యం కొంటాం

### మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తాం



● రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా ● కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకారం ● స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత ● రాష్ట్రంలో కొత్తగా మూడు అగ్రికల్చర్ కాలేజీలు ● నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయానికి అదనంగా ఏడు ఎకరాల భూమి ● డిసెంబర్ 1 నుంచి 9 వరకు 'ప్రజాపాలన విజయోత్సవాలు' ● కేబినేట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా మూడు అగ్రికల్చర్ కాలేజీలు కొడంగల్, హుజూర్‌నగర్, నిజామాబాద్ ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని, ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత పెద్ద మొత్తంలో ప్రస్తుతం వరి దిగుబడి వచ్చిందని, కేంద్రం సహకరించినా, లేకపోయినా ధాన్యం మొత్తం కొనుగోలు చేయాని, మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం తెలపడంతో పాటు ఖర్చులో 50 శాతం భరించాలని నిర్ణయించింది. రూ.10,547 కోట్లతో 5,566 కిలోమీటర్లు ప్రతిపాదించిన హ్యామ్‌రోడ్ల ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 1 నుంచి 9 వరకు 'ప్రజా పాలన విజయోత్స వాలు' నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరిగింది. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వివరించారు. ఈ వానాకాలంలో 1.48 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, దేశంలోనే ఇది రికార్డు స్థాయి ఉత్పత్తి అని, ఇందులో రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల విభాగం అంచనా వేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించిందని, మరో 15 లక్షల మెట్రిక్ టన్నులుసేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. వానకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని తరువాయి 2లో

### 'బిసి రిజర్వేషన్ల'పై వచ్చే కేబినేట్‌లో నిర్ణయం

బిసి రిజర్వేషన్ల అంశంలో సుప్రీంకోర్టు తీర్పుపైన న్యాయ నిపుణుల సలహాల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సుప్రీం కోర్ట్ పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత ఈ నెల 23న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్టు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఇద్దరు పిల్లలకు మించి సంతానమున్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనపై మంత్రివర్గం పునరాలోచన చేసిందన్నారు.

## 42 శాతం బిసి కోటాపై

# పిటిషన్ తిరస్కరణ

● హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టీకరణ ● ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలని సూచన ● తెలంగాణ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ



**న్యూఢిల్లీ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే జిఒలపై తెలంగాణ హైకోర్టు విధించిన స్టేను తొలగించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశంపై హైకోర్టులో కేసు ఉన్నందున తాము జోక్యం చేసుకోబోమని తెలిపింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల విధానంలోనే ఎన్నికలు నిర్వహించుకోవచ్చునని సూచించింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై స్టే విధించిన తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి)ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. గురువారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. 'మీరు మీ ఎన్నికలను ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల తోనే కొనసాగించండి. ఈ పిటిషన్ కొట్టివేయబడింది' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో వెనకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్ కల్పించడానికి సెప్టెంబరు 26న ప్రభుత్వ ఉత్తర్వు (జిఒ) 9 జారీచేసింది. ఈ జిఒ 9పై తెలంగాణ హైకోర్టు అక్టోబరు 9వ తేదీన ఇచ్చిన ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్‌చేసింది. ఈ పిటిషన్‌ను తోసిపుచ్చిన అత్యున్నత న్యాయస్థానం తన ఉత్తర్వు హైకోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని స్పష్టంచేసింది. స్థానిక సంస్థలలో మొత్తం రిజర్వేషన్లను 67శాతానికి పెంచుతూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు తన తీర్పులో నిర్దేశించిన తరువాయి 2లో

# వెనుకడుగు ప్రసక్తే లేదు

● బిసి రిజర్వేషన్లపై కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నాం ● 18న బిసి జెఎసి తలపెట్టిన బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ● టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ స్పష్టీకరణ




ప్రజాపక్షం/హైదరాబాద్

వెనుకబడిన తరగతుల (బిసి) కు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, బిసి రిజర్వేషన్ల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్ల అమలు కోసం తెలంగాణ బిసి జెఎసి ఈ నెల 18వ తేదీన తలపెట్టిన 'బంద్ ఫర్ జస్టిస్'కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన ప్రకటించారు. బిసి రిజర్వేషన్లపై ప్రజలను మేల్కొలపడానికే తరువాయి 2లో

## బోగస్ ఓటర్లపై ఆదేశాలు

# అవసరం లేదు

● ఇసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది ● బిఆర్‌ఎస్ పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓటర్ల వ్యవహారంపై బిఆర్‌ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌లో కోరిన మేరకు ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. బోగస్ ఓట్లకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటున్నందున తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ప్రత్యేకంగా ఇసికి ఉత్తర్వులు జారీ అవసరం లేదని తేల్చి చెప్పింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇచ్చిన వినతి పత్రంపై పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని ఇసి చేసిన వాదనను పరిగణనలోకి తీసుకుంది. కేంద్ర ఎన్నికల సంఘం హామీ తర్వాత ఎలాంటి ఉత్తర్వులు అవసరంలేదని తెలిపింది. బోగస్ ఓటర్లు, రాజకీయంగా లబ్ధి చేకూరేందుకు అధికార పార్టీకి మేలు జరిగేలా జరిగిన ప్రయత్నాలపై ఆధారాలతో ఇసికి వినతి పత్రాలు ఇస్తే చర్యలు లేవంటూ బిఆర్‌ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునిత, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంయుక్తంగా లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. దీనిని గురువారం తరువాయి 2లో

## కార్మిక వ్యతిరేక ఇపిఎఫ్ఒ

### కొత్త నిబంధనలు తక్షణమే వెనక్కి ఎఐటియుసి డిమాండ్

**న్యూఢిల్లీ:** కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఇపిఎఫ్ఒ కొత్త నిబంధనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పొదుపు మొత్తాలలో 25 శాతం కనీస బ్యాలెన్స్‌గా ఉండాలనడం దారుణమన్నారు. పీఎఫ్ మొత్తాన్ని తీసుకోవాలంటే 12 నెలలు, పింఛన్ ఉపసంహరణకు 36 నెలలు ఆగాలన్న నిబంధనలు కార్మికుల కష్టాన్ని దోచుకునేలా ఉన్నాయని దుయ్యబట్టారు. రాక్షస నిబంధనలను తరువాయి 2లో

## రష్యా చమురు కొనుగోళ్ళు ఆపేస్తానని

# మోదీ హామీ ఇచ్చారు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన ఇకమీదట రష్యా చమురు భారత్‌లో ఉండదని వ్యాఖ్య



**వాషింగ్టన్:** రష్యా నుండి ముడి చమురు దిగుమతులు నిలిపివేసేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనకు హామీ ఇచ్చారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రష్యా నుండి చమురు దిగుమతులను నిలిపివేస్తామని బుధవారం ఉదయం మోదీ హామీ ఇచ్చారని చెప్పారు. "మీకు తెలుసా? ఇంక వాళ్ళ చమురు భారత్‌లో ఉండదు, అతను రష్యా నుండి కొనుగోలు చేయడంలేదని నేను చెప్పగలనా? ఆయన వెంటనే చేయలేడు, కానీ ఆ ప్రక్రియ ప్రారంభమైంది, త్వరలో పూర్తవుతుంది, నాకు తెలియదుగానీ, బహుశా ఇదే పెద్ద బ్రేకింగ్ న్యూస్, ఇది చిన్న ప్రక్రియ, త్వరలో ఈ దిగుమతుల ప్రక్రియ ముగియబోతోంది" అని ఓవల్ ఆఫీసులో ట్రంప్ పాత్రికేయులతో అన్నారు. భారత్–అమెరికా మధ్య సంబంధాల్లో కొద్దినెలలుగా రష్యా నుండి చమురు కొనుగోలు అంశం చర్చనీయాంశంగా మారడమే కాకుండా రెండు దేశాల మధ్యా సంబంధాలు తరువాయి 2లో

### వినియోగదారుల రక్షణకే ప్రాధాన్యం

చమురు దిగుమతిపై రణధీర్ జైస్వాల్ ప్రకటన

**న్యూఢిల్లీ:** మన దేశ వినియోగదారుల ప్రయోజనాల సంరక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు. దేశ ప్రజల అవసరాలు, వినియోగదారుల ప్రయోజనాలకు అనుగుణంగానే దిగుమతి విధానాలు ఆధారపడి ఉంటాయని స్పష్టం చేశారు. రష్యా నుండి ముడి చమురు కొనుగోళ్ళు నిలిపివేస్తామని తరువాయి 2లో

## ట్రంప్ అంటే

# మోదీకి భయం

● కీలక నిర్ణయాలను అమెరికాకు అప్పగించారు! ● ప్రధానిపై కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ :** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును ఇకపై ఆపేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ తనకు హామీ ఇచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడికి భయపడుతున్నారని ఆరోపించింది. కీలక నిర్ణయాలను అమెరికాకు అప్పగించినట్లు కనిపిస్తోందని ధ్వజమెత్తింది. మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం పూర్తిగా కుప్పకూలిందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా గానీ, వారితో వ్యక్తిగతంగా మాట్లాడటం ద్వారా గానీ ప్రతిపక్ష నాయకులను కేంద్ర ప్రభుత్వం విశ్వాసంలోకి తీసుకోవాలని పేర్కొంది. రాహుల్‌గాంధీ మోదీపై విమర్శలు చేస్తూ భారతదేశం రష్యా చమురు కొనుగోలు చేయదని నిర్ణయించుకోవడానికి, ప్రకటించడానికి ట్రంప్‌కు ప్రధాన మంత్రి అనుమతి ఇచ్చారని, పదేపదే తిరస్కరిస్తున్నప్పటికీ అభినందన సందేశాలు పంపుతూనే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, భారత దేశం రష్యా నుండి చమురు కొనుగోలును నిలిపివేస్తుందని తన స్నేహితుడు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని ట్రంప్ పేర్కొన్న తర్వాత ప్రతిపక్ష పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. ఉక్రెయిన్‌పై దాడి చేసేందుకు మాస్కోపై ఒత్తిడి పెంచే దిశగా ఈ చర్య ఉందని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ కూడా ఈ అంశంపై ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'భారత కాలమానం ప్రకారం మే 10, 2025న సాయంత్రం 5:37 గంటలకు, ఆపరేషన్ సిందూర్‌ను భారత దేశం నిలిపివేసినట్లు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తొలిసారిగా ప్రకటించారు. తదనంతరం, తరువాయి 2లో



### 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మద్దతివ్వండి'

సిపిఐ(ఎం)ను కోరిన టిపిసిసి చీఫ్ 03



హైదరాబాద్‌లో నిర్వహించిన బిసి సంఘాలు, బిసి ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



# ప్రపంచం
WORLD NEWS

## పాకిస్థాన్‌లో 34 మంది ఉగ్రవాదులు కాల్చివేత

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో గడచిన మూడు రోజులుగా సైన్యం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో 34 మంది ఉగ్రవాదులు మరణించారు. భారత్ మద్దతు ఉన్న ఉగ్రవాదులను 34 మందిని హతమార్చినట్లు మిలిటరీ మీడియా గురువారం తెలిపింది. ఈనెల 13 నుండి 15వ తేదీ వరకు నిర్వహించిన గాలింపు చర్యల్లో ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రం ఉత్తర వజిరిస్థాన్ స్పిన్‌వామ్ ప్రాంతంలో, దక్షిణ వజిరిస్థాన్, బన్ను జిల్లాలలో భారత్ ప్రోత్సాహంతో ఉగ్రవాద కార్యకలాపాలు చేస్తున్న ఫిత్నా అల్ ఖవారిజ్ (నిషేధిత తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్) ఉగ్రవాదులను మట్టుపెట్టామని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం ప్రకటించింది. దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ భద్రతాదళాల కృషిని ప్రశంసించారు. కాగా ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 10,115 ఆపరేషన్స్ నిర్వహించి 970 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు ఐఎస్‌పిఆర్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ అహ్మద్ షరీఫ్ చౌధురి చెప్పారు. అదేవిధంగా ఈ ప్రయత్నంలో 311 మంది పాకిస్థాన్ సైనికులు కూడా మరణించారని చెప్పారు.

# మళ్లీ యుద్ధం : ఇజ్రాయెల్ బెదిరింపు

**19 మంది నిర్జీవులపై ముదురుతున్న వివాదం**

**గడువు కావాలి, ఆధునిక పరికరాలు కావాలి : హమాస్ డిమాండ్**

**జెరూసలెం :** శాంతి ఒప్పందానికి కట్టుబడి ఉండకపోతే మళ్ళీ గాజాలో యుద్ధం ప్రారంభిస్తామని హమాస్‌కు ఇజ్రాయెల్ గురువారం తాజా హెచ్చరిక చేసింది. నిర్ణీత ప్రకారం నిర్జీవులైన ఇజ్రాయెలీ బందీలను విడుదల చేయడంలో హమాస్ జాప్యం చేస్తోందనీ, ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందనీ నెతన్యాహూ అన్నారు. ఉల్లంఘనకు పాల్పడితే కాల్పుల విరమణ ఒప్పందాన్ని రద్దుచేస్తామన్నారు. ఇజ్రాయెల్ తన యుద్ధ లక్ష్యాలను సాధిస్తుందని, యుద్ధం ఇంకా ముగిసిపోలేదని, ఇజ్రాయెల్‌ను బెదిరించేవారు ఎవరైనాగానీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిక చేశారు. ఇందుకు అనుగుణంగా ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ ఒక ప్రకటన చేస్తూ, సైన్యం సిద్ధంగా ఉండాలని తమ దళాలకు ఆదేశించారు. కాగా నిర్జీవులైన బందీలను స్వాధీనం చేయడంలో జాప్యం జరుగుతూ ఉండటంతో కాల్పుల విరమణ ఒప్పందం కుప్పకూలుతుందని మధ్యవర్తులు భయపడుతున్నారు. మరోవైపు అమెరికా కూడా ఈ విషయాన్ని చిన్నదిగా చేసి చూపించేందుకు ప్రయత్నం చేస్తున్నది. సజీవులైన 20 బందీలను పద్ధతి ప్రకారం హమాస్ సంస్థ విడుదల చేసినప్పటికీ నిర్జీవులైన 28 మంది ఇజ్రాయెల్ బందీలను అప్పగించే విషయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నది. ఇప్పటివరకూ తొమ్మిదిమంది మృతదేహాలను రెడ్‌క్రాస్ ద్వారా ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేసింది. ఇంకా 19మంది బందీల మృతదేహాలను హమాస్ స్వాధీనం చేయాల్సి ఉంది. తమకు చేతనైనంత వరకూ అందుబాటులో ఉన్న మృతదేహాలను స్వాధీనం చేశామని, ఇక తమవద్ద మృతదేహాలు లేవని, వారిని వెతికి వెలికి తీసి అప్పగించాలని, అందుకు వీలుగా ఆధునిక పరికరాలు అవసరమని, వాటిని తమకు సమకూర్చాలని హమాస్ కోరుతుంది. మృతదేహాలను వెలికితీసి తక్షణం స్వాధీనం చేయడం సాధ్యం కాదని, చాలా సమయం పడుతుందని, ఎక్కువ గడువు కావాలని హమాస్ స్పష్టం చేసింది. గాజాలో యుద్ధ విధ్వంసం చాలా దారుణంగా ఉన్నందువల్ల నిర్జీవుల జాడ కనిపెట్టి వెతికి తీసుకురావడం కష్టంగా మారిందని హమాస్ ప్రకటించింది. దీంతో ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.

మొదటిరోజు సోమవారం నాలుగు మృతదేహాలను స్వాధీనం చేయగా, రెండోరోజు రాత్రి పొద్దుపోయాక మరో నాలుగు మృతదేహాలను స్వాధీనం చేసింది. ఐతే వీరిలో ఒక మృతదేహం ఇజ్రాయెల్ బందీల కుటుంబాలది కాదని వెల్లడైంది. ఆ తర్వాత మరో ఇద్దరు మృతదేహాలను తాజాగా గురువారం హమాస్ స్వాధీనం చేసింది. దీంతో మొత్తం పది మృతదేహాలు స్వాధీనం చేసినప్పటికి ఒక మృతదేహం ఇజ్రాయెల్ బందీల కుటుంబాల కు చెందినది కాకపోవడంతో నెతన్యాహూ ప్రభు త్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.



తమకు వీలైనంతవరకూ మృతదేహాలను అందజేశామని, మిగిలినవారిని వెతకడానికి చాలా గడువు కావాలని హమాస్ కోరుతున్నది. మరోవైపు రఫా క్రాసింగ్‌ను తెరవాలని, పాలస్తీనా ప్రజలకు ఆహార సరఫరాలు మెరుగుపరచేందుకు వీలుగా లారీలను అనుమతించాలని ఐక్యరాజ్యసమితి కోరుతున్నది. ఆహారం, మానవతా సహాయం తీసుకువచ్చే 600 లారీలను ప్రతిరోజూ అనుమతించాలన్నది ఒప్పందం కాగా, కేవలం 300 లారీలను మాత్రమే అనుమతిస్తామని ఇజ్రాయెల్ చెప్పింది. నిర్జీవులైన బందీలను విడుదల చేయడంలో హమాస్ చర్యలకు ఇజ్రాయెల్ ఈ ప్రతిచర్యలు తీసుకుంటున్నది. ఐతే రఫా క్రాసింగ్ తెరచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలియజేసింది.

**120 మంది పాలస్తినా ఖైదీల మృతదేహాలు స్వాధీనం...** ఇప్పటివరకూ హమాస్ 10 మంది బందీల మృతదేహాలను స్వాధీనం చేయగా, ఇజ్రాయెల్ కూడా వివిధ జైళ్ళలో ఉన్న 120 మంది పాలస్తినా ఖైదీల మృతదేహాలను స్వాధీనం చేసింది. ఈ మృతదేహాలను గాజాలోని ఆసుపత్రులకు తరలించి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. చిత్రహింసలకు గురిచేసి ఈ ఖైదిలను చంపినట్లు పోస్టుమార్టంలో వెల్లడైనట్లు వైద్యులు ప్రకటించారు. ట్రంప్ ప్రకటించిన 20 అంశాల శాంతి ప్రణాళిక ప్రకారం 2000 మంది పాలస్తినా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. హమాస్ స్వాధీనం చేసే ఇజ్రాయెల్‌కు చెందిన ప్రతి బందీ మృతదేహానికీ బదులుగా 15 మంది పాలస్తినా ఖైదీల మృతదేహాలను తాము స్వాధీనం చేస్తామని ఇజ్రాయెల్ చెప్పింది.

**హమాస్ ఉల్లంఘనలు చేయలేదు...** నిర్జీవులైన బందీలను స్వాధీనం చేయడంలో హమాస్ ఆలస్యం చేస్తూ ఉండటంతో ఒకవైపు ఇజ్రాయెల్ ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, మరోవైపు అమెరికా మాత్రం ఈ ఒప్పందం కుప్పకూలకుండా నిలబెట్టేందుకు సమస్యను చిన్నదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నది. ఇజ్రాయెల్‌కు హమాస్ 19 మంది మృతదేహాలను ఇంకా అప్పగించాల్సి ఉంది. హమాస్ ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని, వారి ప్రయత్నాలు వారు చేస్తున్నారని ట్రంప్ పాలనాయంత్రాంగం చెబుతున్నది. రెండో దశ ఒప్పందం ప్రారంభమైందని ట్రంప్ ప్రకటించినప్పటికీ మొదటి దశ ఒప్పందంలోని అంశాలే ఇంకా పూర్తిగా నెరవేరలేదు. దీంతో ట్రంప్ ఇరుకున పడ్డారు. ప్రస్తుతం మొదటి దశ ఒప్పందం పూర్తికావడంలో ఏర్పడిన ప్రతిష్టంభనను చిన్నదిగా చేసి చూపించేందుకు ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారు. ఒప్పందాన్ని గౌరవించేందుకే హమాస్ తంటాలు పడుతోందని వైట్‌హౌస్ సీనియర్ అధికారులు సమర్థిస్తున్నారు.

## అవిశ్వాస గండం గట్టెక్కిన లెకార్ను



**పారిస్ :** ఫ్రెంచ్ ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకార్ను రెండు అవిశ్వాస తీర్మానాల నుండి బయటపడ్డారు. దేశంలో పెన్షన్ సంస్కరణలను రెండేళ్ళపాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఆయనకు పార్లమెంటులో అవిశ్వాస గండం తప్పింది. దీంతో ఆయన ఊపిరి పీల్చుకుని బయటపడ్డారు. ''నేను తిరిగి నా విధుల్లోకి వెళుతున్నా'' అని లెకార్ను పాత్రికేయులకు చెప్పారు. బడ్జెట్‌పై చర్చతోపాటు ఇతర సవాళ్ళ పరిష్కారాలపై కూడా దృష్టిపెట్టడం ప్రారంభమైందన్నారు. పార్లమెంటులో మొదట పెట్టిన అవిశ్వాస తీర్మానం 18 ఓట్ల తేడాతో వీగిపోయింది. లెఫ్ట్ వింగ్ ఎంపీలు ఆయనకు అండగా నిలబడ్డారు. రెండో అవిశ్వాస తీర్మానం కూడా 145 ఓట్ల తేడాతో వీగిపోయిం ది. రాడికల్ లెఫ్ట్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 271 ఓట్లు వచ్చాయి. 289 ఓట్లు వచ్చి ఉంటే లెకార్ను ప్రభుత్వం కుప్పకూలి ఉండేది. ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ పాలనలో లెకార్ను ఆరో ప్రధానమంత్రి. ఈ పరిణామాలపై పచ్చి మితవాదపార్టీ నేషనల్ ర్యాలీ నాయకుడు జోర్డాన్ బార్డెల్లా స్పందిస్తూ, దేశంలో రాబోయే కష్టాలకు ప్రభుత్వాన్ని సమర్థించిన ఎంపీలే బాధ్యులవుతారన్నారు. లెకార్ను ప్రభుత్వంపై భవిష్యత్తులో పోరాటం కొనసాగిస్తామని సోషలిస్టుపార్టీ నాయకురాలు మాథిల్డే పానోట్ (లెఫ్ట్ రాడికల్) స్పష్టం చేశారు.

## తిరస్కరణ (మొదటి పేజీ తరువాయి)

కోటాపై 50శాతం పరిమితిని ఈ జిఒ ఉల్లంఘించిందని పిటిషనర్లు దాఖలు చేసిన తమ పిటిషన్‌లో హైకోర్టుకు విన్నవించారు. దీనిని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన హైకోర్టు నాలుగు వారాలలోగా సమాధానం దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గురువారం సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తన వాదనలను వినిపిస్తూ హైకోర్ట్ మధ్యంతర ఉత్తర్వులతో తెలంగాణ రాష్ట్రం చాల తీవ్రంగా బాధపడుతోందని ద్విసభ్య ధర్మాసనానికి వివరించారు. 'మీరు ఎన్నికలను కొనసాగించండి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై విచారణకు హాజరైన న్యాయవాదులలో ఒకరు మాట్లాడుతూ హైకోర్టు ఎన్నికలను నిలిపివేయలేదని చెప్పారు. ఇది ఒక రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన విధాన నిర్ణయం అని, అది తనకు తానుగా సమాచారం అందించుకోవాలని, అవగాహన కల్పించడమే కాకుండా, జ్ఞానోదయం కల్పించాలని కోరుకుంటోందని, ఆ పై అన్ని పాలసీలను వెనకబడిన తరగతులలో అధికశాతం మందిని లక్ష్యంగా చేసుకుని రూపొందిస్తుందని అభిషేక్ సింఘ్వీ వాదించారు. అభ్యర్థలను లేకుండా జిఒను ఎలా నిలిపివేస్తారని ఆయన ప్రశ్నించారు. చివరి రెండు పేజీలను మినహాయించినట్లయితే, హైకోర్టు స్టే ఇవ్వడానికి ఎలాంటి కారణాలు లేవని అభిషేక్ సింఘ్వీ వాదించారు. 'మీ కేసు రిజర్వేషన్ లేదనే అంశానికి సంబంధించిన ది కాదు. రిజర్వేషన్ ఉంది. అయితే, మీరు రిజర్వేషన్ శాతాన్ని పెంచుతున్నారు' అని ధర్మాసనం సింఘ్వీని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. సింఘ్వీ సమాధానమిస్తూ అత్యున్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన తీర్పులు రిజర్వేషన్‌పై 50శాతం పరిమితిని విధించాయనేది ఒక 'అపోహ' అని ధర్మాసనానికి తెలిపారు. దానికి ధర్మాసనం స్పందిస్తూ 'ఎన్నికల తేదీకి ముందే మీరు మీ జిఒను ఎందుకు జారీ చేయలేకపోయారు' అని బెంచ్ తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది సింఘ్వీని ప్రశ్నించింది. గవర్నర్ బిల్లును పెండింగ్‌లో పెట్టారని సింఘ్వీ సమాధానమిచ్చారు. 'మీరు మాకు ఒక విషయాన్ని చెప్పాలి. ఈ కసరత్తు ఆధారంగా మీరు ఒక ఆర్డినెన్స్ మరియు బిల్లును కూడా తీసుకురావాలి. అయితే అది ఇంకా తుదిరూపుదాల్చలేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మీరు ఈ పిటిషన్‌ను స్వీకరించి, 50శాతాన్ని ఎప్పుడైనా చేరుకోగలరా అనే పెద్ద అంశంపై విచారణ జరపాలని అభిషేక్ సింఘ్వీ ధర్మాసనాన్ని కోరారు. హైకోర్టు అక్టోబరు 9న ఇచ్చిన ఉత్తర్వు మధ్యంతర ఉత్తర్వు అని ధర్మాసనం గమనించినప్పుడు మొత్తం కసరత్తుపై స్టే విధించిందని న్యాయవాది సింఘ్వీ చెప్పారు. హైకోర్టు ఆదేశాన్ని అనుసరించి తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్ (ఎస్ఇసి) ఒక ప్రకటన జారీ చేసిన సెప్టెంబరు 29న ఎన్నికల నోటిఫికేషన్ జారీచేయబడుతుందని, నోటిఫికేషన్ వచ్చే వరకు తదుపరి కార్యకలాపాలు అన్నింటినీ నిలిపివేస్తున్నట్లు తెలియజేసిందని చెప్పారు. సెప్టెంబరు 29న ఎస్ఇసి ప్రకటించిన 5దశల ఎన్నికల షెడ్యూల్‌లో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబరునవంబరు మధ్య జరుపనున్నట్లు వెల్లడించింది.

## మొత్తం ధాన్యం కొంటాం (మొదటి పేజీ తరువాయి)

కేబినెట్ నిర్ణయించిందన్నారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించిందన్నారు. ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. కలెక్టర్లు, అదనపుకలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని.. ప్రతి కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఏన్కూర్ మార్కెట్ యార్డ్‌కు పది ఎకరాలు కేటాయిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి ఇప్పుడున్న చోటనే అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. నల్సార్ యూనివర్సిటీ అడ్మిషన్లలో ఇప్పుడు తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కేబినెట్ తీర్మానం చేసింది. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మెట్రో 2ఎ, 2బి విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పిపిపి మోడ్‌లో నిర్వహిస్తున్న ఎల్అండ్‌టి నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై సుదీర్ఘంగా చర్చించింది. మెట్రో రైలును ఎల్అండ్‌టి నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో సాధ్యాసాధ్యాలు, అందులో ముడిపడి ఉన్న అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు ఉన్నత అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సిఎస్ చైర్మన్‌గా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఎంఎయుడి కార్యదర్శి, లా సెక్రెటరీ, మెట్రో రైలు ఎండి, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ అడ్వయిజర్ అధికారులు కమిటీలో సభ్యులుగా ఉంటారని స్పష్టం చేసింది. అధికారుల కమిటీ తమ రిపోర్టును కేబినేట్ సబ్ కమిటీకి అందజేయాలని, కేబినేట్ సబ్ కమిటీ సిఫారసుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలో హ్యామ్ మోడ్లో మొదటి దశలో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి మంత్రివర్గం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారులు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రహదారులకు సంబంధించి అభివృద్ధి, విస్తరణ పనులు పట్టాలని సూచించింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫామ్ రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్నందున వారికి ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. కృష్ణావికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హెక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసింది. మన్ననూర్‌శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు మంత్రివర్గం అంగీకరించింది.

## అవసరం లేదు

(మొదటి పేజీ తరువాయి)

చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ విచారించింది. ఓటర్ల లిస్ట్‌లో అనేక లోపాలున్నాయని, తప్పుల తడకగా ఉందని సీనియర్ లాయర్ దామా శేషాద్రినాయుడు చెప్పారు. ఓటర్ల జాబితాలో అవతవకలు కారణంగా ఎలక్షన్ పిటిషన్ వరకు వేచి ఉండాలని లేదని సుప్రీం కోర్టు తీర్పులున్నాయి. ఇటీవల బీహార్ ఎన్నికల సందర్భంగా 65 లక్షల ఓటర్లను డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో లేకుండా తుది నోటిఫికేషన్‌లో చేర్చడంపై సుప్రీం కోర్టు ఆక్షేపించింది. చర్యలు తీసుకుంటామని ఈసీ హామీ కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో జూబ్లిహిల్స్ ఓటర్ల జాబితాలోని అవకతవకలను సవరించకుండా ఎన్నికలు నిర్వహించడానికి వీల్లేదు. ఎన్నికలు నిర్వహించడానికి కోర్టు జోక్యం చేసుకోవచ్చు. ఎన్నికలను పారదర్శకంగా జరిగేలా రాజ్యాంగ ధర్మాసనం చర్యలు తీసుకోవచ్చు. ఒక వ్యక్తికి రెండు మూడు ఓటరు గుర్తింపు కార్డులున్నాయి. ఒక మహిళకు డిసెంబరులో నల్గొండ జిల్లాలో ఓటు ఉంది. ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో ఉంది. వేరే ప్రాంతాల వాళ్లు 12 వేల మంది జూబ్లీహిల్స్‌లో ఓటర్లు నమోదు అయ్యారు.చిన్న ఇంట్లో పెద్ద సంఖ్యలో ఓట్లు ఉన్నాయి. ఒకటి కంటే ఎక్కువ ఓట్లు చాలా మందికి ఉన్నాయి. యూసఫ్‌గూడలో ఒక్కటిన్న గదిలో ఉంటే కుటుంబంలో 44 ఓట్లు ఉన్నాయి. ఇవన్నీ ఈసీ విడుదల చేసిన ఓటర్ల జాబితాలోనే ఉన్నాయి. ఈసీ నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 21న నామినేషన్‌ల చివరి తేదీ. ఈసీ ప్రెస్‌నోట్‌లో చివరి రోజు వరు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు వీలుఉంది. దీని వల్ల ఇప్పటికే తప్పుల తడకగా నమోదైన ఓటర్ల లిస్ట్‌లో మరిన్ని బోగస్ ఓట్లు చేరే ప్రమాదం ఉంది. ఈ అక్రమాలపై ఈ నెల 13, 14 తేదీల్లో పిటిషనర్లు రెండు వినతి పత్రాలను ఈసీకి సమర్పించినా చర్యలు శూన్యం. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహించిన అధికారుల చర్యలపై విచారణ చేయవచ్చు. విధిS నిర్వహణలో నిర్లక్ష్యంగా, దురుద్దేశపూరితంగా చేసినప్పుడు కోర్టులు అడ్డుకోవాలి. ప్రజాతీర్పు చట్టబద్ధంగా ఉండేలా కోర్టులు చర్యలు తీసుకోవాలి. కోర్టులు అప్రమత్తంగా వ్యవహరించాలి. కాబట్టి పిటిషనర్లు ఇచ్చిన వినతి పత్రంలోని అంశాలపై నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా ఈసీకి ఆదేశాలివ్వాలి.. అని ఆయన వాదించారు.

ఈసీ తరఫున సీనియర్ అడ్వకేట్ అవినాష్ దేశాయ్ వాదిస్తూ, 14వ తేదీన పిటిషనర్ ఇచ్చిన వినతి పత్రాలపై ఈసీ పరిశీలన చేసి చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈసీకి గడువు కూడా ఇవ్వకుండా హడావుడిగా పిటిషన్ వేయడం సరికాదు. నామినేషన్ల ప్రక్రియ వరకు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు ఉంటాయి. ప్రతి రోజూ జరుగుతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి జులైలో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువడింది. సెప్టెంబరులో తుది నోటిఫికేషన్ వచ్చింది. ఈ నెల 6న ఎన్నికల షెడ్యూలు, 13న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ దానిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయి. జిల్లా అధికారుల నుంచి ఈసీ రిపోర్టులు తెప్పించుకుంది.. అని అవినాష్ చెప్పారు. ఈసీ హామీ నేపథ్యంలో ఆర్డర్ అవసరం లేదని తేల్చిన ద్విసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

## మోదీకి భయం (మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు ట్రంప్ 5 వేర్వేరు దేశాలలో 51 సార్లు సుంకాలు, వాణిజ్యంపై ఒత్తిడిని ఆయుధంగా ఉపయోగించి ఆపరేషన్ సిందూర్‌ను ఆపడానికి జోక్యం చేసుకున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ మన ప్రధాని మౌనంగా ఉన్నారు' అని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇప్పుడేమో ట్రంప్ రష్యా నుండి చమురును భారతదేశం దిగుమతి చేసుకోదని మోదీ తనకు హామీ ఇచ్చారని ప్రకటించారు. మోదీ కీలక నిర్ణయాలను అమెరికాకు అవుట్‌సోర్స్ చేసినట్లు కనిపిస్తోంది. 56 అంగుళాల ఛాతీ కుంచించుకుపోయిందని ఎద్దేవా చేశారు. మన ప్రధానమంత్రి అమెరికా అధ్యక్షుడిని ప్రశంసిస్తూ ట్వీట్ చేస్తుండగా, వాషింగ్టన్ సుంకాలు విధిస్తూనే ఉందని పిటిఐకి చెప్పారు. దేశీయ రాజకీయాల్లో ధ్రువణతకు విదేశాంగ విధానం ఒక సాధనంగా మారిందని, ఇది దేశానికి చాలా ప్రమాదకరమైన సంకేతం అని ఆయన ఆరోపించారు.

## కార్మిక వ్యతిరేక ఇపిఎఫ్ఒ

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే ఉపసంహరించాలన్నారు. ఇపిఎఫ్ఒ డేటా ప్రకారం 87 శాతం మంది సభ్యుల ఖాతాల్లో రూ.లక్ష కంటే తక్కువగా, 50 శాతం మంది ఖాతాల్లో రూ.2 లక్షల కంటే తక్కువగా మొత్తాలు ఉన్నాయని తెలిసిందని అన్నారు. 'ఉద్యోగం ఎప్పుడు పోతుందో తెలియదు. ఉద్యోగ భద్రతఆదాయానికి హామీ లేదు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. విద్యవైద్య వ్యయం భారీగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో పొదుపు మొత్తాలు ఉపసంహరించుకోవడం తప్ప సగటు జీవికి మరో మార్గం లేదు. దాచుకున్న డబ్బు తీసుకునేందుకు దీర్ఘకాలం వేచివుండాలనడం అన్యాయం. ఎవరు దాచుకున్న డబ్బుపై వారికి నియంత్రణ ఉండాలి కానీ ప్రభుత్వం దానిని కాదంటోంది. ఉద్యోగుల పొదుపు మొత్తాల నుంచి కార్పొస్ (ప్రత్యేక నిధి) ఏర్పాటుకు ప్రయత్నించడం... దోపిడీకి ఏ మాత్రం తీసిపోదు' అని అమర్‌జిత్ కౌర్ వ్యాఖ్యానించారు. సంస్కరణల పేరిట అర్థలేని నిబంధనలను తెచ్చారని, వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త నిబంధనలు నిరుద్యోగులను శిక్షించడమే కాకుండా వారి పొదుపు మొత్తాలపై హక్కును కాదనేలా ఉన్నట్లు తెలిపారు. ఏ మాత్రం సమయం వృథా చేయకుండా ఈ నోటిఫికేషన్లు వెంటనే వెనక్కి తీసుకోవాలని సీబీటీని ఏఐటీయూసీ కోరుతోందని అమర్‌జిత్ కౌర్ వెల్లడించారు.

## వెనుకడుగు ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)

బంద్ అని, బంద్ విజయవంతమై అందరికీ కనువిప్పు కలగాలని ఆయన అన్నారు. బిసి జనాభాపై రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా సర్వే చేయించిందని, అసెంబ్లీలో రెండు చట్టాలు చేశారని, కానీ పెండింగ్‌లో పెట్టడం విచారకరమన్నారు. గాంధీభవన్‌లో బుధవారం టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను బిసి జెఎసి ప్రతినిధి బృందం కలిసి రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్లపై హైకోర్టులో తేల్చుకోవాలని సుప్రీంకోర్టు సూచించిందని, ఆ మేరకు బిసి రిజర్వేషన్‌లపై ప్రభుత్వ తరపున వాదనలు హైకోర్టులో సమర్ధవంతంగా వినిపిస్తామన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో న్యాయ పరంగా పోరాడుదామని, రాజకీయాలు ఎన్నికల వరకేనని, రిజర్వేషన్ల విషయంలో అందరం ఏకం కావాల్సిన అవశ్యకత ఉందన్నారు. బిసి రిజర్వేషన్ల కోసం అన్ని విధాలుగా పోరాడుతామన్నారు. బిసి రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ చేర్చే విషయంలో ప్రధాని మోదీని అడిగేందుకు బిజెపి నేతలు ఎందుకు జంకుతున్నారని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్‌తో బిజెపి లోపాయికారి ఒప్పందంతో బిసి రిజర్వేషన్లకు అడ్డు పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం శాస్త్రీయ బద్ధంగా కుల సర్వే నిర్వహించి అధికారికంగా డాక్యుమెంట్ ఇచ్చామన్నారు. బిసి రిజర్వేషన్లకు అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి కొన్ని రాజకీయ పార్టీలు బయటకు వచ్చి మోకాలడ్డు పడుతున్నాయన్నారు. ఎఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీ ఇచ్చిన 'ఎవరి వాటా వారికి నినాదం' ఉద్యమంగా మారిందని, రాహుల్ గాంధీ నినాదం గొప్ప వరమన్నారు.

## వినియోగదారుల రక్షణకే ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్రమోదీ బుధవారం తనకు హామీ ఇచ్చారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారం వైట్‌హౌస్ ఓవల్ ఆఫీస్‌లో పాత్రికేయులతో చెప్పిన కొద్ది గంటలకే కేంద్ర ప్రభుత్వం తరపున జైస్వాల్ మీడియా సమావేశంలో ప్రతిస్పందించారు. ఇంధన దిగుమతులనేవి కేంద్ర ప్రభుత్వ స్థిరమైన ప్రాధాన్యతలపై ఆధారపడి ఉంటాయని, ప్రస్తుత ప్రపంచంలో ఇంధన సరఫరా పరిస్థితులు స్థిరత్వం లేకుండా ఎగుడుదిగుడుగా కొనసాగుతున్నాయని, ఈ పూర్వరంగంలో భారత ప్రజలు, భారత వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వారి ప్రయోజనాలు సంరక్షించడమే ప్రధాన ప్రాధాన్యతగా భావించి కేంద్రం తన దిగుమతి విధానాలను నిర్దేశించుకుంటుందని రణధీర్ జైస్వాల్ అన్నారు. ''ఇంధనం ధరలను స్థిరంగా ఉంచడం ముఖ్యం, ఈ విషయంలో ప్రజలకు భరోసా ఇవ్వాలి, అదేవిధంగా బయట నుండి మనకు వచ్చే సరఫరాలను కూడా కాపాడుకోవాలి ఈ రెండే మనకుండే ప్రధానమైన లక్ష్యాలు, ఈ లక్ష్యాలే మన ఇంధన విధానాన్ని నిర్దేశిస్తాయి'' అని రణధీర్ జైస్వాల్ చెప్పారు. దీంతోపాటే మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కూడా భారతదేశం తన నిర్ణయం తీసుకుంటుంది, మన ఇంధన వనరులను, వసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది, అని జైస్వాల్ చెబుతూ అదే విధంగా అమెరికాతో ఇంధన సంబంధాలను విస్తరించుకునే విషయంపై కూడా భారతదేశం దృష్టి పెట్టిందని చెప్పారు.

**అమెరికాతో భారత్ కొత్త చమురు బంధం?**

అమెరికాతో భారత్‌కు కొత్త చమురు బంధం ఏర్పడుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ''ఇకమీదట రష్యా నుండి చమురు కొనుగోలు చేయబోమని మోదీ నాకు హామీ ఇచ్చారు'' అని ట్రంప్ ఘంటాపథంగా చెప్పడం, భారత్ వెంటనే రష్యా నుండి ఈ దిగుమతులను ఆపేయలేదని, ఈ ప్రక్రియ ప్రారంభమైందని కూడా చెప్పడం అనేక సందేహాలకు అనుమానాలకు దారితీస్తోంది.

అమెరికాతో ఇంధన సంబంధాల విస్తరణపై చర్చలు జరుగుతున్నాయని, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక ఇంధన బంధానికి మంచి ప్రోత్సాహం ఇవ్వడంకోసం ట్రంప్ పాలనాయంత్రాంగంతో భారత్ సంభాషణలు చేస్తోందని జైస్వాల్ చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు వాణిజ్య చర్చల పునఃప్రారంభం అవుతున్నాయి. భారత వాణిజ్య బృందం అమెరికా వెళుతున్నది.

భారత్ నుండి ఎన్నో రకాల సరుకులు అమెరికాకు వస్తున్నాయని, కానీ అమెరికా నుండి భారత్‌కు వెళ్ళే ఎగుమతులు చాలా చాలా తక్కువ అనీ ట్రంప్ పదే పదే భారత్‌ను విమర్శించారు. ఆ తర్వాతే వాణిజ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. కానీ భారత్‌కు అమెరికా దౌత్యవేత్తగా నియమితుడైన సెర్గీ గోర్ గతవారంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశం జరిపిన తర్వాత రెండు దేశాల వాణిజ్య సంబంధాల్లో కొత్త మార్పులు వచ్చాయని, అమెరికాతో సంబంధాల మెరుగుదలకు కొత్త మార్గం ఏర్పడి ఆశాభావం పెరిగిందని కేంద్రం నుండి సంకేతాలు వచ్చాయి. భారత్‌తో సంబంధాలకు అమెరికా ఎంతో విలువ ఇస్తోందని సెర్గీ గోర్ చెప్పారు. వచ్చేనెలాఖరునాటికి రెండు దేశాలూ వాణిజ్య చర్చలను ముగించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న తరుణంలో ట్రంప్‌ను శాంతిపజేసేందుకు అమెరికా ఇంధనం కొనుగోళ్ళకు భారత్ మొగ్గుచూపుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

## మోదీ హామీ ఇచ్చారు (మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా దెబ్బతినేవిధంగా ట్రంప్ చర్యలకు పూనుకున్నారు. భారీ ఎత్తున 50 శాతం మేరకు భారత్‌పై ట్రంప్ సుంకాలు విధించారు. రష్యా నుండి ముడి చమురును భారత్ కొనుగోలు చేయడంపై అమెరికా ఎంతమాత్రం సంతోషంగా లేదని, ఈ విధమైన కొనుగోళ్ళు పుతిన్ చేస్తున్న యుద్ధానికే ఉపయోగపడతాయని ట్రంప్ అన్నారు. ఐతే ట్రంప్ అలా చెప్పిన వెంటనే భారత ప్రభుత్వం స్పందించలేదు. ''మోదీ నా స్నేహితుడు, మా మధ్య గొప్ప అనుబంధం ఉంది, రష్యా చమురు కొనడంవల్ల ఆయనపట్ల మేం సంతోషంగా లేం, హాస్యాస్పదమైన ఈ యుద్ధాన్ని రష్యా కొనసాగించాలని మేం కోరుకోవడం లేదు, దీనివల్ల ఉక్రేన్ ప్రజలను కోల్పోతోంది, లక్షలకోట్లను రెండు దేశాలూ కోల్పోతున్నాయి'' అని ఒక ప్రశ్నకు సమాధానంగా ట్రంప్ చెప్పారు. ''భారత్ వెంటనే ఇప్పటికిప్పుడు ముడి చమురు కొనుగోళ్ళను ఆపలేదు, కానీ ఆ ప్రక్రియ మాత్రం ప్రారంభం అవుతుంది, ట్రంప్—మోదీ గాఢమైన స్నేహితులని ప్రపంచం విశ్వసిస్తున్న తరుణంలో, రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకుగాను జరిమానా పేరుతో 25 శాతం సుంకాలు గడచిన ఆగస్టులో ట్రంప్ విధించడం భారత్‌కు అవమానకరంగా మారింది. 140 కోట్ల జనాభాగల అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారత్ తన అవసరాలు తీర్చుకోవడానికి దేశీయ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ ధరలకు లభించేచోట చమురు కొనుగోలుపై భారత్ తన నిర్ణయాలు తాను తీసుకుంటుందని, ప్రతిదేశం తన ప్రయోజనాలకు కట్టుబడే నిర్ణయాలు తీసుకుంటున్నదని ఇది అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం కాదని మోదీ ప్రభుత్వం సున్నితంగా తన వాదనలు వినిపిస్తుండగా, ట్రంప్ మాత్రం రష్యా నుండి భారత్ చమురు కొనుగోలు చేయడం ద్వారా ఆ దేశానికి భారీ ఎత్తున లాభాలు చేకూరుస్తోందని, ఆ లాభాలతోనే ఉక్రేన్‌లో రష్యా యుద్ధం కొనసాగిస్తోందని ఆరోపిస్తున్నారు. ఉక్రేన్‌లో రష్యా యుద్ధం కొనసాగించడానికి పరోక్షంగా భారతదేశమే కారణమని ట్రంప్ ఆరోపిస్తున్నారు. మరోవైపు కొన్ని యూరప్ దేశాలు కూడా రష్యా నుండి చమురు కొనుగోళ్ళు చేస్తున్నాయి. ప్రపంచంలో రష్యా నుండి భారీస్థాయిలో చమురు కొనుగోలు చేస్తున్న మొదటిదేశం చైనా కాగా, రెండో దేశం భారత్. పశ్చిమ దేశాలు రష్యాపై విధించిన ఆంక్షల ప్రమేయం లేకుండా రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్ళు చేస్తున్నది.

**రష్యాపై ఒత్తిడి పెంచేందుకే ట్రంప్ వ్యాఖ్యలు : చైనా విశ్లేషణ**

రష్యా నుండి చమురు కొనుగోళ్ళ భారత్ నిలిపివేస్తుందని ట్రంప్ చేసిన ప్రకటనపై చైనా మార్కెట్ నిపుణులు విశ్లేషణ చేస్తూ, రష్యాపై ట్రంప్ తన ఒత్తిడిని పెంచడంకోసమే ట్రంప్ ఈ విధమైన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. గాజాలో యుద్ధం ముగించిన తర్వాత ఇప్పుడు ట్రంప్ తన సర్వశక్తులను రష్యా—ఉక్రేన్ యుద్ధం ముగించడంపైనే కేంద్రీకరించే ప్రయత్నం చేస్తారని, రష్యాను ప్రభావితం చేయడంకోసమే ఈ విధమైన ప్రకటనలకు పూనుకున్నారని వారు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఎనిమిది యుద్ధాలను తాను ఆపాననీ, ఇప్పుడు గాజాలో తొమ్మిదో యుద్ధాన్ని కూడా పరిష్కరించానని ట్రంప్ చెప్పడం ప్రారంభించారు. నోబెల్ శాంతి బహుమతి ఆయనకు దక్కకపోవడంతో ఆ బహుమతి కోసం తాను ఇదంతా చేయడంలేదని, పైగా 2024వ సంవత్సరంలో చేసిన కృషికిగాను ఆ శాంతి బహుమతి ప్రకటించారంటూ వచ్చే ఏడాది శాంతి బహుమతి తనదేనన్నట్టు ట్రంప్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉక్రేన్‌లో యుద్ధం ఆపితే నోబెల్ బహుమతి ఇస్తామని స్టాక్‌హోం శాంతి కమిటీ తనకు చెప్పారని కూడా ఒక సందర్భంగా ట్రంప్ అన్నారు. ''వీలైనంత త్వరగా ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారంచ చేసుకోవాలని లేకపోతే తీవ్ర పరిణామాలను రష్యా ఎదుర్కోవాల్సి వస్తుందని వారం క్రితమే ట్రంప్ చేసిన హెచ్చరికను రష్యా అధ్యక్షవర్గాలు కొట్టిపారేశాయి. పైగా ఉక్రేన్‌పై యుద్ధాన్ని రష్యా దళాలు ఉద్ధృతం చేశాయి.'

**భారత్ మాకు సహకరిస్తుంది : రష్యా దృఢ విశ్వాసం**

ముడి చమురు కొనుగోళ్ళు కొనసాగించే విషయంలో భారతదేశం తమకు సహకరిస్తుందని రష్యా దృఢమైన విశ్వాసం వ్యక్తం చేసింది. రష్యా నుండి చమురు కొనుగోళ్ళు ఆపేస్తామని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ ప్రకటించిన తర్వాత మాస్కోలో గురువారం రష్యా ఉప ప్రధానమంత్రి అలెగ్జాండర్ నోవాక్ పాత్రికేయులతో మాట్లాడుతూ, తమ దేశ ఇంధన వనరుల సరఫరాలను కొనసాగించే విషయంలో భారత్ పూర్తి సహకారం అందిస్తుందని తాము ఎంతో విశ్వాసంతో ఉన్నామన్నారు. ''మా స్నేహపూర్వక భాగస్వాములతో మేం సహకరిస్తూనే ఉన్నాం, మా ఇంధన వనరులకు ప్రపంచంలో మంచి డిమాండ్ ఉంది, సహేతుకమైన వనరులు, రష్యా నుండి జరిగేవన్నీ ఆర్థికంగా ఎంతో లాభదాయకమైన ఇంధన వనరులు,మా వాణిజ్య భాగస్వామ్య దేశాలు, మిత్రదేశాలు ఎప్పటికప్పుడు మాతో సంభాషిస్తూ, ఇంధన సహకారాన్ని అభివృద్ధి చేసుకుంటారని మేం విశ్వాసంతో ఉన్నాం'' అని నోవాక్ చెప్పారు.

'భారత్ మా ఇంధన వనరుల కొనుగోళ్ళు ఆపేస్తుందన్న సంకేతాలను మీడియాలో మాత్రమే మేం చూస్తున్నాం, ఎవరూ మాకు చెప్పలేదు, పైగా మా భాగస్వాములు మాకు చెప్పింది ఏమిటంటే, ఎవరూ వారిని నిర్దేశించలేరు, వారి స్వీయ మార్గాన్ని వారు ఎంచుకుంటారు'' అని నోవాక్ అన్నారు. అంతకుముందు భారత విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, భారత అధికారులు ఇంధన దిగుమతుల రంగంలో వినియోదారుల ప్రాధాన్యతలపై ప్రధానంగా దృష్టిసారించి నిర్ణయం తీసుకుంటారన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జరిగినప్పుడే 'స్థానిక' ఎన్నికలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చట్టపరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జరిగినప్పుడే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తన ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బిసి జెఎసి ప్రకటించిన రాష్ట్ర బంద్‌లో అందరూ పాల్గొనాలని కోరారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్‌కు చెందిన బిసి ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ మావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, వి.శ్రీనివాస్‌గౌడ్, ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌ఎలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్‌తో పాటు మాజీ ఎంఎల్‌ఎలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌ను పాల్గొన్నారు. ఈనెల 18న జరగనున్న రాష్ట్రబంద్‌లో ప్రతి బిసిలు పాల్గొనాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన సరిగా జరగలేదని, కులగణన సర్వేపత్రంపైన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటో పెట్టడం తప్పు అని అన్నారు.

# ఎస్‌పిసిఎ లోగో ఆవిష్కరణ



**పోలీస్ అధికారుల నుండి ఇబ్బందుల గురించి ఆరోపణలపై స్వతంత్ర విచారణ చేసేందుకు ఏర్పాటు**

**ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లెంట్స్ అథారిటీ (ఎస్‌పిసిఎ) వెబ్ సైట్ లోగోను సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్, డిజిపి శివధర్ రెడ్డి, సిసిజిడిజి రవిగుప్త, ఇంటలిజెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, మల్టిజోన్ 1 ఐజి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌పిసిఎ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ శివశంకర్ రావు, సభ్యులు రామనర్సింహారెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేట్ పోలీస్ కంప్లైంట్ అథారిటీ ఇటీవల ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 2006లో ప్రకాశ్‌సింగ్ వి కేసులో ప్రతి రాష్ట్రంలో స్టేట్ పోలీసు కంప్లైంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ పోలీసు కంప్లైంట్ అథారిటీ (డిపిసిఎ)ను కూడా ఏర్పాటు చేయాలని ఉత్తర్వులో పేర్కొంది. ప్రజలు పోలీస్ అధికారుల నుండి ఇబ్బందుల గురించి ఆరోపణలపై పారదర్శక, స్వతంత్ర విచారణ చేసేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఇటీవల తెలంగాణలో ఎస్‌పిసిఎ కార్యాలయాన్ని బిఆర్‌కెఆర్ భవన్‌లో డి బ్లాక్, 8వ అంతస్తులో ప్రారంభించారు. ఈ కార్యాలయాన్ని అధికారికంగా రిటైర్డ్ న్యాయమూర్తి బి.శివశంకర్‌రావు ప్రారంభించారు. పై ర్యాంకులైన పోలీస్ అధికారులపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, చట్టబద్ధంగా విచారించాల్సిన బాధ్యత ఈ అథారిటీకి ఉంది. ప్రజలు పోలీస్ అధికారి అధికార దుర్వియోగంపై గురించి ఫిర్యాదుల అథారిటీకి రాయవచ్చు. ఏ పోలీస్ ఉద్యోగి తప్పు చేశారని నిర్ధారణ అయితే, ఎస్‌పిసిఎ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి చర్యలు తీసుకోవాలని సూచనలు చేయాలి.

# 'పర్యాటకం'లో సుస్థిర అభివృద్ధే లక్ష్యం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యాటకాన్ని సంస్కృతి, సాంప్రదాయల్లో భాగంగా చేస్తామని, తద్వారా సుస్థిర పర్యాటక అభివృద్ధి జరుగుతుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'గ్లోబల్ టూరిజం సుస్థిర అభివృద్ధికి నూతన మార్గాలు' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధి కోసం పర్యాటకాన్ని సంస్కృతితో అనుసంధానం చేయాల్సిన, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన, ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ కొత్త పర్యాటక విధానం ఈ రంగాన్ని పునరుత్తేజితం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నుండి వెలువడే సూచనలు, సిఫార్సులను విధానాల మెరుగుదలకు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ఆ రంగంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా సంకల్పించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోందని అన్నారు. రాష్ట్రంలో రూ.15వేలకు పైగా కోట్ల పెట్టుబడుల సమీకరణ, 3 లక్షల ఉద్యోగాల కల్పన, రెట్టింపు వృద్ధి, పర్యాటకుల సంఖ్య పెంపుదల, మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టుల మేళవింపుతో రూపొందించిన నూతన పర్యాటక విధానం ద్వారా పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకువెళ్లుతున్నామని చెప్పారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలో ముందుకు వెళుతున్నామని, టూరిజం కాంక్లేవ్‌లో రూ.15వేల కోట్లకు పైగా పిపిపి మోడల్‌లో పెట్టుబడులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. ప్రభుత్వానికి వ్యాపారాత్మక ధోరణి లేదని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ప్రభుత్వం పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని అందుకు పిపిపి మోడల్ పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న పర్యాటక కేంద్రాలను వినియోగంలోకి తేవడానికి కృషి చేస్తున్నామని, తద్వారా వచ్చే ఆదాయంతో పర్యాటక రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పర్యాటకాన్ని మనం సంస్కృతి, సాంప్రదాయాల్లో భాగంగా చేస్తామని, తద్వారా సుస్థిర అభివృద్ధి సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారంలు హాజరయ్యారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మద్దతివ్వండి



**బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో కలిసిరండి : టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**20న జరిగే రాష్ట్ర కమిటీలో నిర్ణయం తీసుకుంటామని సిపిఐ(ఎం) హామీ**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీనకుమార్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసిరావాలని సిపిఐ(ఎం)ను టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ కోరారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఇతర నాయకులతో మహేష్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. ఈ భేటీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, తదితర అంశాలపై వారు చర్చించారు.
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సిపిఐ(ఎం) మద్దతును మహేష్ కుమార్ గౌడ్ కోరగా, ఈ విషయంపై హైదరాబాద్ నగర కమిటీలో చర్చలు జరుగుతున్నాయని, ఈనెల 20న జరిగే పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలలో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్ వెస్లీ హామీ ఇచ్చారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని, అనంతరం అన్ని పార్టీల నాయకులతో కూడిన బృందానికి ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలని జాన్ వెస్లీ కోరారు. ఢిల్లీలో జాతీయ, ఇతర ప్రధాన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాన్ని కూడా చేయాలని, తద్వారా కేంద్రంపై ఈ విషయంలో తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి విజయం సాధించగలుగుతామన్నారు. అఖిల పక్ష సమావేశం నిర్వహణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అన్ని పార్టీల నేత బృందాన్ని తీసుకెళ్లడం అంశాలపై త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తామంటూ మహేష్ కుమార్ గౌడ్ సానుకూలతను వ్యక్తం చేశారు. సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, టి.సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, రాష్ట్ర నాయకులు డి.జి. నరసింహారావు, పి.ఆశయ్య పాల్గొన్నారు.

# పారదర్శకంగా కొనుగోలు కార్యకలాపాలు

**వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొనుగోలు కార్యకలాపాలు పారదర్శకంగా, సమర్థవంతంగా, సమన్వయంగా జరిగేలా చూడాలని వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు సజావుగా కొనసాగించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. '2025–26 సంవత్సరానికి సంబంధించిన పత్తి, వరి, మక్కజొన్న' తదితర పంటల కొనుగోలు కార్యక్రమంపై వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్ష నిర్వహించారు.
జిల్లాలలో పంటల కొనుగోలు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు నియమితులైన ప్రత్యేక అధికారులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు, ప్రాంతీయ ఉప సంచాలకులు (మార్కెటింగ్), ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (మార్కెటింగ్), జిల్లా వ్యవసాయ అధికారులు, జిల్లా సహకార అధికారులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) శాఖ మేనేజర్లు, ఎన్ఐసి హైదరాబాద్ అధికారులు, వన్ సాఫ్ట్ సిస్టస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పత్తి కొనుగోలు కార్యకలాపాల ప్రాసెస్ ఫ్లో, కప్పాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్, వినియోగ విధానం, రైతులు కొనుగోలు కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ విధానం, అలాగే పాత జిల్లాల పరిధిలో జిన్నింగ్ మిల్లుల మ్యాపింగ్ ప్రక్రియ వంటి అంశాలను దశలవారీగా వివరించారు. రైతుల నమోదు, స్లాట్ బుకింగ్, అసలు అమ్మకం, ప్రక్రియలను కూడా చర్చించారు. రాష్ట్రంలో రైతుల వివరాలు క్రాప్ బుకింగ్ ద్వారా ఇప్పటికే నమోదైన నేపథ్యంలో ప్రత్యేకంగా రైతుల నమోదు అవసరం లేదని, క్రాప్ బుకింగ్ డేటా కప్పాస్ కిసాన్ యాప్‌తో సమన్వంగా ఉంటుందని సమావేశంలో వివరించారు. క్రాప్ బుకింగ్‌లో నమోదైన రైతుల మొబైల్ నంబర్లు సరిగా ఉన్నాయా? లేదా? అనేది తప్పనిసరిగా ధృవీకరించాలని, ఎవరైనా రైతుల మొబైల్ నంబర్లు తప్పుగా నమోదైతే వాటిని యాప్ ద్వారా సవరించాలని కె.సురేంద్ర మోహన్ సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా ఎఇఒ ద్వారా టిజి ప్రొక్యూర్‌మెంట్.ఇన్‌లో నమోదు కావాలని, ఆ డేటా కప్పాస్ కిసాన్ యాప్‌కు నేరుగా పంపిస్తారని, అప్పుడే సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద తమ పత్తిని అమ్ముకునే అవకాశం ఉంటుందని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5779 ద్వారా హెల్ప్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, రైతులు ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

## మీడియా అకాడమీ పాలకమండలి కమిటీ సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తుల ఆహ్వానం

**మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మీడియా అకాడమీ పాలకమండలి కమిటీ సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ నుండి 30వ తేదీ సాయింత్రం 5 గంటల వరకు స్వయంగా కానీ లేదా అకాడమి కార్యాలయ చిరునామాకు పోస్టు ద్వారా కాని సమర్పించవలసిందిగా తెలియజేశారు. తెలంగాణ మీడియా అకాడమీ పాలకమండలి సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తూ ప్రముఖ తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ దినపత్రికలలో ప్రకటన జారీ చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.
ఈ కమిటీలో సభ్యులుగా పనిచేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులను జర్నలిస్టు సంఘాలు తమ ప్రతినిధులుగా ప్రతిపాదించడానికి దరఖాస్తులను మీడియా అకాడమి వెబ్‌సైట్ https://mediaacademy.telangana.gov.in/ నుండి డౌన్ లోడ్ చేసుకోవాలని లేదా నాంపల్లిలోని అకాడమి కార్యాలయంలో దరఖాస్తులను పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు మీడియా అకాడమీ వెబ్‌సైట్ https://mediaacademy.telangana.gov.in/లో సంబంధిత ప్రకటనను డౌన్ లోడ్ చేసుకోవాలని అకాడమీ కార్యదర్శి తెలిపారు.



## బిసి జెఎసి రాష్ట్ర బంద్‌కు డిహెచ్‌పిఎస్ సంపూర్ణ మద్దతు

**మారుపాక అనిల్ కుమార్ డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు నిజమైన న్యాయం చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) డిమాండ్ చేసింది. బిసి జెఎసి ఈ నెల 18న చేపట్టిన రాష్ట్ర బంద్‌కు డిహెచ్‌పిఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితి సమావేశం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని డాక్టర్ రాజ్‌బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో కలిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ బిసి బిల్లులను ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణమని విమర్శించారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర నాయకులు టి.రామకృష్ణ, జై.కుమారస్వామి, కె.రత్నకుమారి, బోయిని అశోక్, పొన్నగంటి లావణ్య, బి.రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో 170 మంది నక్సల్స్ లొంగుబాటు

**న్యూఢిల్లీ :** గత రెండు రోజుల్లో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో 258 మంది మావోయిస్టులు లొంగిపోయారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం ప్రకటించారు. నక్సల్స్ లొంగిపోతే వారిని స్వాగతిస్తామని, తుపాకీని ప్రయోగించడం కొనసాగించే వారు భద్రతా దళాల ఆగ్రహాన్ని ఎదుర్కొంటారని ఆయన స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని రెండు అత్యంత ప్రభావిత ప్రాంతాలు ఇప్పుడు నక్సల్ ఉగ్రవాదం నుండి విముక్తి పొందాయని కూడా షా ప్రకటించారు. దీనిని ఒక మైలురాయిగా పేర్కొంటూ రాష్ట్రంలో 27 మంది, మహారాష్ట్రలో 61 మంది తమ ఆయుధాలను విడిచిపెట్టిన ఒక రోజు తర్వాత గురువారం ఛత్తీస్‌గఢ్‌లో 170 మంది నక్సలైట్లు లొంగిపోయారని ఆయన ప్రకటించారు. గత రెండు రోజుల్లో మొత్తం 258 మంది వామపక్ష తీవ్రవాదులు హింసను త్యజించారని ఆయన అన్నారు. 'భారత రాజ్యాంగంపై నమ్మకం ఉంచి, హింసను త్యజించాలనే వారి నిర్ణయాన్ని నేను అభినందిస్తున్నాను. ప్రధాన మంత్రి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ ముప్పును అంతం చేయడానికి అవిశ్రాంత కృషి చేయడం వల్ల నక్సలిజం తుది శ్వాస విడిచిందని ఇది రుజువు చేస్తుంది' అని ఆయన అన్నారు. 2026 మార్చి 31కి ముందు నక్సలిజాన్ని నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఒకప్పుడు ఉగ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మర్, ఉత్తర బస్తర్‌లను నేడు నక్సల్ ఉగ్రవాదం నుండి విముక్తి పొందినట్లు ప్రకటించడం చాలా ఆనందంగా ఉందని, ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని, దీనిని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయన్నారు.

# 'లొంగుబాట'లో మరికొందరు



**జాబితాలో-రూపేష్, రనిత సహా 140 మంది మావోయిస్టులు ధృవీకరించిన ఛత్తీస్‌గఢ్ సిఎం కార్యాలయం**

**ప్రజాపక్షం/ఖమ్మం :** మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతుంది. మల్లోజుల వేణుగోపాల్ లొంగిపోయిన కొన్ని గంటల్లోనే పెద్ద సంఖ్యలో మరి కొంత మంది మావోయిస్టులు లొంగిపోయేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంలో దశాబ్దాల పాటు ఉద్యమాన్ని నడిపిన సీనియర్ లీడర్ రూపేష్, దండకారుణ్యం స్పెషల్ జోనల్ కమిటీ మాడ్ డివిజన్ ఇన్‌చార్జి రనిత సహా 140 మంది మావోయిస్టులు లొంగిపోయేందుకు బయలుదేరినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఛత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ్‌శర్మ సమక్షంలో లొంగిపోనున్నట్లు సీనియర్ పోలీస్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రూపేష్ కేంద్ర కమిటీకి, దండకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీకి సంధానకర్తగా వ్యవహరించడంతో పాటు మాడ్ ప్రాంతంలో మావోయిస్టులకు శిక్షణ ఇచ్చేవాడు. బస్తార్ ప్రాంతంలో విప్లవోద్యమ కార్యక్రమాలను నిర్వహించిన రనిత కూడా ప్రభావితం చేయగలిగిన నాయకురాలిగా పేరొందారు. దండకారుణ్యంలో పలు హింసాత్మక చర్యలు చేపట్టడంలోనూ, పార్టీని విస్తరించడంలోనూ కీలక భూమిక పోషించిన వీరిద్దరు లొంగిపోవడంతో మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపనుంది. మొత్తం 140 మంది లొంగిపోనుండగా ఇందులో సెంట్రల్ కమిటీ సభ్యులు ఒకరు, మాడ్ డివిజనల్ కమిటీ సభ్యులు ఒకరు సహా మొత్తం 140 మంది లొంగిపోనున్నారు. ఇదే విషయమై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. నక్సలిజానికి వ్యతిరేకంగా ఈ రోజు గుర్తుంచుకోదగినదని నిన్న 61 మంది ఆయుధాలను వీడితే నేడు మరో 170 మంది ఆయుధాలను వీడేందుకు సిద్ధమయ్యారని ఆయన పేర్కొన్నారు.

**బంద్‌కు మావోయిస్టుల మద్దతు :**
బిసిలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బిసి సంఘాలు ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు అధికార ప్రతినిధి జగన్ పేరుతో మావోయిస్టు పార్టీ ఒక లేఖను విడుదల చేసింది.
11 ఏళ్లుగా ఈ దేశాన్ని బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పాలిస్తున్నారని కుల, మత వ్యవస్థలను బలోపేతం చేస్తూ మనుస్మృతిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల క్రితం శాసనసభలో 42 శాతం బిసిలకు రిజర్వేషన్ కోరుతూ బిల్లును ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపితే ఇంతవరకు ఆమోదించక పోవడం శోచనీయమన్నారు. జీవో నెం 9 విడుదలను మావోయిస్టు పార్టీ సమర్థిస్తుందన్నారు. ఈ సమస్యకు పరిష్కారానికి జరుగుతున్న ఆందోళనకు మావోయిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ప్రజా పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని ఆ లేఖలో పేర్కొన్నారు.


**బహిరంగ ప్రకటన**

నా క్లయింట్లు 1) మెస్సర్స్ ఎకో–ఫ్రెండ్లీ ఆగ్రో ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్., నమోదిత కార్యాలయం: బంజారాహిల్స్, హైదరాబాద్, 2) పి.వేణుగోపాల్ రావు, తండ్రి: లింగయ్య, R/o. నల్గొండ, 3) మున్నలూరు శాంత సత్యానంద ప్రకాశ గుప్తా, తండ్రి: బసవేశ్వర రావు, R/o తుని, తూర్పు గోదావరి జిల్లా, 4. నిమ్మల నరేందర్ గౌడ్, తండ్రి: సదానందం గౌడ్, R/o సరూర్‌నగర్, హైదరాబాద్ మరియు 5. ఉట్ల మల్లేశ్వర్ రావు, తండ్రి ఉట్ల భూషయ్య, R/o సరూర్‌నగర్, హైదరాబాద్ సూచనల మేరకు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై మా క్లయింట్లు D.T.L.P. No. 256/2019 ప్రకారం DTCP ద్వారా ఆమోదించబడి ఎ. 28–55 సెంట్ల విస్తీర్ణం, సర్వే నం. 144/P, 154/P, 169/P మరియు 170/P లో నివాస ప్లాట్ల లేఅవుట్ అనుమతి పొందారు మరియు ప్రొసీడింగ్ నం. 4707/2019/H తేది: 25–11–2019 క్రింద పెద్దాపూర్ గ్రామ పంచాయతీ ద్వారా పర్మిషన్ మంజూరు చేయబడింది. మా క్లయింట్లు సదరు ప్రాజెక్టుతో ముందుకు సాగుటకు ఇష్టం లేనందున ఇటీవల సదరు లేఅవుట్ అనుమతి రద్దుకు మరియు అది చెల్లనిదిగా పరిగణించుటకు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (DTCP) వారిని స్వచ్ఛందంగా కోరారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, తెలంగాణ ప్రభుత్వం వారు సంతృప్తి చెంది సదరు లేఅవుట్ రద్దుకు అంగికరించారు మరియు జిల్లా పంచాయతీ రాజ్ ఆఫీసర్, నాగర్‌కర్నూల్ జిల్లా వారిని, వారి ఆఫీసు Lr.Roc.No.5059/2025/H1, తేది: 13.10.2025 ద్వారా లేఅవుట్ రద్దు చేయవలసిందిగా కోరారు. అందువల్ల ప్రజా సమాచారం కోసం లేఅవుట్ రద్దు గురించి ఈ బహిరంగ ప్రకటన.

సం/- బి. జనార్ధన్ రెడ్డి, అడ్వకేట్
ఫ్లాట్ నం. 503, పార్క్ వ్యూ GS అపార్ట్‌మెంట్స్,
ఎల్లారెడ్డిగూడ రోడ్, శ్రీనగర్ కాలనీ,
హైదరాబాద్– 500073. ఫోన్: 9848078075

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: రామాయంపేట్**

'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

1) e-NIT Nos.E1/MCR/Construction of Community Halls, Laying of RCC NP3 Pipeline, Drilling of Borewell MGF/15th FCG/SDF Grants 2025

పనుల సంఖ్య: 6,
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 17.10.2025న సా.5.00గం.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది : 25.10.2025న సా.5.30గం.ల వరకు
ప్రైస్ బిడ్ ప్రారంభ తేది (ఫైనాన్షియల్ బిడ్ స్టేజ్) : 25.10.2025న సా.5.35గం.లకు

గమనిక: టెండర్ గురించిన వివరణాత్మక సమాచారాన్ని tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు. ఇతర సమాచారం కోసం రామాయంపేట మున్సిపాలిటీ, కమిషనర్ & ఇంజనీర్‌ను సంప్రదించవచ్చు. ఫోన్ నం. 7989695428, 9948296849.

సం/- కమిషనర్, రామాయంపేట్ మున్సిపాలిటీ
DIPR R.O. No. : 9349-PP/CL/ADVT/1/2025-26, Date: 16-10-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
గాజులరామారం సర్కిల్–26

NIT No. 19/DB/EE/GJRM/CIRCLE-26/KPZ/GHMC/2025-26 తేది: 15.10.2025

**పని పేరు:** నాలా బ్రిడ్జ్ & కల్వర్ట్ నిర్మాణం, **అంచనా విలువ:** రూ. 16.00 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 16.10.2025న మ.03.00 గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 25.10.2025న మ.03.30గం.ల వరకు. ఇఇ **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-26, జిహెచ్ఎంసి. 9849906776. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 9293-PP/CL/ADVT/1/2025-26, Date: 16-10-2025

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా.**

టెండర్ నోటీసు నెం.E1/CC Road/GF/2025-26 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేదీ: 15.10.2025

కల్వకుర్తి మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ కింద (2) పనులకు టెండర్లను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం నుండి పిలవడమైనది.

| | |
|---|---|
| అంచనా విలువ | రూ. 06.00 లక్షలు |
| పని పేరు | కల్వకుర్తి మున్సిపాలిటీలో వార్డు నెం.18 వద్ద హసన్ ఇల్లు నుండి ముత్యాలు ఇంటి వరకు సిసి రోడ్ వేయుట. |
| బిడ్ దాఖలుకు ప్రారంభ తేది మరియు సమయం | 17.10.2025న ఉ.11.30గం.లకు |
| బిడ్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం | 25.10.2025న సా.04.30గం.లకు |
| అంచనా విలువ | - |
| పని పేరు | కల్వకుర్తి మున్సిపాలిటీలో నీటి సరఫరా, వీధి దీపాలు మరియు ఇతర సాధారణ పనుల నిర్వహణ కోసం నీటి సరఫరా సామాగ్రి, విద్యుత్ సామాగ్రి మరియు టెంట్ హౌస్ సామాగ్రి, జెసిబి (గంట ప్రాతిపదికన), డోజర్ (గంట ప్రాతిపదికన) వంటి సాధారణ వస్తువుల కోసం సీల్డ్ కోటేషన్లు కోరబడ్డాయి. |
| బిడ్ దాఖలుకు ప్రారంభ తేది మరియు సమయం | 17.10.2025న ఉ.11.30గం.లకు |
| బిడ్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం | 18.10.2025న సా.04.30గం.లకు |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానించే అధికారి: కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నెం. 9110540243, 7331109838.

సం/- కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 9288-PP/CL/ADVT/1/2025-26, Date: 16-10-2025

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం : సిద్దిపేట్, (సిద్దిపేట్ జిల్లా)**

టెండర్ నోటీస్ నెంబర్ : E1/2158/2025 ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తేదీ: 14.10.2025

సిద్దిపేట్ మున్సిపాలిటీలో లభ్యమయ్యే చికెన్, మటన్, చేపల వ్యర్థాలను షరతుల ప్రాతిపదికన సేకరించడానికి అనుభవజ్ఞులైన ఏజెన్సీల నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI)ను ఆహ్వానించడమైనది.

ఆసక్తిగల ఏజెన్సీలు తమ డాక్యుమెంట్లను తేదీ: 18-10-2025 సుంచి సిద్దిపేట్ మునిసిపాలిటీ నుండి సమర్పించవచ్చు. టెండర్ పత్రాలను సమర్పించడానికి ఆఖరి గడువు 27-10-2025 మధ్యాహ్నం 3గంటల వరకు. దరఖాస్తుదారుడు ఆసక్తి వ్యక్తీకరణ పత్రాల (తిరిగి చెల్లించలేని) కోసం కమిషనర్ సిద్దిపేట్ మున్సిపాలిటీ పేరిట చెల్లుబాటు అయ్యేలా రూ. 10,000/- డిమాండ్ డ్రాఫ్ట్ (DD)ను సిద్దిపేట్ మున్సిపాలిటీకి చెల్లించాలి.

ఏదైనా ప్రశ్నల కోసం దయచేసి **కమిషనర్ సిద్దిపేట్ మున్సిపాలిటీ లేదా మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, సిద్దిపేట్ మున్సిపాలిటీ 9505507247** (లేదా) సిద్దిపేట్ మున్సిపాలిటీ కార్యాయలంలో ఉదయం 10.00గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సంప్రదించండి. EOI పత్రం యొక్క ఇతర నిబంధనలు మరియు షరతుల కోసం https://siddipetmunicipality.telangana.gov.in/కు లాగాన్ అవ్వండి.

సం/- కమిషనర్ సిద్దిపేట్ మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 9303-PP/CL/ADVT/1/2025-26, Date: 16-10-2025

## విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన యువ రైతు జటమోని వెంకటేష్(22) తన సొంత వ్యవసాయ పొలానికి గురువారం ఉదయం వెళ్ళి వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల కురిసిన వర్షం, గాలిదుమారానికి తెగి పడి ఉన్న విద్యుత్ ఎల్‌టి లైన్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారి తల్లిదండ్రులు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో 2వ స్థానంలో నల్లగొండ

### గృహనిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్‌కు ల్యాప్ టాప్, ప్రశంసాపత్రం బహుకరణ



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, గ్రౌండింగ్, చెల్లింపులు, ఇండ్ల పురోగతిలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది.జిల్లా రెండో స్థానంలో నిలిచినందుకుగాను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ పి. గౌతమ్ జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు .అంతేకాక బుధవారం హైదరాబాద్ లోని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజక్టు డైరెక్టర్ రాజకుమార్ ను అభినందించడమే కాక,ల్యాప్ టాప్ ను,ప్రశంసా పత్రాన్ని అందజేశారు.కాగా జిల్లాకు ఇందిరమ్మండ్ల పథకం కింద మొత్తం 19625 గృహాలు కేటాయించగా, జిల్లా యంత్రాంగం 17247 గృహాలను మంజూరు చేసింది. ఇప్పటివరకు 13581 గృహాలు గ్రౌండ్ కాగా, వాటిలో 10116 గృహాలు వివిధ దశలలో ఉన్నాయి వీటిలో కొన్ని గృహాలు పూర్తయ్యాయి. ఒక్క సెప్టెంబర్ మాసంలోనే జిల్లాలో 5919 గృహాలు గ్రౌండ్ అయ్యాయి.అంతేకాక, సెప్టెంబర్ నెలలో జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు 80 కోట్ల రూపాయల చెల్లింపులను చేయడం జరిగింది. జిల్లా రెండో స్థానంలో నిలిచినందుకు గాను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ ను శాలువాతో సన్మానించారు.

## ప్రజల్లో బలం ఉన్నవారికే డిసిసి పదవి

### ఎఐసిసి కార్యదర్శి బిస్వరంజన్ మహంతి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రజల్లో బలం ఉన్నవారికే డీసీసీ అధ్యక్ష పదవి లభిస్తుందని, జిల్లా కమిటీల్లో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి, డీసీసీ అధ్యక్ష ఎన్నికల ఇన్‌చార్జి బిస్వ రంజన్ మహంతి అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంగటన్ సృజన్ అభియాన్ సమావేశ కార్యక్రమానికి ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లతో కలిసి పాల్గొని మాట్లాడారు. నిరంతరం పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు అందరి ఏకాభిప్రాయంతో పదవులు కల్పిస్తామన్నారు. కమిటీలలో ప్యారా చూట్‌లకు అవకాశం లేదని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు 50వే మెజారిటీతో గెలవగా ఎంపీ అభ్యర్థులు 3లక్షల నుంచి 5లక్షల మెజారిటీతో గెలిచారన్నారు. డీసీసీ అధ్యక్షుడి పదవికి నాయకుల నుంచి అబిప్రాయ సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకట్, టీసీసీ సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య, నాయకులు రామలింగయాదవ్, మహబూబ్ అలీ, స్కైలాబ్‌నాయక్, చిలుకూరి బాలు, పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, గాయం ఉపేందర్‌రెడ్డి, సలీం, ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, ఆరిఫ్, జాని పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం తొలగింపు కోసం ఆర్‌డిఓ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని హజ్రత్ సయ్యద్ సులేమాన్ షావలి ఖాద్రి దర్గా ముతవలిల కుటుంబ సభ్యులు గురువారం ఆర్డీవో కార్యాలయం, మునిసిపాలిటి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎస్‌బిఐ ఏటిఎం వెనుకల 405 సర్వే నెంబర్‌లో కట్టిన అక్రమ నిర్మాణం వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే రెవెన్యూ మరియు వాక్ బోర్డు అధికారులు ఇటీవల వచ్చి జాయింట్ సర్వే నిర్వహించి అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని సర్వే నెంబర్ 405 దర్గా ఇనాం భూమిలో ఉన్నట్టు నిర్ధారించారు. రెవెన్యూ మరియు వాక్ బోర్డు సర్వే నివేదిక రాగానే అక్రమంగా నిర్మించిన కట్టడం వెంటనే తొలగిస్తానని మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ గతంలో కలెక్టర్‌కు ప్రజావాణిలో హామీ ఇచ్చినట్లు ముతవలిల కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఇప్పుడు మునిసిపల్ కమిషనర్ మాట మార్చి ఆర్డీవో తొలగిస్తానని చెప్పడంతో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టక తప్పలేదని వారు పేర్కొన్నారు. ఈ అక్రమ కట్టడాన్ని తొలగింపు మరియు మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు ఇప్పటికే రెండు సార్లు కలెక్టరేట్‌లో ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. తమ ఆందోళనపై అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలగించి న్యాయం చేయాలని దర్గా ముతవలిల కటుంబ సభ్యులు కోరుతున్నారు.

# నా రక్తంలోనే కాంగ్రెస్ పార్టీ ఉంది



### రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు వెనకబడే ఉంది

### ఎఐసిసి పెద్దలు ఎవరిని డిసిసి అధ్యక్షుడిగా ఎంపిక చేసినా మాకు అభ్యంతరం లేదు : ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి

ప్రజాపక్షం/మునుగోడు: తను పుట్టిన నాటి నుంచి నా రక్తంలోనే కాంగ్రెస్ పార్టీ ఇమిడి ఉందని పార్టీ కోసమే పని చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం సంఘటన సృజన్ అభియాన్ లో భాగంగా డిసిసి అధ్యక్షుని ఎంపిక కొరకు నియోజకవర్గంలోని ముఖ్య నాయకుల అభిప్రాయం సేకరణకు ఎఐసిసి మాజీ జనరల్ సెక్రటరీ బిశ్వ రంజన్ మహంతి తో మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలు నాయకులతో డిసిసి అధ్యక్షుడి ఎంపికకు సంబంధించి అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎఐసిసి బిసి, ఎస్‌సి, ఎస్‌టి,మైనార్టీ ఓసిలలో ఎవరిని డిసిసి అధ్యక్షులుగా ఎంపిక చేసిన మా మద్దతు ఉంటుందని, దాంతోపాటు అధిష్టానం మునుగోడు నియోజక వర్గానికి ఇచ్చిన కమిట్మెంట్ కూడా నిలబెట్టుకోవాలని కుండ బద్దలు కొట్టినట్టు ఏకవాఖ్య తీర్మానాన్ని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలం లో వున్నపుడు రాజగోపాల్ రెడ్డి పార్టీని బ్రతికించారని గుర్తు చేశారు 2009 నుండి ఈరోజు వరకు ప్రతిపక్షాలకు ఎదురొడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను నిలబెడుతున్నాడని, మొన్నటికి మొన్న ఎంపి ఎన్నికల్లో ఎవరికీ తెలియని అభ్యర్థిని ఎంపిగా గెలిపించి సత్తా చాటాడని అన్నారు.ఎంపిగా గెలిపించి వస్తే మంత్రి పదవి ఇస్తానని అధిష్టానం హామీ ఇచ్చి హామీను నిలబెట్టుకోలేదన్న విషయాన్ని ఎఐసిసి మాజీ జనరల్ సెక్రెటరీకి తెలిపారు. అనంతరం మహంతి మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి రెండు తెలుగు రాష్ట్రాలలో పేరున్న నాయకుడని, ఆయన స్థాయికి మంత్రి పదవి చిన్నదని, ఇంకా పెద్ద పదవులు అధిష్టించే సత్తా ఉన్ననాయకుడన్నారు.డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్రఅధికార ప్రతినిధి, పున్న కైలాష్ నేత,జిల్లా కాంగ్రెస్ నాయకులున్నారు.

## దీపావళి బాంబుల షాప్ అనుమతికి రూ.8 వేలు లంచం డిమాండ్

### ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారి సత్యనారాయణరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ :జిల్లా కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు వేసిన వలలో అవినీతి తిమింగలం చిక్కింది. గురువారం పక్కా సమాచారం మేరకు ఎసిబి అధికారులు జరిపిన మెరుపు దాడిలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్ర కార్యాలయం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి నాగార్జున కళాశాల సమీపంలో 8వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో నల్లగొండ రేంజ్ యూనిట్ ఎసిబి అధికారుల తనిఖీలు చేపట్టారు. లంచం తీసుకున్న అధికారిని అరెస్టు చేసి,హైదరాబాద్‌లోని నాంపల్లిలోని ఎసిబి కేసుల కోర్టుకు హాజరుపరుస్తున్నారు.

## పట్నం నుండి పల్లెల వరకూ ఆర్‌డిఆర్

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి విగ్రహాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్నం నుండి మొదలకొని పల్లెల వరకు ప్రతిష్ఠించాలని గురువారం ఒక ప్రకనటలో కోరారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలలో ఆయన 5 పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవలు అందించారన్నారు. రైతు బిడ్డగ ఆయన రైతు సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. శ్రీరాంసాగర్ 2వ దశ ప్రాజెక్ట్ నిర్మాణ ప్రధాత అని, చివ్వెంల మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ వద్ద 400 కెవి సబ్‌స్టేషన్‌ను తీసుకవచ్చి రైతులకు కరెంట్ కష్టాలు తీర్చని మహానేత అని కొనియాడారు.

## భవిష్యత్ నిర్ణయించేది ఇంటర్ విద్య



### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

### మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలి

ప్రజాపక్షం/కోదాడ: విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను నిర్ణయించేది ఇంటర్ విద్యా సంవత్సరమేనాని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. గురువారం కోదాడ పట్టణ పరిధి కె.ఆర్.ఆర్. కళాశాలలో ఇంటర్ విద్యార్థుల కెరియర్ గైడెలైన్స్ పై వారికి అవగాహన కలిగించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పోటి ప్రపంచంలో విద్యార్థులు కమ్యూనికేషన్ సిల్స్‌తో పాటు బాడిలాంగ్‌వెజ్‌ను డెవలప్ చేసుకోవాలని సూచించారు. జీవితంలో స్థిర పడేందుకు మనకు సమీపంలోని పెద్దల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కెఆర్‌ఆర్ కళాశాలకు మంచి పేరు ఉందని విద్యార్థులు మంచి మార్కులతో ఉర్తీర్ణత సాధించాలని అందుకు అధ్యాపకులు సహాయ, సహకారులు అందించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, అంగన్‌వాడి సెంటర్లను పరిశీలించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించు మధ్యాహ్న భోజన తయారిలో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. తయారు చేసిన భోజనం, కూరలను ఆయన పరిశీలించా రు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులతో ముచ్చటించి, వారి ఆట, పాటలను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. వీరి వెంట ఆర్డీవో సూ ర్యా నారాయణ, తహసీల్దార్ వాజిద్‌అలీ, ఎంఈఓ సలీంషరీఫ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, అధ్యాపకులు పిచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు ఇంది రా, వెంకటేశ్వర్లు, ఆర్.ఐ రాకేష్, సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య బాధ్యత కెజిబివి అధికారులదే



నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల ద్వారా ఇంకా మెరుగైన విద్యను అందించాల్సిన బాధ్యత కేజీబీవీల ప్రత్యేక అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కేజీబీవీలపై మండల ప్రత్యేక అధికారులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాల యాలలో అదనపు తరగతి గదులు, కాం పౌండ్ వాల్స్, టాయిలెట్లు, సంపుల నిర్మాణం తదితర పనులకై ఇటీవల మండల ప్రత్యేక అధికారుల ద్వారా నిర్వహించిన సర్వే ప్రకారం పనులు మంజూరుకు ప్రభు త్వానికి ప్రతిపాదించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కేజీబీవీలలో అవసరమైన పనులు ,మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని, అయితే విద్య విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదని,కె జి బి వి ల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలని అన్నారు. అలాగే కేజీబీవీ అందిస్తున్న భోజనం నాణ్యతగా ఉండాలని అన్నారు. విద్య, వసతులు, భోజనం అంశాలను ఎస్ ఓ లు సవాల్ గా తీసుకోవాలని, ఆదనపు తరగతి గదుల ప్రారంభం సందర్భంగా స్థానిక శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ,చిన్న చిన్న పనులు సంబంధిత శాఖల అధికారులతో చర్చించి సమన్వయంతో పూర్తి చేసుకోవాలని,కెజిబివిలకు ఇచ్చే చిన్న మొత్తం బడ్జెట్ నుండి చిన్న పనులకు వినియోగించుకోవాలని ఆదేశించారు. ఎం ఎస్ ఓ లు కేజీబీలలో గుర్తించిన అన్ని పనులకు మంజూరు ఇవ్వాలని, అలాగే మంజూరైన పనులన్నిటి పురోగతినిలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సివిల్ పనులకు సంబంధించి పురోగతిని ఎప్పటికప్పుడు మండల ప్రత్యేక అధికారులకు తెలియజేయాలని కె జి బి వి ఎస్ ఓ లను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు మండలాలు సందర్శించినప్పుడు ఎప్పటికప్పుడు పనులను తనిఖీ చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, జె. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాల ప్రసాద్, డిఈఓ బిక్షపతి, మండలాల ప్రత్యేక అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.













## 25న మెగాజాబ్ మేళా సద్వినియోగం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : మెగాజాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని పెరల్ ఇన్ఫినిటీ ఇంటర్‌నేషనల్ స్కూల్ లో ఈనెల 25వ తేధీన నిర్వహించే జాబ్ మేళా ఏర్పాట్లను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా అప్రోచ్ రోడ్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ డీట్(డీఈఈటిడిజిటల్ ఎంప్లాయ్ మెంట్ ఎక్సేంజ్ ఆఫ్ తెలంగాణ)సింగరేణి వారి సహకారంతో 150 కంపెనీలతో మెగాజాబ్ మేళాను ఈనెల 25వ తేధీ ఉదయం నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని క్యూర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా. ఐటీఐ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ లాంటి ప్రొఫెషనల్ కోర్సు పూర్తి చేసిన వారు అలాగే చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా అర్హులే కాబట్టీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యోగాలు సాధించాలన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఉపశమనం

**గువహతి:** ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త దాఖలు చేసిన పరువు నష్టం కేసులో లోక్ సభ ఎంపి రాహుల్ గాంధీకి గువహతి హైకోర్టు ఉపశమనం కల్పించింది. ఈ వ్యవహారంలో కింది కోర్టు ఉత్తర్వులను కొట్టివేసింది. అదనంగా సాక్షులను చేర్చేందుకు అనుమతిచ్చింది. క్రిమినల్ రివిజన్ పిటిషన్‌పై విచారణ క్రమంలో తాజా ఉత్తర్వులను జస్టిస్ అరుణ్ దేవ్ చౌదరి ఏకసభ్య ధర్మాసనం జారీ చేసింది. అదనంగా ముగ్గురు సాక్షుల లిస్టింగ్‌కు నిరాకరిస్తూ 2023 మార్చిలో ట్రయిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్ (రాహుల్) పార్లమెంటు సిట్టింగ్ సభ్యుడని, 2016 నుంచి నడుస్తున్న ఈ కేసును సత్వరమే పరిష్కరించేందుకు ట్రయిల్ కోర్టు మెజిస్ట్రేట్ చర్యలు తీసుకుంటారని జస్టిస్ చౌదరి వెల్లడించారు. కాగా, 2015, డిసెంబరు 12న రాహుల్ బార్పేట సత్రా (వైష్ణవితే మొనాస్టరీ)ని సందర్శించారు. లోపలికి వెళ్లకుండా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తనను అడ్డుకున్నట్లు ఆయన తర్వాత తెలిపారు. దీంతో ఆగ్రహించిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త బోరా ఆయనపై క్రిమినల్ పరువు నష్టం కేసు పెట్టారు.

# తొలిదశ నామినేషన్లకు మిగిలింది రెండు రోజులే

### జెడియు, బిజెపి చెరో 101 స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన
### ఇంకా సీట్ల పంపకాల ఒప్పందం ప్రకటించిన ఇండియా కూటమి
### కాంగ్రెస్, ఆర్‌జెడిలో మొదలైన నామినేషన్లు



**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ నామినేషన్ పత్రాల దాఖలుకు కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. దీంతో రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలు జోరందుకున్నాయి. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్ సీట్ల పంపకాల ఒప్పందం ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, తనఅభ్యర్థులకు పార్టీ చిహ్నాలను కేటాయించడం ప్రారంభించింది. ఇండియా కూటమిలో సీట్ల పంపకాలు ఇంకా అపరిష్కృతంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో 17 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు పోస్టు చేసింది. ఔరంగాబాద్ నుండి ఆనంద్ శంకర్‌సింగ్, రాజపాకర్ నుండి ప్రతిమాదాస్, బచ్చవారా నుండి శివ పకాష్ గరీబ్ దాస్, నలంద నుండి కౌశలేంద్ర కుమార్(ఛోటే ముఖియా)లను పోటీకి దింపింది. అదేవిధంగా, ఓంప్రకాష్‌గార్గ్ గోపాల్‌గంజ్ నుండి జితేంద్ర సింగ్ అమర్‌పూర్ నుండి, అమితా భూషణ్ బెగుసరాయ్ నుండి, సుల్తాన్‌గంజ్ నుండి లాలన్ కుమార్, కుటుంబ నుండి రాజేష్ కుమార్, వార్సలిగంజ్ నుండి శశిశేఖర్, బార్బిఘా నుండి త్రిశుల్ధారి సింగ్, ముజఫర్‌పూర్ నుండి విజేంద్ర చౌదరి ఎన్నికలలో పోటీ చేయనున్నారు. శశిభూషణ్ రాయ్‌ను గోవింద్‌గంజ్ నుండి, అనిల్‌కుమార్ బిక్రమ్ నుండి, బికె రవి రోసెరా అసెంబ్లీ స్థానాల నుండి పోటీకి దింపారు. ఇండియా కూటమి నాయకులతో సంప్రదించిన తర్వాత మరిన్ని పేర్లను ఖరారు చేయనున్నట్లు వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సిసిఇసి) 43 స్థానాలకు అభ్యర్థులను ఆమోదించింది. అజయ్ మకాన్ నేతృత్వంలోని ఉపసంఘం బుధవారం మరో ఎనిమిది మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు చెబుతున్నారు. ఇక అధికార ఎన్‌డిఎ శిబిరంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) మొత్తం 101మంది అభ్యర్థుల పేర్లను విడుదల చేసింది. 18మంది అభ్యర్థులతో కూడిన మూడవ జాబితాను బుధవారం ఆలస్యంగా విడుదల చేశారు. జాబితా ప్రకారం, బినా దేవి కోచధమన్ నుండి, సంగీతా కుమారి మోహానియా నుండి, సంజయ్ పాండే నుండి నర్కటియాగంజ్ నుండి, సతీష్ కుమార్ యాదవ్ నుండి, భరత్ బింద్ భభువా నుండి పోటీ చేస్తారు. మురారి పాశ్వాన్ పిర్‌పెయింటీ నుండి, అశోక్ కుమార్ సింగ్ రామ్‌ఘర్ నుండి పోటీ చేస్తారు. ముందుగా ఆ పార్టీ 12 మంది అభ్యర్థులతో కూడిన రెండవ జాబితాను విడుదల చేసింది, వీరిలో అలీనగర్ నుండి జానపద గాయని మైథిలి ఠాకూర్, బక్సర్ నుండి మాజీ ఐపిఎస్ అధికారి ఆనంద్ మిశ్రా ఉన్నారు. దీంతో, బిజెపి మొత్తం 101స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఎన్‌డిఎ మిత్రపక్షం జనతాదళ్ (యునైటెడ్) కూడా 101మంది అభ్యర్థులతో కూడిన మొదటి, రెండవ జాబితాను విడుదల చేసింది. ఉమేష్ కుష్వా, విజేంద్ర ప్రసాద్ యాదవ్ వంటి సీనియర్ నాయకులు ఇప్పటికే మహనార్, సుపాల్ స్థానాల నుండి నామినేషన్లు దాఖలు చేశారు.

# ఆరుగురితో సిపిఐ తొలి జాబితా

### 18 మంది పేర్లు ప్రకటించిన సిపిఐ(ఎంఎల్)



**పాట్నా :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను వామపక్షాలు ప్రకటించాయి. తొలి దశ పోలింగ్ కోసం నామినేషన్ల గడువు శుక్రవారంతో ముగియనుంది. దీంతో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తమ అభ్యర్థుల తొలి జాబితాను బుధవారం విడుదల చేసింది. ఆరు స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది. తెఘ్రా స్థానం నుంచి రామ్‌రతన్ సింగ్, బఖ్రీ (ఎస్‌సి) అభ్యర్థిగా సూర్యకాంత్ పాశ్వాన్, బచ్చావర స్థానం నుంచి అవదేశ్ కుమార్ రాయ్, బంకా స్థానం నుంచి సంజయ్ కుమార్, హర్‌లఖి స్థానం నుంచి రాకేశ్ కుమార్‌పాండే, ఝంఝాపూర్ నుంచి రామ్ నారాయణ్ యాదవ్ పోటీ చేస్తారని సిపిఐ వెల్లడించింది.మహాకూటమిలో అంగీకారం తర్వాత ఘో, కర్ఘాహర్, బెల్దౌర్, బీహార్ షరీఫ్, రాజాపకర్ (ఎస్‌సీ), కేసరియా, చాన్‌పటియా, బిక్రమ్ స్థానాల లో పోటీచేసే అభ్యర్థులను ప్రకటిస్థామని పేర్కొం ది.

ఇదిలావుంటే, సిపిఐ(ఎంఎల్) కూడా 18 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లతో తొలి జాబితాను ప్రకటించింది. తరారీ స్థానం నుంచి మనద్ సింగ్ చంద్రవంశీ, అగియాన్ నుంచి శివప్రకాశ్ రంజన్, అర్రా నుంచి కయాముద్దీన్ అన్సారీ, దుమ్రాన్ నుంచి అజిత్ కుమార్ సింగ్ అలియాస్ అజిత్ కుష్వాహా, కరాకత్ నుంచి అరుణ్ సింగ్, అర్వాల్ నుంచి మహానంద్ సింగ్, ఘోసి నుంచి రామ్‌బలి సింగ్ యాదవ్, పాలిగంజ్ నుంచి సందీప్ సౌరభ్, ఫుల్వారి నుంచి గోపాల్ రవిదాస్, దిఘా నుంచి దివ్యా గౌతం, దరుంధా నుంచి సత్య దేశ్ రామ్, జిరాదే నుంచి అమర్‌జిత్ కుష్వాహా, దరౌలీ నుంచి అమర్‌నాథ్ యాదవ్, భోరే నుంచి జితేంద్ర పాశ్వాన్, సిక్తా నుంచి వీరేంద్ర ప్రసాద్ గుప్తా, వారిసానగర్ నుంచి ఫూల్‌బాబు సింగ్, కల్యాణ్‌పూర్ నుంచి రంజిత్ రామ్, లరాంపూర్ నుంచి మెహబూబ్ ఆలం పోటీ చేస్తారని సీపీఐ(ఎంఎల్) ప్రకటించింది.

# 101 సీట్లలో జెడియు అభ్యర్థుల ప్రకటన

**పాట్నా :** బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు) అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న 101 స్థానాలకూ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. వారిలో సగానికి పైగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన తరగతులకు చెందినవారు, నలుగురు ముస్లింలు ఉన్నారు. మొదటి జాబితా విడుదల చేసిన మరుసటి రోజే 44 మంది అభ్యర్థులతో కూడిన రెండవ, తుది జాబితాను విడుదల చేసింది. టికెట్ పొందిన తర్వాత చాలా మంది అభ్యర్థులు మంగళవారం నుండి నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్నారు. అభ్యర్థులను సామాజికవర్గాల వారీగా విడదీసి జాబితా ప్రకటించింది. జాబితా ప్రకారం... ఒబిసిలు 37 మంది, ఇబిసిలు 22 మంది ఉన్నారని పేర్కొంది. ముస్లింలకు ఇచ్చే వాటా జెడి(యు) ఇప్పుడు మైనారిటీ ఓటును వదులుకుందా లేదా అనే ఊహాగానాలకు దారితీసింది. ఎందుకంటే బిజెపితో దాని దీర్ఘకాల పొత్తు, వక్ఫ్ వంటి సున్నితమైన అంశాలపై స్వతంత్ర వైఖరిని తీసుకోలేకపోతోంది. నితీష్ కుమార్ ప్రభుత్వంలోని శాసన మండలి సభ్యులు కాని దాదాపు అందరు మంత్రులకు వారి స్థానాలను నిలుపుకోవడానికి రెండవ అవకాశం కల్పించింది. వారిలో ప్రముఖులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, జామా ఖాన్, షీలా మండల్, లేషి సింగ్, 2020లో చకై నుండి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన సుమిత్ కుమార్ సింగ్ ఉన్నారు. వారం కిందటే పార్టీలో చేరిన టర్న్‌కోట్ విభా దేవి, ఐదు సంవత్సరాల క్రితం ఆర్‌జెడి అభ్యర్థిగా గెలిచిన నవాడను నిలుపుకోవడానికి ప్రయత్నిస్తుండగా, షియోహార్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న చేతన్ ఆనంద్‌ను నబీనగర్ నుండి నిలబెట్టారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తల్లి అయిన స్థానిక జెడి(యు) ఎంపి లవ్లీ ఆనంద్ స్థానాన్ని సీతామర్హిలో నివసిస్తున్న వైద్య నిపుణురాలు శ్వేతా గుప్తాకు ఇచ్చారు. ఆమె గతంలో బిజెపితో సంబంధం కలిగి ఉంది.

# నలుగురు అభ్యర్థులతో ఆర్‌ఎల్‌ఎం జాబితా విడుదల

**పాట్నా :** బిహార్‌లో ఎన్‌డిఎ మిత్రపక్షమైన రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) అసెంబ్లీ ఎన్నికలకు నలుగురు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఎన్‌డిఎలో పొత్తులో భాగంగా ఆ పార్టీ ఆరు స్థానాలు బాజ్‌పట్టి (సీతామర్హి), మధుబని, పారు (ముజఫర్‌పూర్), ఉజియార్‌పూర్ (సమస్తిపూర్), ససారాం (రోహ్తాస్), దినారాలో (రోహ్తాస్) పోటీ చేయనుంది. పార్టీ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం ఆర్‌ఎల్‌ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వా భార్య స్నేహలత ససారాం నుండి, మాధవ్ ఆనంద్ మధుబని నుండి, ప్రశాంత్ కుమార్ పంకజ్ ఉజియార్‌పూర్ నుండి, అలోక్ కుమార్ సింగ్ దినారా నుండి పోటీ చేస్తారు.

# సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థిగా దివ్యగౌతమ్

### నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ సమీప బంధువు



**పాట్నా :** బిహార్ శాసనసభ ఎన్నికల్లో నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ సమీప బంధువు దివ్య గౌతమ్ సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తరఫున పోటీ చేయనున్నారు. బాలివుడ్ నటుడిగా అనతికాలంలోనే మంచి విజయాలతో పేరొందిన సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య చేసుకొని మరణించారు. ఈఅంశాన్ని బిజెపి జాతీయఅంశంగా మార్చి, అనేక ప్రచారాలు చేసింది. తాజా ఎన్నికల్లో దివ్య గౌతమ్ దిఘా శాసనసభ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. దివ్య గౌతమ్ పట్నా విశ్వవిద్యాలయంలో మాస్ కమ్యూనికేషన్ పిజి చేశారు. ఆమె దాదాపు మూడున్నర సంవత్సరాలు పట్నా మహిళా కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కూడా పనిచేశారు. కళాశాల రోజుల నుండి రాజకీయాల్లో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ విద్యార్థి విభాగం ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) తరఫున పట్నా విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికలలో అధ్యక్షస్థానానికి పోటీ చేసి రెండవ స్థానంలో నిలిచారు. దివ్య గౌతమ్ బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉద్యోగ పరీక్షలు రాసి, సప్లైయ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆమె ప్రభుత్వ ఉద్యోగంలో చేరకుండా సామాజిక సేవ, పరిశోధనను ఎంచుకుంది. ఆమె ప్రస్తుతం జూనియర్ రీసెర్చ్ ఫెలో అర్హత కలిగిన పిహెచ్‌డి స్కాలర్.

# పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు

### మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన

**భోపాల్:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చిన పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించాయి. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఒక చిన్నారిని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తల్లి తీసుకెళ్లింది. పరీక్షించిన డాక్టర్, అజిత్రోమైసిన్ యాంటీబయాటిక్ సిరప్ సూచించగా ఆసుపత్రి సిబ్బంది ఆ మందు ఇచ్చారు. కాగా, ఇంటికి చేరుకున్న తర్వాత చిన్నారికి మందు వేసేందుకు అజిత్రోమైసిన్ సిరప్ మూతను ఆ మహిళ తెరిచింది. ఆ యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించడంతో ఆమె షాక్ అయ్యింది. వెంటనే ఆ సిరప్ బాటిల్ తీసుకుని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. తెరిచిన అజిత్రోమైసిన్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి సిబ్బందికి చూపించింది. ఈ సంఘటన కలకలం రేపింది. మరోవైపు ఈ విషయం తెలిసిన వెంటనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ స్పందించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక ఔషధ కంపెనీ ఆ అజిత్రోమైసిన్ సిరప్ తయారు చేసినట్లు తెలిపారు. మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి సరఫరా చేసిన ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్స్‌లో స్టాక్ ఉన్న 306 బాటిళ్లను రీకాల్ చేసినట్లు చెప్పారు. కాగా, కొన్ని సిరప్ బాటిల్స్ పరిశీలించగా వాటిలో పురుగు అవశేషాలు లేవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ తెలిపారు. అయితే టెస్టింగ్ కోసం కొన్ని మందు సీసాలను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో కోల్డ్‌ఫ్ దగ్గు సిరప్ వల్ల కిడ్నీలు పాడైన కారణంగా 24 మంది పిల్లలు మరణించారు. మరింత మంది అనారోగ్యం పాలయ్యారు. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది.

# మత్స్యకారుల అంశం లేవనెత్తండి

### ప్రధాని మోదీకి తమిళనాడు సిఎం స్టాలిన్ లేఖ



**చెన్నై :** శ్రీలంక ప్రధానమంత్రి ఈనెల 16 నుంచి మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మత్స్యకారుల భద్రత, కచ్చతీవు ద్వీపాన్ని తిరిగి పొందడం వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీలంక ప్రధానమంత్రి హరిణి అమరసూర్య ఢిల్లీ పర్యటన సాంప్రదాయ చేపల వేట జలాల పాక్ బేలోభారత మత్స్యకారులు ఎదుర్కొంటున్న నిరంతర సవాళ్లను పరిష్కరించడానికి ఒక విలువైన అవకాశాన్ని అందిస్తుందని ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాసిన లేఖలో సూచించారు. శ్రీలంక నావికాదళం పదే పదే వేధింపులు, దాడులు, భయాల కారణంగా తమిళనాడులోని మత్స్యకార సంఘాలు గణనీయమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. '2021 నుండి 106 వేర్వేరు సంఘటనలలో 1,482 మంది మత్స్యకారులు, 198 ఫిషింగ్ బోట్లను అరెస్టు చేశారని, దీని వలన ఈ వర్గాలకు ఇబ్బందులు, ఆర్థిక నష్టం వాటిల్లింది' అని ఆయన ప్రధానికి తెలిపారు. ఈ విషయాన్ని తాను గతంలో 11 సందర్భాలలో ప్రధానమంత్రి కార్యాలయంలో లేవనెత్తానని, విదేశాంగ మంత్రికి 72 విజ్ఞప్తులు చేశానని స్టాలిన్ చెప్పారు. తమిళనాడు జాలర్లు సాంప్రదాయకంగా భారతదేశంలో భాగమైన కచ్చతీవు దీవి చుట్టూ ఉన్న జలాల్లో చేపలు పట్టేవారన్నారు. 'ఈ ద్వీపాన్ని కేంద్ర ప్రభుత్వం శ్రీలంకకు బదిలీ చేసింది. ఫలితంగా, మన జాలర్లు ఇప్పుడు వారి సాంప్రదాయ మత్స్యకార ప్రదేశాలకు ప్రవేశం పరిమితం చేయబడిందని, అతిక్రమించినందుకు తరచుగా వేధింపులను ఎదుర్కొంటున్నారు' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కచ్చతీవును తిరిగి పొందడం కోసం, పాక్ బే ప్రాంతంలో తమిళనాడు జాలర్ల సాంప్రదాయ మత్స్యకార హక్కుల పునరుద్ధరణ కోసం అమరసూర్యతో చర్చలు ప్రారంభించాలని ఆయన ప్రధాని మోదీని కోరారు. 'ప్రస్తుతం తమిళనాడుకు చెందిన 76 మంది మత్స్యకారులు, 242 ఫిషింగ్ బోట్లు శ్రీలంక కస్టడీలో ఉన్నాయి. బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న బాధను తగ్గించడానికి వారిని త్వరగా స్వదేశానికి రప్పించడానికి, వారి ఓడలను విడుదల చేయడానికి వారిపై ఒత్తిడి తేవాలని కోరుతున్నాను' అని స్టాలిన్ అన్నారు. శ్రీలంక మత్స్యకార చట్టానికి 2018 సవరణ వల్ల స్వాధీనం చేసుకున్న భారతీయ ఫిషింగ్ బోట్లను జాతీయం చేయడం అసాధ్యం అని ఆయన అన్నారు. శ్రీలంక జాతీయులు తమ మత్స్యకారులపై దాడులు, దొంగతనాలు, వేటగాళ్లపై దొంగతనం చేస్తున్నట్లు భారత మత్స్యకారులు తరచుగా నివేదిస్తారని స్టాలిన్ అన్నారు.

# అడ్వకేట్ రాకేశ్‌పై చర్యలకు అటార్నీ జనరల్ సమ్మతి

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై అడ్వకేట్ రాకేశ్ కిషోర్ షూ విసిరే ప్రయత్నం చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటనపై గురువారం అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కీలక నిర్ణయం తీసుకున్నారు. అడ్వకేట్ రాకేశ్ కిషోర్‌పై నేరపూరిత కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఈనెల 6వ తేదీన ఓ కేసు వాదిస్తున్న సమయంలో.. ధర్మాసనంలో కూర్చుకున్న సిజెఐ గవాయ్‌పై అడ్వకేట్ రాకేశ్ షూ విసిరే ప్రయత్నం చేశారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వికాశ్ సింగ్‌కు అటార్నీ జనరల్ లేఖ రాశారు. 1971 నాటి కోర్టు ధిక్కరణ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) కింద నేర కోణంలో అడ్వకేట్ రాకేశ్‌పై విచారణ చేపట్టేందుకు అనుమతి ఇస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. అడ్వకేశ్ రాకేశ్ చర్యలు నిందాపూర్వకంగా ఉన్నాయని, సుప్రీంకోర్టులోని అత్యున్నత వ్యక్తిని అగౌరవపరుస్తున్నట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాంటి ప్రవర్తనతో న్యాయ వ్యవస్థ పనితీరు నిర్వీర్యం అవుతుందన్నారు. సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌కు లేఖ రాశారు. ఆయన కూడా అడ్వకేట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. జస్టిస్ సూర్యకాంత్, జాయ్‌మాల్యా బాగ్చీ ధర్మాసనం వద్ద ఆ కేసు ఉన్నట్లు తెలిపారు. అయితే కోర్టు ధిక్కరణ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం.. సుప్రీంకోర్టులో ఓ న్యాయవాదిపై క్రిమినల్ విచారణ చేపట్టాలంటే అప్పుడు అటార్నీ జనరల్ సమ్మతి అవసరం ఉంటుంది.

# గుజరాత్ మంత్రులంతా రాజీనామా..



**అహ్మదాబాద్ :** గుజరాత్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ శుక్రవారం జరుగనున్నది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర మంత్రులంతా గురువారం రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాత్రమే రాజీమానా చేయలేదు. మంత్రివర్గంలో ఏకైక సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు. గురువారం సాయంత్రం సిఎం నివాసంలో కీలక సమావేశం జరిగింది. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్, సిఎం భూపేంద్ర పటేల్ పాల్గొన్నారు. మంత్రులందరిని వ్యక్తిగతంగా వారు కలిశారు. కేంద్ర నాయకత్వం నిర్ణయాన్ని వివరించి వారి నుంచి రాజీనామాలు స్వీకరించారు. కాగా, సిఎం భూపేంద్ర పటేల్ ఈ రాత్రికి గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌ను కలువనున్నారు. మంత్రుల రాజీనామాలను అధికారికంగా సమర్పిస్తారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు గుజరాత్ కొత్త మంత్రివర్గం ఏర్పడనున్నది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా సమక్షంలో గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో కొత్త మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నది. మరోవైపు ఐదారు మంది మంత్రులకు కొత్త మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు తెలుస్తున్నది. మిగిలిన పదవులను కొత్తవారితో భర్తీ చేయనున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుల, ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని సమతుల్యం చేయడం, ప్రభుత్వంలో కొత్త శక్తిని నింపేందుకు బిజెపి విస్తృత వ్యూహంలో భాగంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# వెనిజులాలో కోవర్టు కార్యకలాపాలు సిఐఎ బండారం బయటపెట్టిన ట్రంప్

**వాషింగ్టన్:** మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు, ఆ ముఠాలకు నిలయంగా ఉందంటూ వెనిజులాపై తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆ కరీబియన్ దేశంపై కయ్యానికి కాలు దువ్వుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన నోటితోనే సిఐఎ గూఢచర్యం బండారాన్ని బయటపెట్టారు. వెనిజులాలో కోవర్టు కార్యకలాపాలు, గూఢచారి చర్యలు నిర్వహించాలని తానే అనుమతులు ఇచ్చానని ట్రంప్ చెప్పారు. కరీబియన్ సముద్ర జలాలల్లో డ్రగ్స్ ముఠాలను అరికట్టేందుకు మరిన్ని దాడులు చేస్తామన్నారు. దీంతో వెనిజులా అధ్యక్షుడు మదురో తీవ్రస్థాయిలో ట్రంప్‌పై ఎదురుదాడి చేశారు. తమ దేశంలో 5000 మంది యువకులు హతులు కావడమో అదృశ్యం కావడమో జరిగిందని వీటన్నింటికీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, సిఐఎ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ ముఠాలకు వెనిజులా ప్రధాన కేంద్రంగా ఉందని ట్రంప్ రెండు నెలలుగా ఆరోపణలు చేస్తున్నారు. డ్రగ్ కార్టెల్స్‌ను మట్టుపెట్టే పేరుతో వెనిజులా చుట్టూ కరీబియన్ సముద్ర జలాలల్లో భారీస్థాయిలో విమానవాహక నౌకలను, సైనికులను మోహరించి ఆ ప్రాంతంలో భయభ్రాంతులు సృష్టిస్తున్నారు. వెనిజులాను లొంగదీసుకోవడానికి అనేక రకాలుగా రెండు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ తాజాగా వెనిజులాలో సిఐఎ కోవర్టు కార్యకలాపాలు నిర్వహించేందుకు తానే అనుమతి ఇచ్చానంటూ మరో విషయం బయట పెట్టారు. డ్రగ్స్ రవాణా చేస్తున్నారనే పేరుతో మూడు రోజుల క్రితమే వెనిజులా బోటుపై అమెరికా దళాలు దాడులు చేసి ఆరుగురు పౌరులను హతమార్చాయి. ఇప్పటివరకూ వెనిజులాకు చెందిన అనేక బోట్లపై అమెరికా దాడులు చేసి డజన్ల సంఖ్యలో పౌరులను హతమార్చాయి. నిజంగా వెనిజులాలో డ్రగ్స్ ముఠాలు ఉంటే వారిని పట్టుకోవడానికి తమ ప్రభుత్వం సహకరిస్తుందని, ఈ విషయంలో డోనాల్డ్ ట్రంప్‌తో కూర్చుని చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని మదురో ప్రకటించినప్పటికీ ట్రంప్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. వెనిజులాపై యుద్ధం ప్రకటించి అణచివేతకే మొగ్గుచూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో వెనిజులా కూడా తిరగబడి ట్రంప్ యుద్ధానికి వస్తే తామూ సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. తమ పౌరులకు యుద్ధ శిక్షణ ఇస్తామని కూడా అన్నారు. ఈ ఉద్రిక్తతలమధ్య ట్రంప్ తాజా ప్రకటన చేస్తూ వెనిజులాలో కోవర్టు కార్యకలాపాలకు తానే సిఐఎకు అనుమతి ఇచ్చానన్నారు. ఇటీవలికాలంలో కరీబియన్ సముద్ర జలాల్లో డ్రగ్స్ ముఠాలనే ముద్ర వేసి ఆరు బోట్లపై అమెరికా దళాలు దాడులు చేసి 27 మందిని చంపాయి. ఈ దాడులన్నీ చట్టవిరుద్ధమైనవనీ, మానవ హక్కుల ఉల్లంఘన అనీ ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం విమర్శించింది.

# నైరుతి నిష్క్రమణ... ఈశాన్య రుతుపవనాలు ఆగమనం

**న్యూఢిల్లీ :** నైరుతి రుతుపవనాలు ఈనెల 15వ తేదీ తరువాత భారత్ నుంచి నిష్క్రమించినట్లు భారత వాతావరణశాఖ (ఐఎండి) తెలిపింది. అదే సమయంలో, ఈశాన్య రుతుపవనాలు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ, దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక, కేరళ–మహే ప్రాంతాలలోకి ప్రవేశించాయని వెల్లడించింది. సంవత్సరం నైరుతి రుతుపవనాలు మే 24న కేరళకు చేరుకున్నాయి. 2009లో మే 23న వచ్చిన తర్వాత భారత ప్రధాన భూభాగాన్ని తొలిసారిగా తాకాయి. జులై 8 సాధారణ తేదీ కంటే తొమ్మిది రోజుల ముందు యావత్ మొత్తం దేశాన్ని విస్తరించాయి. ప్రాథమిక వర్షపాత వ్యవస్థ సాధారణంగా జూన్ 1 నాటికి కేరళపై ప్రారంభమై జులై 8 నాటికి మొత్తం దేశాన్ని విస్తరిస్తుంది. సెప్టెంబర్ 17న వాయువ్య భారతదేశం నుండి తిరోగమనం ప్రారంభిస్తుంది. అక్టోబర్ 15 నాటికి పూర్తిగా ఉపసంహరించుకుంటుంది. సెప్టెంబర్ 30తో ముగిసిన మొత్తం నాలుగు నెలల రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణం కంటే 868.6 మి.మీ వర్షపాతం నమోదైంది. 8 శాతం మిగులు వర్షపాతం రికార్డు అయింది. ఈ నెల ప్రారంభంలో, వాయువ్యంలోని కొన్ని ప్రాంతాలను మినహాయించి భారతదేశంలోని చాలా ప్రాంతాలలో అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు వర్షాకాలం తర్వాత సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని ఎఐఎండి తెలిపింది. జూన్–సెప్టెంబర్ రుతుపవనాల సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. అక్టోబర్‌లో సాధారణం కంటే 15 శాతం ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండి చీఫ్ మృత్యుంజయ్ మోహపాత్ర తెలిపారు. తూర్పు, ఈశాన్య భారతదేశంలో 1,089.9 మి.మీ వర్షపాతం నమోదైంది, ఇది సాధారణం కంటే (1,367.3 మి.మీ.) 20 శాతం తక్కువ. ఈ రుతుపవనాల సీజన్‌లో తూర్పు, ఈశాన్య భారతదేశంలో వర్షపాతం 1901 తర్వాత రెండవ అత్యల్ప వర్షపాతం. ఈ ప్రాంతంలో రుతుపవనాల సీజన్‌లో అత్యల్ప వర్షపాతం (1,065.7 మి.మీ) 2013లో నమోదైందని ఐఎండి డైరెక్టర్ జనరల్ తెలిపారు. వాయువ్య భారతదేశంలో 747.9 మి.మీ. నమోదైంది. ఇది సాధారణం కంటే (587.6 మి.మీ.) 27.3 శాతం ఎక్కువ. 2001 తర్వాత అత్యధికం, 1901 తర్వాత ఆరవ అత్యధికం. వాయువ్య భారతదేశంలోని అన్ని జిల్లాల్లో జూన్, ఆగస్టు, సెప్టెంబర్‌లలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని మోహపాత్ర చెప్పారు. దశాబ్దాలలో ఎన్నడూ లేని విధంగా పంజాబ్‌లో అత్యంత దారుణమైన వరదలు సంభవించాయి. ఉప్పొంగిన నదులు, కాలువలు తెగి వేల హెక్టార్ల వ్యవసాయ భూములను ముంచెత్తాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. హిమాలయ రాష్ట్రాలలో, మేఘావిస్ఫోటనాలు, ఆకస్మిక వరదలతో కొండచరియలు విరిగిపడ్డాయి. విస్తృత నష్టాన్ని కలిగించాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో వంతెనలు, రోడ్లు కొట్టుకుపోగా, జమ్ముకశ్మీర్‌లో పదేపదే మేఘావిస్ఫోటనాలు, కొండచరియలు విరిగిపడ్డాయి. మధ్య భారతదేశంలో 1,125.3 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం 978 మి.మీ కంటే 15.1 శాతం ఎక్కువ. దక్షిణ ద్వీపకల్పంలో సాధారణం 716.2 మి.మీ కంటే 9.9 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. భారతదేశంలో జూన్‌లో సాధారణం కంటే 8.9 శాతం ఎక్కువ వర్షపాతం, జూలైలో 4.8 శాతం ఎక్కువ, ఆగస్టులో 5.2 శాతం ఎక్కువ, సెప్టెంబర్‌లో సాధారణం కంటే 15.3 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. భారతదేశ వ్యవసాయ రంగానికి రుతుపవనాలు చాలా కీలకమైనవి. ఇది జనాభాలో దాదాపు 42 శాతం మంది జీవనోపాధికి దోహదపడుతున్నాయి. దేశ జిడిపికి 18.2 శాతం దోహదం చేస్తుంది. తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలాశయాలను తిరిగి నింపడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది.



ప్రజాపక్షం
శుక్రవారం, 17 అక్టోబరు

## విద్యుత్తు.. ప్రై'వేటు'

విద్యుత్ రంగాన్ని అత్యంత వేగంగా ప్రైవేటీకరించడానికి కేంద్రం కసరత్తు ముమ్మరం చేయడం సామాజిక హక్కును హరించడమే. విద్యుత్తు ఒక వస్తువుకాదు.. ప్రజల హక్కు. కానీ, విద్యుత్ (సవరణ) బిల్లు 2025 ఈ హక్కును అడ్డుకుంటోంది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ రంగాల్లో ప్రైవేటీకరణ, ఫ్రాంచైజీ విధానాలకు తలుపులు తెరవడమే కొత్త బిల్లు లక్ష్యం. అందుకు, సమాఖ్య అధికారాలను తుంగలో తొక్కడానికి కూడా కేంద్రం వెనుకాడడం లేదు. ఒకవైపు, ఈ ప్రతిపాదనలను తక్షణం ఉపసంహరించుకోకపోతే, దేశ వ్యాప్త ఆందోళనకు వామ పక్ష కార్మిక సంఘాలు సన్నాహాలు చేస్తున్నాయి. మరోవైపు మోదీ సర్కారు మాత్రం మొండిగా ముందుకు వెళుతున్నది. 2014 నుండి సవరణ బిల్లును వివిధ పద్ధతుల్లో అమలు చేయడానికి చేసిన ఎన్నో ప్రయత్నాలు విఫలమయ్యాయి. సంస్కరణల పేరుతో కేంద్రం తిరిగి అవే ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది. సాధ్యమైనంత త్వరగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి, పూర్తిగా వాణిజ్యపరం చేయడమే కేంద్రం ధ్యేయం. ఈ బిల్లు చట్టమైతే, విద్యుత్ రంగం మొత్తం ప్రైవేటు చేతుల్లోకి వెళుతుంది. కార్పొరేట్ గుత్తాధిపత్యం పెరుగుతుంది. ప్రజా వినియోగాలు, సామాన్య వినియోగదారుల హక్కులు ఆవిరవుతాయి. సమాఖ్యవాదం అటకెక్కుతుంది. లక్షలాది కార్మికుల జీవనోపాధికి ముప్పు ఏర్పడుతుంది. దశాబ్దాలుగా నిర్మించుకుంటూ వచ్చిన సామాజిక విద్యుత్ చట్రం ముక్కలవుతుంది. లాభదాయకమైన ప్రాంతాలు కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తమవుతాయి. రాష్ట్ర డిస్కమ్‌లకు సామాజిక బాధ్యత పెనుభారమవుతుంది. అవి నష్టాల ఊబిలో కూరుకుపోతాయి. ఏ రకంగా చూసినా దేశంలోని అత్యధికులైన పేద, బడుగు వర్గాలకు ఈ బిల్లు ఎంతమాత్రం ఉపయోగపడదు. ఒకే ప్రాంతంలో బహుళ పంపిణీ లైసెన్స్‌లను.. ఒకే ప్రభుత్వ నిధుల నెట్‌వర్క్‌ను ఈ బిల్లు అనుమతిస్తుంది. ఫలితంగా, సామాజిక హక్కు హోదాను కోల్పోయే విద్యుత్తు, ఒక వాణిజ్య వస్తువుగా మారుతుంది.

చాలా రాష్ట్రాలు అనుసరిస్తున్న 'పేదలకు ఉచిత విద్యుత్' పథకం నిర్వీర్యమవుతుంది. డిస్కమ్‌లు ఈ భారాన్ని మోయాల్సి వస్తుంది. ప్రైవేటు సంస్థలు మాత్రం అధిక మొత్తాలను చెల్లించగల స్థోమతగల వినియోగదారులను ఎంపిక చేసుకుంటాయి. రెండు చేతులా లాభాలు ఆర్జిస్తాయి. డిస్కమ్‌లది నష్టాల బాట.. ప్రైవేటు సంస్థలకు లాభాల పంట. తక్కువ ఆదాయంగల గ్రామీణ, పట్టణ పేద వినియోగదారుల బాధ్యత మోయలేని భారమై, డిస్కమ్‌లు ఆర్థికంగా పతనమవుతాయి. సామాజిక అవసరమైన క్రాస్ సబ్సిడీల అమలు ప్రశ్నార్థకమవుతుంది. విద్యుత్ చార్జీలు పెరుగుతాయి. కేంద్రం ప్రోత్సహిస్తున్న స్మార్ట్ మీటరింగ్‌కు మార్గం సుగమమవుతుంది. దోపిడీకి కొత్త బిల్లు ఒక సాంకేతిక సాధనంగా ఉపయోగపడుతుంది. ఐదు సంవత్సరాలలోపు క్రాస్ సబ్సిడీలను తొలగించే ప్రతిపాదన ప్రజా వినియోగ వ్యవస్థలకు భారీ నష్టాలు తెస్తుంది. పేద, గ్రామీణ వినియోగదారులపై చార్జీల పెనుభారం పడుతుంది. క్రాస్ సబ్సిడీని తొలగిస్తే, రైతులు, కార్మికుల్లో అసమానతలు పెరుగుతాయి. బాధలు రెట్టింపు అవుతాయి. ఊహాజనిత విద్యుత్ మార్కెట్లను ప్రోత్సహించడం, పరోక్షంగా మానవ ప్రాథమిక అవసరమైన విద్యుత్తును వాణిజ్య వస్తువుగా మార్చడం... ధరల అస్థిరతకు, ఆధారపడడానికి వీల్లేని సరఫరా విధానాలకు అవకాశం కల్పించడం... ఇంధన భద్రతపై ప్రజల నియంత్రణను తొలగించడం... ప్రైవేటు విద్యుత్ మార్కెట్లను ప్రోత్సహిస్తూ, సామాజిక హక్కును కొల్లగొడుతూ, విద్యుత్‌ను లాభసాటి వ్యాపారంలా మార్చివేయడం అత్యంత ప్రమాదకరం. ఈ బిల్లు రాష్ట్ర ఇంధన విధానాలపై కేంద్ర ప్రభుత్వానికి విస్తృత అధికారాలనిస్తుంది. రాష్ట్ర నియంత్రణ కమిషన్లపైన కూడా కేంద్ర పెత్తనం మొదలవుతుంది. ఈ పరిస్థితి, రాజ్యాంగ మౌలిక సిద్ధాంతమైన సమాఖ్య స్వభావంపై ప్రత్యక్ష దాడి. పక్షపాత జీఎస్‌టి, నిధుల కేటాయింపులతో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను దెబ్బతీస్తున్న కేంద్రం, వాటిపై ఆర్థిక భారాన్ని మరింత పెంచేందుకు అనుసరిస్తున్న కుటిల నీతి. విద్యుత్ ప్రైవేటీకరణతో ఉద్యోగాలకు ఎసరు... అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలకు పెద్ద పీట... రక్షణ మండలాల్లో ప్రైవేటు లైసెన్సులు దేశ భద్రతకు పెనుముప్పు... అన్ని రకాలుగా ప్రజలను, దేశాన్ని దెబ్బతీసే విద్యుత్ సవరణ బిల్లును కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి. విద్యుత్ వ్యాపార వస్తువు కాదని... ప్రజల సామాజిక హక్కని గుర్తించాలి. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా విభాగాల ప్రైవేటీకరణ ప్రయత్నాలను తక్షణం నిలిపివేయాలి.

ప్రజలు, కార్మికులు పెద్దఎత్తున ఉద్యమించకముందే, కేంద్రం వాస్తవాన్ని గ్రహించాలి. విద్యుత్ బిల్లును బుట్టదాఖలు చేయాలి. విద్యుత్ ప్రై'వేటు' ఆలోచన మానుకోవాలి.

# న్యూరెంబర్గ్ ట్రయల్స్‌కు 80 ఏళ్లు


కృష్ణ ఝా

మనమంతా జీవిస్తున్న ప్రపంచంతో హద్దులు దాటి వ్యవహరిస్తున్న అందరికీ మరణగంట మోగుతుంది. హద్దులు దాటడం అంటే ఆటవికత వైపు వెళ్లడమే. కానీ, పరిణామాలు కూడా అదే స్థాయిలో వస్తాయి. ఎవరూ తప్పించుకోలేరు. నూరెంబర్గ్ ట్రయల్స్ దీనికి సజీవ ఉదాహరణలు.

ఫాసిస్ట్ పాలనలో జరిగిన నేరాలను విచారించడానికి ఏర్పాటు చేసిన నూరెంబర్గ్ ట్రయల్స్‌లో మొదటి అభియోగం దాఖలు చేసి ఈ ఏడాది అక్టోబర్ 18 నాటికి 80వ సంవత్సరం పూర్తవుతుంది. ఈ తేదీ అధికారాన్ని దుర్వినియోగం చేసి, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన వారు, వారి అధికారం, స్థానం ఏమైనప్పటికీ, ఒక రోజు జవాబుదారీగా ఉండవలసి వస్తుందనే విషయాన్ని గుర్తు చేస్తుంది. ఆష్విట్జ్ అనే ఒక డెత్ క్యాంప్‌లో కేవలం మే 1940 నుండి డిసెంబర్ 1943 వరకు 25 లక్షల మందిని భట్టీలలో చంపినట్లు నాజీ అధికారులలో ఒకరైన రుడాల్ఫ్ హెస్ ధృవీకరించాడు. మరో 5 లక్షల మంది ఆకలి లేదా వ్యాధుల కారణంగా చనిపోయారు. మొత్తంగా, కేవలం ఆష్విట్జ్‌లోనే 40 లక్షల మందిని చంపేశారు. తల్లి చేతుల నుండి తీసుకున్న పిల్లలను సజీవంగా మండే కొలిమిల్లోకి విసిరారు.

1945 అక్టోబర్ 18న హెర్మన్ గోరింగ్, ఆల్బర్ట్ స్పియర్ వంటి అత్యంత క్రూరమైన వారు సహా 24 మంది మాజీ నాజీ నాయకులపై యుద్ధ నేరాలకు సంబంధించిన అభియోగాలు మోపబడ్డాయి. విచారణ 10 నెలలు జరిగిన అనంతరం 1946 అక్టోబర్ 1న తీర్పు వెలువడింది.

నూరెంబర్గ్ ట్రయల్స్ అనేవి రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నాజీ జర్మనీలోని ప్రముఖ నాయకులను యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలు, శాంతికి వ్యతిరేకంగా చేసిన నేరాలకు విచారించడానికి మిత్రరాజ్యాలు (యునైటెడ్ స్టేట్స్, గ్రేట్ బ్రిటన్, సోవియట్ యూనియన్, ఫ్రాన్స్) అనేక సైనిక ట్రిబ్యునల్స్‌ను నిర్వహించారు. 1945, 1946 మధ్య జర్మనీలోని నూరెంబర్గ్‌ల్లో జరిగిన ఈ విచారణలు, వ్యక్తులను వారి చర్యలకు జవాబుదారీగా చేసి, హోలోకాస్ట్ (జాతిహననం) అకృత్యాలను అధికారికంగా నమోదు చేయడం ద్వారా అంతర్జాతీయ చట్టంలో ఒక కీలకమైన ఉదాహరణను నెలకొల్పాయి.

యునైటెడ్ స్టేట్స్ ఛీఫ్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించిన గొప్ప అమెరికన్ న్యాయవాది రాబర్ట్ జాక్సన్ ఇలా అన్నారు. ''మా రుజువు అసహ్యకరంగా ఉంటుంది. నేను మీ నిద్రను దూరం చేశానని మీరు అంటారు, కానీ ఇవే ప్రపంచం కడుపును దేవినట్లుగా ఉండే విషయాలు. జర్మనీ మొత్తం ఒక పెద్ద హింసా శిబిరంగా మారింది, బాధితుల ఆర్తనాదాలు ప్రపంచమంతటా వినిపించాయి, నాగరిక ప్రజలకు వణుకు పుట్టించాయి. ఈ యుద్ధ సమయంలో నేను ఈ కథనాలను సందేహంతో, అవిశ్వాసంతో స్వీకరించిన వ్యక్తిని, కానీ ఇక్కడ ఉన్న రుజువు ఎంత బలంగా ఉందంటే, నేను మాట్లాడే ఒక్క మాటను కూడా ఎవరూ ఖండించలేరు. నాజీల దురాక్రమణ ప్రపంచంపై కలిగించిన గాయాలు ఎంత లోతైనవి అంటే అవి ఇప్పటికీ రక్తం కారుస్తూనే ఉన్నాయి''. జాక్సన్ మాటలు నిజమయ్యాయి. నాజీయిజం ప్రపంచంలోకి ఒక కొత్త రూపంలో ప్రవేశించింది. అవి జాతి విద్వేషం, ఉగ్రవాదం, హింస, అధికారపు అహంకారం, క్రూరత్వం, నిర్దాక్షిణ్యమైన జాతీయవాదం, సైనికీకరణలకు సజీవ చిహ్నాలుగా ఉంటాయి.

నాజీ జర్మనీలో హెర్మన్ గోరింగ్ రెండవ అత్యంత శక్తివంతమైన అధికారి. హిట్లర్ నియంతృత్వంలో చాలాకాలం పాటు, హిట్లర్ తర్వాత ఆయన మాత్రమే అత్యంత శక్తిమంతుడు. తూర్పు ఐరోపాను జయించాలనే జర్మనీ ప్రణాళికలో గోరింగ్ కీలక పాత్ర పోషించాడు. యూదులను దోచుకోవడం, చంపడం కోసం నాజీ విధానాలను రూపొందించడంలో సైతం ఆయన సహాయం చేశాడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, నూరెంబర్‌లోని అంతర్జాతీయ సైనిక న్యాయస్థానం గోరింగ్‌కు మరణదండన విధించింది. తనకు ఉరిశిక్ష విధించేందుకు ముందే గోరింగ్ ఆత్మహత్య చేసుకున్నాడు.

నాజీయిజం అనేది జర్మన్ గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టి. ఇది అధికారంతో పాటు వచ్చింది, తనను తాను బలోపేతం చేసుకుంది. అంతర్జాతీయ సామ్రాజ్యవాద ప్రతీఘాతచర్య యొక్క మద్దతు, ప్రత్యక్ష సహాయం ఫలితంగా భయాన్ని, అకృత్యాలను పురిగొల్పే చర్యలను కొనసాగించగలిగింది.

కేంద్రీకృతమైంది. నిందితులు సాధారణంగా తాము ఆరోపించబడిన నేరాలు జరిగాయని అంగీకరించారు. కానీ తాము ఉన్నత అధికారం నుండి ఆదేశాలను పాటించామని పేర్కొంటూ, తమకు బాధ్యత లేదని ఖండించారు.

నాజీల అత్యున్నత అధికారం, హోలోకాస్ట్ (సామూహిక హననం)కు ఎక్కువ బాధ్యత వహించాల్సిన వ్యక్తి, విచారణలకు హాజరు కాలేదు. అడాల్ఫ్ హిట్లర్ యుద్ధం చివరి రోజుల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే ఆయన సన్నిహిత సహాయకులలో కొందరు కూడా ఆత్మహత్యలు చేసుకున్నారు. చాలామంది నేరస్థులను ఎప్పుడూ విచారించలేదు. కొందరు జర్మనీ నుండి పారిపోయి విదేశాలలో నివసించగా, వీరిలో వందలాది మంది యునైటెడ్ స్టేట్స్‌కు వెళ్ళారు.

తమ శత్రువులుగా లేదా బెదిరింపులుగా భావించిన ప్రజల సమూహాలను నాజీ జర్మనీ హింసించింది, క్రూరంగా వ్యవహరించింది, హత్య చేసింది. యూదులను నాజీలు తమ ప్రధాన శత్రువుగా చూశారు. వారు యూదు పురుషులు, మహిళలు, పిల్లలను అలుపెరుగని దృష్టితో లక్ష్యంగా చేసుకున్నారు. ఈ భయం పరిధి, భారీ



**ఆష్విట్జ్ అనే ఒక డెత్ క్యాంప్‌లో కేవలం మే 1940 నుండి డిసెంబర్ 1943 వరకు 25 లక్షల మందిని భట్టీలలో చంపినట్లు నాజీ అధికారులలో ఒకరైన రుడాల్ఫ్ హెస్ ధృవీకరించాడు. మరో 5 లక్షల మంది ఆకలి లేదా వ్యాధుల కారణంగా చనిపోయారు. మొత్తంగా, కేవలం ఆష్విట్జ్‌లోనే 40 లక్షల మందిని చంపేశారు. తల్లి చేతుల నుండి తీసుకున్న పిల్లలను సజీవంగా మండే కొలిమిల్లోకి విసిరారు. మొత్తంగా, నాజీలు, వారి మిత్రులు, సహకరించినవారు 60 లక్షల మంది యూదులను హత్య చేశారు.**

ఇటలీలోని ఫాసిజం మాదిరిగానే నాజీయిజం కూడా అత్యంత ప్రతీఘాతక, సామ్రాజ్యవాద శక్తుల నియంతృత్వాన్ని స్థాపించే ధోరణిని కలిగి ఉంది. క్రూప్స్, ది వోగ్లర్స్, ది లావెన్‌ఫెల్డ్స్, ఫ్రోడెస్, ది ష్నిట్జ్లర్స్ వంటి అనేక మంది జర్మన్ పారిశ్రామికవేత్తలు, ఆర్థిక దిగ్గజాలు నుంచి ఎస్ఎస్ వినాశకారుల వరకు మద్దతు ఇచ్చారు. ఈ పెట్టుబడి దిగ్గజాలు జర్మనీ మొత్తం ఆర్థిక సామర్థ్యాన్ని నాజీ దురాక్రమణ సేవలో ఉంచారు. వారు తమకు అందుబాటులో ఉన్న మానవులపై అమానవీయమైన నాజీ ప్రయోగాలలో పాలుపంచుకున్నారు. వారు భయంకరమైన ప్రయోగాల ప్రక్రియలో పదుల వేల మందిని చంపారు. ప్రజలు బానిసలుగా మార్చబడ్డారు. వారు ఎదుర్కోవలసి వచ్చిన భయంకరమైన పరిణామాలు ఉన్నాయి.

మొత్తంగా, నూరెంబర్గ్‌ల్లో 199 మంది నిందితులపై విచారణ జరిగింది. 161 మంది దోషులుగా నిర్ధారించబడగా, 37 మందికి మరణశిక్ష విధించబడింది. వీరిలో ఇంటర్‌నేషనల్ మిలిటరీ ట్రిబ్యునల్ విచారించిన 12 మంది ఉన్నారు. కొన్ని విచారణలలో హోలోకాస్ట్ (సామూహిక హననం) నేరాలు చేర్చబడినప్పటికీ, ఐన్సాట్‌గ్రుప్పెన్ నాయకులపై మాత్రమే అమెరికా విచారణలో ప్రధాన దృష్టి

మానవ నష్టం కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అవి ఏమిటంటే, నాజీలు ఏ సమూహాలను లక్ష్యంగా చేసుకున్నారు? వారు ఈ నిర్దిష్ట సమూహాల ప్రజలను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు?

నాజీలు మొదటి నుండి జర్మనీలోని యూదు ప్రజలను క్రూరంగా, నిరంతరంగా ఒంటరి చేయాలని, పేదవారిని చేయాలని, వివక్ష చూపాలని కోరుకున్నారు. కాబట్టి నాజీ జర్మనీ యూదులను లక్ష్యంగా చేసుకుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో, ఈ విధానం సామూహిక హత్యలకు పెరిగింది. మొత్తంగా, నాజీలు, వారి మిత్రులు, సహకరించినవారు 60 లక్షల మంది యూదులను హత్య చేశారు. ఇది ఇప్పుడు హోలోకాస్ట్( సామూహిక హననం)గా పిలువబడే జాతిహననం.

యూరప్‌లోని యూదుల జాతిహననంతో, కమ్యూనిస్టులను, ఇతర సమూహాల ప్రజలను కూడా నాజీలు హింసించారు. వారి పట్ల క్రూరంగా వ్యవహరించారు లేదా హత్య చేశారు. కొన్ని సందర్భాలలో, వారు తమ మిత్రులు, సహాయకారుల సహాయంతో అలా చేశారు.

**(1945 అక్టోబర్ 18న నాజీల సంచలన విచారణలో తొలి అభియోగం మోపి రేపటికి 80 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా.. )**

# మనం మధ్య యుగాలవైపు పయనిస్తున్నామా?

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడలో మూలస్థంభాలు అయిన నాలుగు పిల్లర్లలో న్యాయవ్యవస్థ ఒకటి. భారతరాజ్యాంగ పరిరక్షణలో న్యాయవ్యవస్థదే అత్యంత కీలకమైన భాగం. అట్లాంటి ఉన్నత న్యాయ వ్యవస్థ పరిరక్షణలో అత్యున్నత స్థానం సుప్రీం కోర్టుది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి న్యాయవ్యవస్థ, న్యాయ సమీక్ష, రాజ్యాంగ పరిరక్షణలో సుప్రీం. అట్లాంటి ఉన్నతమైన స్థానంలోకి ఓ దళితవర్గం నుండి వచ్చిన వ్యక్తి ప్రధాన న్యాయమూర్తిగా ఎదగడం అనేది మన ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనాన్ని రుజువు చేస్తుంది. ఇప్పుడు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో అట్టడుగు వర్గం నుండి వచ్చిన బిఆర్ గవాయ్ ఉన్నారు. అట్లాంటి అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తిపై మతోన్మాదం నిండుగా తలకెక్కించుకున్న రాకేష్ కిశోర్ (71)ఏళ్ళ ఉన్మాదిన్యాయవాది ముసుగులో జరుగుతున్న కోర్టులో కెళ్ళి చెప్పు విసిరిన సంఘటన చిన్న దేమీకాదు? ఉపేక్షించ దగిన సంఘటనా ఎంత మాత్రం కాదు. ఆధునికతవైపు పయనిస్తున్న కాలంలో సనాతనధర్మం పేరుతో మనం తిరిగి మధ్య యుగాల మూలాలు వైపు వెళుతున్నామా? అన్న అనుమానం కూడా కలుగుతుంది.

**సంఘటన మూలం ఏమిటి?**

అసలు ఈ సంఘటనకు మూలంగా చెప్పబడుతున్న అంశం వక్రీకరించబడింది. జస్టిస్ గవాయ్ ఓ కేసు సందర్భంగా విష్ణుమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే దుష్ప్రచారం పనికట్టుకుని చేశారు? ఒకసారి ఆ కేసు పుర్వాపరాలను పరిశీలన చేస్తే..గత సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు లో ఓ వ్యక్తి పిల్ వేశారు. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయంలో ఓ విగ్రహం తలనరికి పడి ఉంది. చాలా ఏళ్ళుగా అది అలా ఉంది. అది విష్ణుమూర్తి విగ్రహం. కనుక దాని తల ఏర్పాటు చేయించమని ప్రభుత్వాన్ని ఆదేశించాలని ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసిన వ్యక్తి కోరాడు. ఆ సందర్భంగా జరిగిన వాదోపవాదాలలో మన ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఖజురహో అనేది పూజలు నిర్వహించే దేవాలయం కాదు. కేవలం శిల్ప సంపదను ఆస్వాదించడం కోసం పర్యాటకులు, విదేశీయులు అక్కడకు వస్తారు. ఆ ఖజురహో ఇప్పుడు పురాతత్వశాఖ ఆధీనంలో ఉంది. కనుక పిటీషనర్ మొదట ఆ శాఖను సంప్రదించాలి. ఈ పిటిషన్ పబ్లిక్ ఇంట్రస్టు కం, పబ్లిసిటీ ఇంట్రస్టుతో పిల్ వేసినట్లు ఉంది అంటూ కుండబద్దలు కొట్టి చెప్పారు. దాన్నే మన సనాతన ధర్మపరిరక్షకవాదులు, కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించి ప్రచారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే తప్పుడు ప్రచారం నిర్వహించి తమ సహజసిద్ధమైన బురద జల్లారు. కరుడుకట్టిన కులోన్మాద ఛాయల్లో న్యాయమూర్తిని చూశారు. ప్రజల్ని రెచ్చగొట్టారు. దాని ఫలితమే కోర్టులో జరిగిన దుస్సంఘటన. ఆ కేసు సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఎక్కడా అనుచిత వ్యాఖ్యలు చేయలేదు. ఆ మేరకు ఆయన వివరణ ఇచ్చారు.

**ఎవరు విజ్ఞులు?:**

సంఘటన తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్ పెద్ద మనస్సుతో వ్యవహరించారు. దాడిచేసిన వ్యకిపై ఎలాంటి కేసు లేకుండా వదిలివేశారు. అతని చర్యను ఉదారంగా తీసుకున్నారు. ఓ మానసిక విచలితుడి క్రియలాగా భావించి కోర్టు కార్యకలాపాలు యధావిధిగా నిర్వహింప చేశారు. తనపై జరిగిన దాడిని సమస్యగా తీసుకోవద్దని కూడా సూచించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంతో విశాలమైన హృదయంతో ఆలోచించి ఉన్నత న్యాయస్థానం గౌరవం అత్యున్నతంగా నిలబెట్టారు. కానీ, ప్రధాన న్యాయమూర్తిపైనే చెప్పువిసిరిన సనాతన ధర్మరక్షకుడైన ఆ న్యాయవాది రాకేష్ కిశోర్ ఆలోచనల్లోకానీ, ఆయన లోపలపశ్చాత్తాపం గానీ, మచ్చుకీ కనపడలేదు. పైగా ఆయన మీడియాకిచ్చిన ఇంటర్యూలో మళ్ళీ అవకాశం అనేదివస్తే అదే పనిచేస్తాను. నేనేమీ ఆ సంఘటన తప్పు అనుకోవడంలేదు! అని ప్రకటించడం చూస్తే, మనము, మనదేశం ఎటుపోతుంది అనే ఆవేదన కలుగుతుంది.

**ఈ అరాచకాలకు ఆనవాళ్ళు ఎక్కడ?:**

ఇటీవలనే ఆర్‌యస్‌యస్ అనబడే హిందూ ధర్మ పరిరక్షణ సంస్థకు నూరేళ్ళు నిండిన సందర్భంగా మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వంద రూపాయలు నాణెం విడుదల చేశారు. దానిపై ఉన్న భారతమాత బొమ్మ చేతిలో జాతీయ జెండాకు బదులు సంఘ్ పరివార్ జెండాను, అభివాదం చేస్తున్న సంఘ్‌పరివార్ కార్యకర్తలను వాడడం ఆశ్చర్యానికి గురిచేసింది. తొలిసారి మత ప్రాతిపదికలేని మన సెక్యులర్ వ్యవస్థలోకి మత ఆనవాళ్ళనుమన కేంద్ర ప్రభుత్వమే చొప్పించినట్లు అయ్యింది.. సంఘ్ పరివార్ వాద నేపథ్యం నుండి ప్రధానమంత్రిగా మోడీ రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత సంఘపరివార్ ఎజెండాను క్రమంగా పరిపాలనాపరమైన నిర్ణయాలలో చొప్పించడం మొదలైంది. న్యాయ వ్యవస్థలో చూసినట్లయితే ఇండియన్ పీనల్ కోడ్‌ను భారతీయ న్యాయ సంహితగా మార్చడం, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాల రూపకల్పన, జమ్మూకాశ్మీర్ 370 ఆర్టికల్ తొలగింపు, న్యాయమూర్తి నియామకం కొలీజియంలో మార్పులు, ప్రధాన న్యాయమూర్తి అధికారాలకు కత్తెరవేస్తూ ఎన్నికల కమీషన్ నియామకం ప్రక్రియ నుండి తొలగించడం లాంటి చర్యలు చేపట్టారు. అంటే న్యాయవ్యవస్థను బలహీనపరచే చర్యలు కనిపించాయి. ఎన్ఆర్‌సి లాంటి వివాదాస్పద చట్టాలకు రూపకల్పన చేశారు. అంతేకాదు, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఐటి, సిబిఐ, ఇడిలాంటి సంస్థలను కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేసే సంస్థలుగా మార్చారనే విమర్శలు ప్రతిపక్షాలు నుండి వినవచ్చాయి. అందుకు ప్రతిపక్ష ప్రభుత్వాలు ఉన్న డిల్లీ, మహారాష్ట్ర, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక, కేరళ లాంటి రాష్ట్రాల్లో కేసులు, విచారణ, అరెస్టులుతో ప్రతిపక్షాలను బలహీనపరిచిన వైనం ప్రత్యక్షంగానే చూశాం. సహజంగానే భారతీయ న్యాయ వ్యవస్థ స్వతంత్రత అనేది పాలకులకు మింగుడు పడడం లేదు. ఇట్లాంటి వాతావరణంలో న్యాయమూర్తి పై సనాతన వాదంపేరుతో జరిగిన దాడిని మనం తేలిక గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఖచ్చితంగా న్యాయవ్యవస్థను కూడా బెదిరించే స్థితికి ఆటవిక చర్యతో దిగజారడమే అందుకు నిదర్శనం. ఒకవేళ ఆ సంఘటన ప్రభుత్వం ప్రమేయం లేకుండా జరిగిన ఉన్మత్త చర్యనే కావచ్చును? కానీ సనాతనధర్మం అనే ఎజెండాను తీసుకుని అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి పై చేసిన దాడికి కారణం పాలకవర్గం అదే పనిగా రెచ్చగొడుతున్న మతోన్మత్త చర్యల పర్యవసానంగా మాత్రం ఖచ్చితంగా చూడాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే మతోన్మాదాన్ని పరిపాలనలో నెత్తికెత్తుకున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి మన పొరుగు దేశాలు వెనుకబాటుతనం మనకు స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు, మరో కొసకు మనం కొట్టుకు పోవాలనే విధానం ఎంతమాత్రం సమ్మతం కాదు. మనది కుల, మత ఉన్మాదాలకు అతీతమైన సెక్యులర్ రాజ్యాంగం కలిగిన ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ బెదిరింపులు, అదిరింపులు, లొంగుబాటులకు తావులేదు. అన్నం లేకపోయినా ఈ దేశ ప్రజలు ఆకలి బాధను భరిస్తారు. కానీ, ప్రజాస్వామ్య హననాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరు. ప్రజాస్వామ్యప్రియులారా! మనం సనాతన ధర్మం పేరుతో మధ్యయుగాల ఆటవిక ధర్మం వైపు నిలబడదామా? ఆధునిక స్వేచ్ఛ, స్వాతంత్ర్య ఆలంబన గా ఉన్న ఆధునిక జీవనం వైపు నిలబడదామా? తేల్చుకోవాలసింది విశాల దేశభక్తియుత ప్రజలే!

**ఎస్.తిర్మల్,** 94418 64514

## పేదరికం నిర్మూలనకు
# విధానాలతో కూడిన పరిష్కారం అవసరం

'విశ్వగురువు'గా అవతరించడానికి భారతదేశం వేస్తు న్న అడుగులు, ప్రపంచ వేదికపై సాధిస్తున్న ఆర్థిక వృద్ధి ప్రతి భారతీయుడికి గర్వకారణమే. మన దేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. అంతరిక్ష పరిశోధనలలో, సాంకేతిక రంగాలలో మన విజయాలు అద్భుతం. మెరిసే ఆకాశహర్మ్యాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, డిజిటల్ విప్లవం గురించి మనం గర్వంగా మాట్లాడుకుంటాం. అయితే, ఈ వేగవంతమైన ఆర్థిక వృద్ధిలో, మన దేశంలో ఒక గణనీయమైన వర్గం ఇప్పటికీ పేదరికంలోనే జీవిస్తోంది. పేదరికం అనేది కేవలం డబ్బు లేకపోవడం మాత్రమే కాదు. అది అవకాశాల లేమి. మంచి చదువు లేకపోవడం వల న తక్కువ వేతనాలకే పనిచేయాల్సి రావడం, తద్వారా అదే పేదరికం మళ్ళీ వారి పిల్లలకు సంక్రమించడం అనేది ఒక విషవలయంలా మారింది. మన దేశం గురించి మనం గొప్పగా చెప్పుకునేటప్పుడు, కడుపునిండా తిండి దొరకని బాల్యాన్ని, సరైన వైద్యం అందక బాధపడుతున్న వృద్ధులను, కూలీకి వెళ్లినా కనీస అవసరాలు తీరని దినసరి కూలీలను మనం ఎలా విస్మరించగలం? 'ఎన్ని కష్టాలొచ్చినా ఓర్చుకుందాం' అని ఆశగా బతికే మన సామాన్య ప్రజల నిరీక్షణ ఎప్పుడు తీరుతుం ది? అభివృద్ధి సంపన్నులకు మాత్రమే పరిమితమైతే, అది అసమానతలకు ఆజ్యంపోసి సమాజ పునాదులను బలహీనపరుస్తుంది.

**బహుముఖ పేదరిక నిర్మూలనలో పురోగతి:**

గత దశాబ్దంలో పేదరికాన్ని తగ్గించడంలో భారతదేశం గణనీయమైన పురోగతి సాధించింది అనడంలో సందేహం లేదు. బహుముఖ పేదరిక సూచీ 2015–16 నుండి 2019–21 మధ్యకాలంలో దేశంలో దాదాపు 13.5 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఇది ఒక గొప్ప విజయం. ఈ సూచీ పేదరికాన్ని కేవలం ఆదాయం లేకపోవడం కాకుండా, విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు వంటి 12 అంశాలలో ఉండే లేమిని పరిగణనలోకి తీసుకుంటుంది. గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిష్పత్తి 32.59% నుండి 19.28%కి తగ్గగా, పట్టణ ప్రాంతాలలో ఇది 8.65% నుండి 5.27%కి తగ్గింది. గ్రామీణ భారతదేశంలో వేగవంతమైన పురోగతి కనిపిస్తున్నప్పటికీ పట్టణ ప్రాంతాలతో పోలిస్తే పేదరికం తీవ్రత గ్రామాలలోనే అధికంగా ఉంది. అయినప్పటికీ, నివేదికలు ఆశాజనకంగా ఉన్నా, వాస్తవ సంఖ్యలు మన ముందు ఇంకా పెద్ద సవాలును ఉంచుతున్నాయి. 2023లో విడుదలైన అంతర్జాతీయ బహుముఖ పేదరిక సూచీ ప్రకారం, భారతదేశంలో ఇప్పటికీ 23 కోట్లకు పైగా ప్రజలు బహుముఖ పేదరికంలో ఉన్నారు. అంతేకాక, ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే 'తీవ్ర పేదరికం'లో ఉన్నవారి సంఖ్య 2024 నాటికి సుమారు 12.9 కోట్లుగా ఉండవచ్చని అంచనా. ఈ గణాంకాలు చూస్తే అభివృద్ధి చెంది న దేశంగా మారాలనే మన లక్ష్యం సాకారం కావాలం టే ఇంకా ఎంత దూరం ప్రయాణించవలసి ఉంటుందో స్పష్టమవుతుంది.

**అసమానతలు – అభివృద్ధికి అడ్డుగోడ:**

పేదరికం, అసమానత అనేవి ఒకే నాణేనికి రెండు వైపులాంటివి. అధిక ఆర్థిక వృద్ధి, జిడిపి వృద్ధి సాధిస్తున్నప్పటికీ, ఆ వృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందడం లేదు. దేశంలో సంపద కేంద్రీకరణ పెరిగింది. పారిశ్రామిక, సేవారంగాల వృద్ధి ఎక్కువ మందికి ఉద్యోగాలను సృష్టించినప్పటికీ, ఆ ఉద్యోగాలు ఎక్కువగా తక్కువ వేతనాలు ఇచ్చే అసంఘటిత రంగంలోనే ఉన్నాయి. దీని ఫలితంగా, పేదరికం నుంచి బయటపడిన వారు కూడా సులభంగా తిరిగి పేదరికంలోకి జారిపోయే 'దుర్బలత్వం' అనే ప్రమాదకర పరిస్థితిలో ఉన్నారు. సుమారు 18.7% మంది ప్రజలు అంటే 26 కోట్లకు పైగా బహుముఖ పేదరికానికి గురయ్యే ప్రమాదంలో ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి.

**విధానాలతో పరిష్కారాలు:**

ప్రభుత్వాలు పేదరికాన్ని నిర్మూలించడానికి అనేక సంక్షేమ పథకాలను ఉదాహరణకు, ఉచిత రేషన్, ఆవాస్ యోజన వంటివి అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు నిస్సందేహంగా కోట్ల మందికి తాత్కాలిక ఉపశమనాన్ని ఇచ్చాయి. అయితే కేవలం తాత్కాలిక సహాయం కాకుండా పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించడానికి మూల కారణాలపై దృష్టి సారించాలి. నాణ్యమైన విద్య పేదరికం నుంచి బయటపడటానికి అత్యంత శక్తివంతమైన సాధనం. పాఠశాలల్లో నమోదు శాతం పెంచడం మాత్రమే కాక, నాణ్యమైన బోధన అందించాలి. యువతకు మార్కెట్ అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ కల్పించాలి. వ్యవసాయరంగం నుండి పరిశ్ర



మలు, సేవల రంగానికి మారుతున్న శ్రామిక శక్తికి తగినన్ని, మెరుగై న వేతనాలు ఇచ్చే ఉద్యోగాలు సృష్టించాలి. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా, విద్యుత్, ఇంటర్నెట్ వంటి మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాలి. ప్రతి పౌరుడికి సులభంగా, చౌకగా వైద్య సదుపాయాలు అందేలా చూడాలి. ఎందుకంటే, ఒక్క అనారోగ్య ఖర్చు కూడా ఒక పేద కుటుంబాన్ని మళ్లీ పేదరికంలోకి నెట్టేయగలదు.

**అభివృద్ధికి నిబద్ధత:**

పేదరికం లేని భారతదేశం అనేది మనందరి ఉమ్మడి లక్ష్యం. ఇది స్పష్టమైన గణాంక విశ్లేషణ, పారదర్శక విధానాల అమలు, సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలను చేర్చాలనే నిబద్ధత ద్వారానే సాధ్యమవుతుంది. పేదరికాన్ని ఒక రాజకీయ సమస్య గా కాకుండా, మానవతా సమస్యగా, దేశ అభివృద్ధికి అడ్డుకట్టగా పరిగణించాలి. ప్రతి పౌరుడు గౌరవంగా, సురక్షితంగా జీవించే హక్కును కలిగి ఉన్నాడని మనం గుర్తుంచుకోవాలి. ఈ అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా చేరినప్పుడే, మనం నిజమైన అభివృద్ధిని సాధించినట్లు. సమానత్వం మన ఆశయం కావాలి. అది మన చర్యలలో ప్రతిబింబించాలి. ప్రతి భారతీయుడు గౌరవంగా, కడుపునిండా తిని, పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలిగినప్పుడే, మన 'విశ్వగురువు' కీర్తి నిజమవుతుంది. ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు, పౌరులు అందరూ ఏకమై ఈ సమస్యను ఎదుర్కోవాలి. కేవలం దాతృత్వంతోనో పేదరికాన్ని నిర్మూలించలేం. ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపే దీర్ఘకాలిక విధానాలు అవసరం. ఈ దిశగా పయనించడానికి, ప్రభుత్వాలు, పౌర సమాజం ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించాలి.

**డి.జె.మోహనరావు**

## వైద్య సహాయం అందించండి

లేఖ

ఈ మధ్య ప్రసారమాధ్యమాలు, పత్రికలు సోషల్ మీడియాలలో తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు, బిడ్డలు అని చూస్తున్నాము. సంతానం ఎందుకు పట్టించుకోవడం లేదంటే వారి అవసరాలు తీరిపోయాయి. గొప్పగా సంపాదన ఓ స్థాయికి ఎదిగి సంఘంలో గౌరవప్రదమైన హోదాలో ఉంటున్నాం అనే భావన కానీ కనిపెంచిన తల్లిదండ్రులను విస్మరించడం శోచనీయమైన విషయం. ప్రస్తుత బిడ్డలు తాము కూడా భవిష్యత్తులో ఇదే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆలోచించకపోవడం వలనే ఈ పరిస్థితి వస్తున్నది. ఇదే పద్ధతిలో సింగరేణి సంస్థ అవలంబిస్తున్నది. సంస్థ మహోన్నతికి తోడ్పడిన రిటైర్డ్ ఉద్యోగులను విస్మరిస్తున్నది. ఉచిత, మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని పదే పదే కోరుతున్నా ఫలితం శూన్యం. సింగరేణి కేంద్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా 41:59 ఆధీనంలో నడుస్తున్న ప్రత్యేక ప్రతిపత్తి గల సంస్థ వేతన ఒప్పందాలు చట్టరీత్యా బావుల త్రవ్వకము, మూసివేత ఇతరత్రా మాత్రమే. కోల్ ఇండియాతో సంబంధంలేని విధంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ పాలసీ అనేక ఉన్నతమైన సౌకర్యాలు కల్పిస్తున్నది. ఇంతేగాక లాభాల వాట కూడా ప్రతి సంవత్సరం చెల్లిస్తున్నారు. కానీ రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించడానికి కోల్ ఇండియా నియమ నిబంధనలు అడ్డువస్తున్నాయి అని తెలుపుతున్నారు. ఇది చాలా విచిత్రమైన విషయం. స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజా కార్మిక సంక్షేమానికి మారుపేరైన మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి సూచించిన యాజమాన్యం వైద్య సౌకర్యాలు కల్పించుటకు కనికరించడం లేదు. కానీ రిటైర్డ్ ఉద్యోగులను కాలిపోయిన బొగ్గు బూడిదగా భావిస్తున్నది. రాష్ట్ర సంక్షేమానికి, అభివృద్ధికి ఇతోధికముగా పాటుపడుతున్న విధంగా రిటైర్డ్ ఉద్యోగులకు ఉచితంగా మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని మనసారా వేడుకొనుచున్నాము. ప్రస్తుతం సింగరేణి హాస్పిటల్స్‌లో ఔట్ పేషెంట్, సిపిఆర్ఎంఎస్ ద్వారా ఎనిమిది లక్షల వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. అచేతన వ్యవస్థలో ఉన్న జీవిత చివరి రోజులలో అయినా ఉచిత, మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాం.

**దండంరాజు రాంచందర్ రావు**

## సకాలంలో యూరియా అందించి ఆదుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/మహదేవపూర్: రైతులకు సకాలంలో యూరియా అందించి రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదుకున్నారని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు గురువారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మహాదేవపూర్ ఉమ్మడి మండలంలో యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలపగా వెంటనే స్పందించిన మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసి మహాదేవపూర్,పలిమెల మండలాల రైతులకు సకాలంలో యూరియా అందించారని అన్నారు.రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మహాదేవపూర్ ఉమ్మడి మండలంలో 909 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసామని తెలిపారు.రైతులకు యూరియా పంపిణీ చేయడంలో సహకరించిన వ్యవసాయ,పోలీసు శాఖ అధికారులకు సహకార సంఘం సిబ్బంది,రైతులు కృతజ్ఞతలు తెలిపారని అన్నారు

## బిఎఎస్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/నెక్కొండ: బెస్ట్ అవేలబుల్ స్కీం(బిఎఎస్) కింద విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల మండల స్థాయి కమిటీ ఎన్నికలు గురువారం నెక్కొండలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి, నెక్కొండ మండల సిపిఐ బాధ్యుడు కందిక చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఎన్నిక జరుగగా అధ్యక్షుడిగా జీడి ప్రసాద్, కార్యదర్శిగా నేతావత్ వీరన్న, కోశాధికారి దాసరి యాదగిరి, ఉపాధ్యక్షులుగా జన్ను అశోక్, బానోతు మోహన్, పాపావత్ సుజాత, ఈదునూరి గణేశ్వరి, సహాయ కార్యదర్శులుగా మాలోతు లక్ష్మణ్, బానోతు వెంకన్న, మూలం కల్యాణి, భూక్య రవీందర్, సభ్యులుగా భరత్, శ్రీనివాస్, హరిరామ్, నగేష్, రమేశ్, వెంకన్న, రజిని, నిరోష ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన భద్రకాళీ ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు



ప్రజాపక్షం/ఖిలా వరంగల్:తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భద్రకాళి ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ ఓరుగంటి పూర్ణచందర్ సిఎంను మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం అయినా భద్రకాళి దేవస్థాన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కుటుంబ సమేతంగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవాల్సిందిగా ఆయన కోరారు. సిఎంను కలిసిన వారిలో ఆలయ కమిటీ బోర్డు మెంబర్లు ఉన్నారు.

## బిసి బంద్‌కు అందరూ సహకరించాలి



ప్రజాపక్షం/ తొర్రూరు : బిసిలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్‌తో బిసి సంఘాలు ఈ నెల 18న రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వగా సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఈ బంద్‌కు తొర్రూరు పట్టణ వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు సహకరించి బంద్‌లో పాల్గొనాలని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ భిక్షపతి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బందు మహేందర్‌లు కోరారు. గురువారం సిపిఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బిసిలకు రిజర్వేషన్ లేకపోవడంతో సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయని అన్నారు. రిజర్వేషన్ అమలు జరిగితే అన్ని కులాలకు సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందని, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సమాన అవకాశాలు కలుగుతాయని దురుద్దేశ్యంతో కొందరు దీనిని కోర్టులకు వెళ్లి రాజకీయం చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్‌కుమార్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, పి.యాగయ్య, యం.మల్లయ్య, చంద్రయ్య, యాకయ్య, అనిల్, కుమారస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఒలింపియాడ్ పరీక్షల్లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు



ప్రజాపక్షం / నర్సంపేట : జాతీయస్థాయిలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఒలంపియాడ్ పరీక్షల్లో భాగంగా పరీక్షల్లో నర్సంపేట శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 6, 7, 8 తరగతులకు చెందిన విద్యార్థులు ఏ కంగా 77 మంది విద్యార్థినీ విద్యార్థులు మొదటి లెవెల్ లో అద్భుతమైన మార్కులు సాధించి రెండవ లెవెల్ కి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె అమర్ నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కె అమర్ నాథ్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు జాతీయ అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో రాణించగలిగే స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్ తిరుమల్ రెడ్డి , డీన్ చిరంజీవి , సి బ్యాచ్ ఇన్‌చార్జి చంద్రకాంత్ ,ఒలంపియాడి ఇన్‌చార్జి ఎండి షరీఫ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి: ఎమ్మెల్యే నాగరాజు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా నూతన వధూవరులకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించబడిందని అన్నారు. గురువారం హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నివాస క్యాంపు కార్యాలయంలో ఖిలా వరంగల్, హన్మకొండ మండల పరిధిలోని 43, 2, 56వ డివిజన్ల పరిధిలోని 32మంది కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ లబ్ధిదారులకు 32లక్షల 3వేల 712 రూపాయల విలువ గల చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూపార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గత ప్రభుత్వ హ యాంలో మిగిలిపోయిన సిఎం సహాయ నిది చెక్కులను సైతం తీసుకు వ చ్చి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్ కార్యాలయంకు వచ్చిన ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా ముం దుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలో ని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు చేయించి లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్, మాజీ జెడ్పిటిసి బానోతు సింగిలాల్, హన్మకొండ మండల పార్టీ అధ్యక్షుడు మాదాసి అజయ్, డివిజన్ల అధ్యక్షులు కొంక హరిబాబు, చింత ప్రకాష్, వర్ధన్నపేట సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరుపతి, కాంగ్రెస్ నాయకులు చింత రమేష్, దూలం సదానందం, మణీంద్రనాథ్, బూర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతు-కూలీలకు అండగా ప్రభుత్వం

### ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మంత్రి సీతక్క



ప్రజాపక్షం/వెంకటాపూర్ : మండల కేంద్రంలోని బిసి కాలనీకి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు బయ్యా ప్రమీల ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవనోపాధికి చిహ్నంగా నిలిచిందని మంత్రి సీతక్క అన్నారు. పేదల బాగోగుల పట్ల శ్రద్ధవహించడం అందులో భాగమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు అంటేనే కాంగ్రెస్ గుర్తుకు వస్తోందని, పేద ప్రజల కలల ఇళ్ల రూపంలో ప్రతిబింబించడానికి ఈ పథకం దోహదపడిందని మంత్రి సీతక్క వివరించారు. ప్రజా ప్రభుత్వమే నిజమైన రైతుకూలీలకు అండగా నిలుస్తోందని మంత్రి సీతక్క అన్నారు. రైతును “రాజు”గా చూడాలనే సంకల్పంతోనే సన్నవరి వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. తొమ్మిది నెలల వ్యవధిలోనే రూ. 21 వేల కోట్లతో రెండు లక్షలలోపు ఉన్న రైతుల రుణ మాఫీ చేయడం, రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం, మూడు విడతల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు కట్టించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అలాగే, 7లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, 17 లక్షల పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు నమోదు చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వమే విజయవంతంగా అమలు చేసిందని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెద్దుల సమపాళ్లలో ముందుకు వెళ్తున్నాయి అని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. పేదల గౌరవప్రదమైన జీవనానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రామ్ రెడ్డి, జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి :విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి అంబేద్కర్ స్టేడియంలో 69వ స్కూల్ గేమ్స్ ఫడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై జ్యోతి ప్రజ్వలన, జెండా ఆవిష్కరన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వానికి, మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, సహనాన్ని నాయకత్వ లక్షణాలను కూడా పెంపొందిస్తాయని చెప్పారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ రఘు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కోటా రాజబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలకు తెలంగాణ సర్కార్ ప్రాధాన్యం

### ఎంపి డాక్టర్ కడియం కావ్య



ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో గురువారం ప్రారంభమైన 5వ నేషనల్ ఓపెన్ అండర్23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలను వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఖేలో ఇండియా2026 క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 2036లో భారత్‌లో జరగనున్న ఒలింపిక్స్ క్రీడల్లో కొన్ని గేమ్స్ తెలంగాణలో నిర్వహించేందుకు సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని క్రీడాకారులకు అనువుగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, క్రీడా స్ఫూర్తితో ప్రతి క్రీడాకారుడు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 945 మంది మహిళా అథ్లెటిక్స్ పాల్గొంటుండగా, వారిలో 20 మంది తెలంగాణకు చెందినవారని ఎంపి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చైర్మన్ ఎర్రబెల్లి రాజేశ్వరరావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మేయర్ గుండు సుధారాణి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, క్రీడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరతోపాటే రైతుల ఖాతాలో బోనస్

### స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్: రైతు పక్షాపతి కాంగ్రెస్ ప్రభుత్వమని.. రైతులు దళారుల వద్ద మోసపోవద్దనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌తోపాటు నమిలిగొండ, శివునిపల్లి గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తాగునీరు, విద్యుత్ లైట్లతో పాటు ఇతర ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మహిళలకు ఉపాధి కల్పించాలని, మహిళా సంఘాలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో మహిలా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వకూడదని ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకరావాలన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని, దళారుల వద్దకు వెళ్లి నష్టపోవద్దన్నారు. మొదటి గ్రేడ్ రకం ధాన్యానికి రూ. 2389, రెండో గ్రేడ్ ధాన్యానికి రూ. 2369 మద్దతు ధర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సీజన్‌లో రైతులకు మద్దతు ధరతో పాటే బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో వారం రోజులలోపే జమ కానున్నాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని కోరారు. రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. దేశంలోనే ఎక్కడా లేని రైతు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేయడం, 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు రైతులకు పెట్టుబడి సాయం అందించడం ఒక చరిత్ర అన్నారు. సన్నాలకు రూ. 500 బోనస్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలుచేస్తూ రైలుకు అండగా ప్రభుత్వం నిలబడుతుందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు రూ. 23 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయనుందని, సీజన్‌కు రూ. 4 నుంచి 5 వేల కోట్ల నష్టాన్ని ప్రభుత్వం భరిస్తుందన్నారు. నమిలిగొండ గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అందుకు గ్రామస్థుల సహకారం అవసరమన్నారు. నమిలిగొండ గ్రామ ప్రధాన రహదారి ఇరుకుగా ఉందని ఆ రోడ్డును వెడల్పు చేయాల్సినవసరం ఉందన్నారు. రోడ్డు వెడల్పు చేయడానికి గ్రామస్థులు సహకరించాలన్నారు. రోడ్డు వెడల్పు పనులకు ఇప్పటికే రూ. 60 లక్షలు మంజూరయ్యాయన్నారు. గ్రామస్థుల సహకరిస్తే సంక్రాంతి నాటికి ఆ రూ. 60 లక్షలతోపాటు మరో రూ. 60 లక్షలు మంజూరు చేసి మొత్తం రూ. 1.20 కోట్ల గ్రామం ప్రారంభం నుంచి సబ్ స్టేషన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేస్తే బాధ్యత నాదేని హామీ ఇచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్ పర్సన్ శిరీష లావణ్యరెడ్డి, ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దారు వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, రజాక్ యాదవ్, బూర్ల శంకర్, పోసాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మల్యాల ప్రధాన గేట్ ఎదుట ఎఐటియుసి ధర్నా

### జెవిఆర్ హెచ్‌ఆర్ ఎస్ – కెవికె టైం స్కేల్ స్కేల్ ఉద్యోగుల సమస్యలపై వినతి




ప్రజాపక్షం/మహబూబాబాద్: మల్యాల జెవిఆర్ హెచ్‌ఆర్ ఎస్ – కెవికె టైం స్కేల్ స్కేల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ గురువారం కెవికె ప్రధాన గేటు వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జీవో ప్రకారం ఉద్యోగ విరమైన వయసు 61 సంవత్సరాల వరకు టైం స్కేల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. టైం స్కేల్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వారు ప్రమాద సహజ మరణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ మూడు లక్షలు ఇవ్వాలని, దీర్ఘకాలం మల్యాల హెచ్‌ఆర్‌ఎస్ లో పనిచేసిన ఉద్యోగ కుటుంబాలకు ఉద్యాన కళాశాలలో కాంట్రాక్టు అవుట్సోర్సింగ్, డైలీ వేజ్ నియామకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, దినసరి కూలీ కార్మికులుగా పనిచేస్తున్న వారికి స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు, పలు సమస్యలపై శుక్రవారం మానుకోటలోని ఉద్యాన కళాశాల ముందు ఆందోళన నిర్వహించబోతున్నామని, త్వరలో చలో సిద్దిపేట కార్యక్రమాన్ని కూడా ఎంచుకొని టైమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం తప్పదని బి అజయ్ సారధి రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా సమస్యల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సైంటిస్టు ప్రశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ టైం స్కేల్ మరియు కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేశపల్లి నవీన్, బానోత్ లింగ్య నాయక్, వెలుగు శ్రావణ్, పెరుగు కుమార్, వీరవెల్లి రవి, కాదం శ్యాం ప్రసాద్ యాదవ్, శ్రీరాములు, ఇమామ్, హుస్సేన్, షరీఫ్, చింతకాయల వెంకన్న, సూరయ్య, మహబూబ్బీ, ఐలమ్మ, ఎల్లయ్య, యాకమ్మ, ఖతీజ, కళమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ లీవ్ పిటిషన్ కొట్టేయడం బాధాకరం :వెంకట్రాములు

ప్రజాపక్షం / వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ను సుప్రీం కోర్ట్ నేడు కొట్టివేయడం అత్యంత బాధాకరమని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బిసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల సాధనకు 18న జరగనున్న రాష్ట్ర బంద్ కు బిసి హక్కుల సాధన సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. బిసి రిజర్వేషన్లు 42శాతం అమలు జరగాలంటే 9వ షెడ్యూల్లో చేర్చడం తప్ప మరో మార్గం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా ఉద్యోగ రంగాల్లో, స్థానిక సంస్థల్లో42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉభయసభలలో ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపిస్తే పార్లమెంట్లోఆమోదించి తొమ్మిదో షెడ్యూల్లో చేర్చకుండా బిసిలకు రిజర్వేషన్లు దక్కకుండా బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదన్నారు. ఆరు ఏడు శాతం లేని అగ్రవర్ణాల పేదల కోసం ఆగమేఘాల మీద పార్లమెంటులో బిల్లు పాస్ చేస పది శాతం రిజర్వేషన్లు ఇచ్చిన బిజెపి 56 శాతానికి పైగా ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఎందుకు పార్లమెంటులో ఆమోదించి 9వ షెడ్యూల్లో చేర్చడంలేదనిప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లను రా జ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చాలని జరగనున్న బంద్ లో వ్యాపార వాణిజ్య వర్గాలు విద్యార్థి యువకులు మేధావులు అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని బీసీ రిజర్వేషన్లసాధనకై సమర శంఖం పూరించాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

## బిసి రిజర్వేషన్ల చట్టాన్ని కేంద్రం ఆమోదించేదాకా పోరాడుతాం

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేష్




ప్రజాపక్షం/ నర్సంపేట : బిసి రిజర్వేషన్ల చట్టాన్ని కేంద్రం ఆమోదించేదాకా బిసిలతో కలిసి పోరాడుతాంమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్ అన్నారు. మోదీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సిపిఐ బిసి హక్కులసాధన సమితి రాష్ట్ర సమితిల పిలుపు మేరకు బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామితో కలిసి నర్సంపేట అమరవీరుల స్తూపం దగ్గర సిపిఐ బిసి హక్కుల సా ధన సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సం దర్భంగా రమేష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకారం అసెంబ్లీలో చేసిన స్థానిక సంస్థలలో విద్యా ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని అన్ని పార్టీల శాసనసభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపి నెలలు గడుస్తున్నా మోడీ ప్రభుత్వం బిసి బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చి ఆమోదించకుండా బిసివ్యతిరేక వైఖరిని అవలంభిస్తున్నదన్నారు. బిసిల రిజర్వేషన్లు సాధించాంతవరకు బిసి కులాలన్నీ రాజకీయాలకతీతంగా ఉద్యమించాలన్నారు. ఈ నెల 18న బిసి జెఎసి తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతును ఇస్తున్నామన్నారు. . ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అక్క పెల్లి రమేష్ , ఎఐటియుసి రాష్ట్ర నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు గుంపెల్లి మునీశ్వర్, సిపిఐ మండల కార్యదర్శి అయిత యాక య్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవితచ, సిపిఐ నాయకులు పిట్టల సతీష్ గడ్డం, నాగరాజు, గడ్డం యాకయ్య, మాతంగి సురేష్, పద్మ ,కమల, వెంకన్న, అరుణగుంటి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ హాస్పిటల్‌లోనే డెలివరీ కావాలి

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




ప్రజాపక్షం/జనగామ: ప్రభుత్వ ఆసుపత్రుల మీద ప్రజలకు ఎంతో నమ్మకం ఉంటుందని, దాన్ని కాపాడుకునే విధంగా వైద్య అధికారులు సేవలందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వైద్య సేవలకు సంబంధించిన వివిధ అంశాల మీద వీహెచ్‌సీల వారీగా జిల్లా వైద్యాధికారి, అన్ని వీహెచ్‌సీల మెడికల్ అధికారులు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ రిజ్వాన్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్పోరేట్ ఆసుపత్రిలకు ధీ టుగా ప్రభుత్వ ఆసుపత్రిలలో అత్యాధునిక వైద్య పరికరాలు, యంత్రాలు ఉన్నాయన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువుతోపాటు వారి ఆరోగ్యాన్ని కూడా కాపాడాల్సిన అవసరం మెడికల్ అధికారుల మీద ఉందన్నారు. ఈ సమావేశానికి డా. కె మల్లిఖార్జున రావు, జిల్లా వైద్యా, ఆరోగ్య అధికారి, ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్ష పీఠం ఎవరికి దక్కేనో?

### అధ్యక్ష పదవికి 46 దరఖాస్తులు

### అధిష్ఠానం పరిశీలనకు ఆరుగురు పేర్లు



ప్రజాపక్షం/భూపాలపల్లి :ఇటీవల కాలంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు బిసి రిజర్వేషన్లపై కోర్టు స్టే విధించడంతో నిలిచిపోవడం జరిగింది. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవులకు భర్తీ చేయాలని పిలుపునివ్వడంతో జిల్లాలో మళ్లీ రాజకీయ సందడి వాతావరణం నెలకొంది. జిల్లా అధ్యక్ష పదవికి పోటీ చేసుకునేవారు దరఖాస్తులు చేసుకోవాలని ఎఐసిసి, టిపిసిసి పిలుపునివ్వడంతో జయశంకర్ భూపాలపలి జిల్లాలో జిల్లా అధ్య క్ష పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. సుమారు ఈ అధ్యక్ష పీఠం కోసం 46 మంది నాయకులు దరఖాస్తులు చేసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులు ఆశించిన నాయకులు ఎన్నికలు ఆగిపోవడంతో మళ్లీ అధ్యక్ష పదవి కోసం ఆశావాహులు ఎక్కువయ్యారు. స్థానిక సంస్థలు వ చ్చేవరకు చూద్దాంలే ఉన్న పదవిని దక్కించుకోవాలని సంకల్పంతో కొంతమంది నాయకులు ఉన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న తరుణంలో ఈ అధ్యక్ష పదవి కీలకంగా మా రింది. 13న జిల్లా కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎఐసిసి టిపిసిసి అబ్జర్వేర్ల ఆధ్వర్యంలో స్థానిక ఎ మ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు డిసిసి అధ్యక్షుడు అ యిత ప్రకాష్ రెడ్డి ఎఐసిసి అబ్జర్వర్లు జాన్సన్ అబ్రహం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. అందులో జిల్లా వ్యాప్తంగా 46 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎఐసిసి అబ్జర్వర్లు దాన్ని పరిశీలించి అధిష్టానానికి పంపనున్నారు.

**కొత్త నిబంధనలతో నాయకుల్లో నైరాశ్యం**

ఇదిలా ఉంటే ఇటీవల టిపిసిసి నూతన నిబంధనలు విధించడంతో కొంతమంది ఆశావాహులు ఆశలను వదులుకున్నారు. కొంతమంది నాయకులు నైరాశ్యం మొదలైంది. గతంలో పోటీ చేసి ఉండి అట్లాగే ఇదివరకే పదవుల్లో ఉన్న వాళ్ళ అనుచరులకు, అట్లాగే పార్టీ కోసం ఐదు సంవత్సరాలు పూర్తిస్థాయిలో పనిచేసే ఉండాలని ఈ నూతన నిబంధనలతో కొంతమంది ఆశలు వదులుకున్నారు. ఎఐసిసి ప రిశీలనకు జిల్లా నుండి అబ్జర్వర్లు ఆరుగురిని సామాజిక ఎస్‌సి 1,ఎస్‌టి1, బిసి1, ఓసి 1,మహిళ కోటలో 1 ఒకటి చొప్పున అధిష్టానానికి ప్రతిపాదన చేస్తూ పంపినట్లు తెలిసింది. ఎఐసిసి పూర్తిస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి జిల్లా అధ్యక్షున్ని డిక్లరేషన్ చేయనున్నారు. ఈనెల 22న జిల్లా అధ్యక్ష పదవులను ఎంపిక చేసి ప్రకటించే అవకాశం ఉంది. మునుపెన్నడు లేని విధంగా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ పెరగడంతో ఈసారి జిల్లా అధ్యక్ష పీఠం ఎవరికి దక్కునోనని జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.

## అక్రమంగా వేసిన గుడిసెలను తొలగించాలి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేసిన గుడిసెలను వెంటనే తొలగించాలని తహశీల్దార్ రామకృష్ణ తెలిపారు. అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాడిస్ గెస్ట్ హౌస్ సమీపంలో 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణంలో భాగంగా రెండున్నర ఎకరాల్లోని ప్రభుత భూమిలో సుమారు 150 గుడిసెలు వెలిసాయి. దీంతో తహశీల్దార్ గురువారం పరిశీలించి తక్షణమే వీటిని స్వచ్ఛందంగా తొలగించాలని ఆక్రమణదారులకు విజ్ఞప్తి చేశారు.లేనిపక్షంలో ఎప్పుడైనా తొలగించేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎంపి రామసహాయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి కలిశారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టే పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను అందజేశారు. ఎంపి నిధుల పనుల పురోగతి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై కలెక్టర్‌తో ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి చర్చించారు.

## 22 లోపు టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేయుటకు ఆసక్తి గల వారు అక్టోబర్ 22 లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎండి ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి బాయ్స్ నందు జనరల్ టిజిటి హిందీ, ఖమ్మం బాయ్స్ నందు జనరల్ జెఎల్ జువాలజీ స్త్రీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా ఖమ్మం బాలికల జూనియర్ కళాశాల నందు జెఎల్ ఫిజిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జెఎల్, పిజిటి పోస్టులకు సంబంధిత సబ్జెక్టులలో పిజి 50 శాతం మార్కులతో పాటు బిఈడిలో 50 శాతం మార్కులు, టిజిటి హిందీ పోస్టుకు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం, హెచ్‌పిటి లో ఉత్తీర్ణత, టెట్ తప్పనిసరి అని, బోధనా అనుభవం మూడేళ్లు ఉండాలని, అభ్యర్థులు ఖమ్మం జిల్లా వారై ఉండాలన్నారు. అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్ కాపీలు, ఇతర పత్రాలతో సంబంధిత మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు అక్టోబర్ 22న సాయంత్రం నాలుగు గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు. ఈ నియామకాలు పూర్తిగా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన తాత్కాలికంగా ఉంటాయని అభ్యర్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి తెలిపారు.

## బిసి ఉద్యమకారుల బంద్ కార్యక్రమాలకు తుడుం దెబ్బ మద్దతు

**ప్రజాపక్షం/కారేపల్లి:**రాష్ట్రంలోని బిసి వర్గాలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించనీ వైఖరిని నిరసిస్తూ జీవో నెంబర్ 9 ఆర్డినెన్సులపై రాష్ట్ర హైకోర్ట్ స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని బిసి సంఘాలు ఐక్యంగా అక్టోబర్ 18న రాష్ట్రబంద్‌ను పిలుపు ఇచ్చారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమాలను తుడుం దెబ్బ ఖమ్మం జిల్లా అధ్యక్షుడుబచ్చలి వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్తీ రాంప్రసాద్ కమిటీ బలపరుస్తూ మద్దతు నిస్తుందన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక, రాజకీయ, సాంఘిక అసమానతల కారణంగా 1952లో రాజ్యాంగ నిర్మాణ కర్తలు రిజర్వేషన్లు రాజ్యాంగంలో పొందుపరిచారని, ఏ మేరకు ఆయా వర్గాలకు సాంఘిక ఉపశమనం కొంత కలిగిందని, ఉద్యోగాలలో, విద్యలో, రాజకీయ పదవులలో కొంత భాగం లభించిందన్నారు. అయితే ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ వర్గాలు అందులోని మరింత వెనకనున్న వారికి సామాజిక న్యాయం జరగాలని, దానికి ఆయా జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్ హక్కులు అన్ని ఉపాధి, ఉద్యోగాలు, విద్యా, రాజకీయ పదవుల రంగాలలో తగిన భాగస్వామ్యం అందుకోవాలన్నారు. 42శాతం రాజకీయ రిజర్వేషన్ కోసం బిసి వర్గాలు ఐక్యంగా చేస్తున్న కార్యక్రమాలను తుడుందెబ్బ క్రియాశీలంగా బలపరుస్తుందని తెలిపారు.

## రహదారుల అభివృద్ధికి చర్యలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. గురువారం కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించి రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ఎక్కడ గుంటలు లేకుండా సాఫీగా అందంగా ఉంచేందుకు రోడ్ల మరమ్మతులు చేపట్టామన్నారు. వర్షాకాలం తర్వాత రోడ్లు దెబ్బతినే సమస్య మరల తలెత్తకుండా నాణ్యతా ప్రమాణాలతో కోల్డ్ మిక్స్, హాట్ మిక్స్‌తో పనులు చేపడుతున్నామన్నారు. నగరంలోని ప్రధాన రహదారులతో పాటు పాడైన రోడ్లు, గుంటలు పడ్డ రోడ్లను గుర్తించి మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు.

## సమీకృత వ్యవసాయంతో సత్ఫలితాలు సాధించవచ్చు: డిఆర్‌డిఒ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:**సమీకృత వ్యవసాయంతో సత్ఫలితాలు సాధించవచ్చు అని డిఆర్‌డిఒ విద్యాచందన అన్నారు. గురువారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్‌లో ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయం కోసం ఫాంహౌస్ పని ప్రదేశాన్ని ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ భూమిలో వివిధ రకాల కూరగాయాల సాగు ఎంతో లాభదాయకమని తెలిపారు. రైతులకు సమీకృత వ్యవసాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బూర్గంపాడు గ్రామ పంచాయితీలో సిఎస్‌సి వర్క్ సైట్, టిఎన్‌ఆర్‌జేసి ఇన్‌స్టిట్యూషనరల్ మునగ ప్లాంటేషన్‌లు సందర్శించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు సలహాలను అందించారు. ఈకార్యక్రమంలో ఎస్‌బిఎం కన్సల్టెన్సీ రేవతి, ఎంపిడిఒ జములారెడ్డి, ఎపిఒ విజయలక్ష్మి, ఇసి వెంకట్, పంచాయితీ కార్యదర్శులు బర్ల ప్రభాకర్, భవాని, టిఎలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/మణుగూరు:**మణుగూరు మండలంలో ఎఐటియుసి ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. కమిటీ సమావేశంలో సిపిఐ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ హాజరై మాట్లాడుతూ రేపు 18 వ తేదీనబిసి42 శాతం రిజర్వేషన్ అమలుపై జరుగు బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చి, బంద్‌లో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఎఐటియుసి యూనియన్‌ని మంచిగా నడుపించుకోవాలని వారు కోరారు. అనంతరం నూతన కమిటీను వారి సీటులలో కూర్చోబెట్టి స్వీట్ తినిపించి, శాలువాతో ఆటో యూనియన్ ఎఐటియుసి సురక్ష బస్టాండ్ అధ్యక్షుడు ఎంఎ రాజుని, కార్యదర్శిగా మందార పుల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా టి.వీరచారిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మండల అధ్యక్షుడు రాయల భిక్షం,ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు తోట రమేష్, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# వికె ఓపెన్ కాస్ట్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యమాలు తప్పవు



*కార్మిక హక్కులకు భంగం వాటిల్లే చర్యలు మానుకోవాలి * సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూనంనేని *పలువురు కార్మికులు ఎఐటియుసిలో చేరిక



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం ఏరియా పరిధిలో నూతనంగా ప్రారంభం కానున్న వికె ఓపెన్ కాస్ట్ ఉపరితల గని బొగ్గు వెలికితీత పనులను కాంట్రాక్టుకు అప్పగిస్తే ఉద్యమాలు తప్పవని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోనే బొగ్గు వెలికితీయాయని సింగరేణిగుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం వికె కోల్‌మైన్ (వికేఓసి) పివికె 5బి మైన్లో జరిగిన ఫిట్ మీటింగ్‌లకు ఆయన ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ప్రైవేటీకరణ అంటే మక్కువని, ప్రజలకు చెందాల్సిన దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు అప్పగించే చర్యలకు పాల్పడుతున్నారని దీన్ని కార్మిక వర్గం అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులకు భంగం వాటిల్లే చర్యలను ఏలికలు మానుకోవాలని చెప్పారు. స్ట్రక్చరల్ సమావేశాల్లో గుర్తింపు సంఘం లేవనెత్తిన సమస్యలు డిమాండ్లపై యాజమాన్యం స్పందించి తక్షణమే పరిష్కరించాలని కోరారు. కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో నూతన భూగర్భ గనుల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మైన్స్ సందర్శన సందర్భంగా యువ కార్మికులు ,తదితరులు కూనంనేని సమక్ష్యంలో ఎఐటియుసిలో చేరారు. వీరికి ఎర్రకుండవా కప్పి యూనియన్లోకి ఆహ్వానించారు.

**జిఎం కార్యాలయాన్ని సందర్శించిన కూనంనేని**

కొత్తగూడెం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌ.అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు గురువారం సందర్శించారు. ఎమ్మెల్యే కూనంనేనిని జనరల్ మేనేజర్ శాలేంరాజ్ సాదరంగా ఆహ్వానించారు. ఆయన వెంట సిపిఐ జిలాల్ కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, యూనియన్ అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్రకమిటీ నాయకులు వంగ వెంకట్, జి వీరస్వామి, వి మల్లిఖార్జునరావు, రమణమూర్తి, గట్టయ్య, సుధాకర్, ప్రసాద్, హుమాయూన్ ఎస్ నాగేశ్వరరావు, భూక్యా రమేష్, బండారు మల్లయ్య, రామచందర్, సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్,మురళీ పాల్గొన్నారు.

**సిఎం రిలీఫ్ ఫండ్ పేదవర్గాలకు భరోసా**

అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద వర్గాలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం భరోసా ఇస్తుందని, ఈ పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెంఎమ్మెల్యేకూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో గురువారం సిఎం రిలీఫ్ ఫండ్ పథకంలో భాగంగా 68 మంది లబ్దిదారులకు రూ.33.68 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న డబ్బులు శాతం చాలా తక్కువగా ఉంటుందని, చెల్లింపు శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనుమతులు లేని ఆస్పత్రుల వల్ల పథకం అమలయ్యే పరిస్థితులు ఉండటం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కెసాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా ధస్రు, కంచర్ల జమలయ్య, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, నాయకులు జక్కుల రాములు, పోదిలి శ్రీనివాస్, ఎండి యాకూబ్,గణేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## జిఒ నెంబర్ 60 ప్రకారం జీతాలు

ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలపై ఇటీవల విడుదల చేసిన జిఒ నెంబర్ 60 ప్రకారం హాస్పిటల్ కార్మికులకు జీతాలు చెల్లించాలని ఎఐటియుసిఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ హాస్పటల్ నందు పనిచేస్తున్న కార్మికులకు ఆయన చేతుల మీదుగా ఏఐటియుసి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలం పాటు పనిచేస్తున్న వీరిని అన్‌స్కిల్డ్ వర్కర్లుగా పరిగణించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నెలకు కనీస వేతనం రూ.26వేలుగా ప్రభుత్వం నిర్ణయించిందని. ఆ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం దురదృష్టకర విషయమన్నారు. హాస్పిటల్లో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ తో పాటు లైఫ్ ఇన్సూరెన్స్ కూడా కల్పించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసిజిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు తడికమళ్ళ యోబు, బుర్రి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తాం

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్ కుమార్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**అభివృద్ధిలో అట్టడుగు భాగానే ఉన్న గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని రుద్రాక్షపల్లి పంచాయతీలో గల తోగ్గూడెం, బాసరం, కొమ్ముగూడెం, రుద్రాక్షపల్లి, బంగ్లా బజార్ తదితర ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆదివాసీ గూడెం ప్రాంతాల్లో అభివృద్ధికి ఇంకా నోచుకోని గ్రామాలు చాలా ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గూడాలను సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే రాగమయి ఆధ్వర్యంలో గ్రామాలను, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పదం వైపు నడిచేలా చేస్తామన్నారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ఎలాంటి సహాయం అయినా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు.అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, చిన్నారులు, రుద్రాక్షపల్లి పంచాయతీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్, ప్రజలు పాల్గొన్నారు.

## యువత మంచి నడవడికతో మెలగాలి: ఎస్ఐ




**ప్రజాపక్షం/బూర్గంపాడు:**యువత మంచి నడవడికతో మెలగాలని, హానికర పదార్థాలకు దూరంగా ఉండాలని బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ అన్నారు. గురువారం బూర్గంపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ చిన్నా అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ యువత మంచి చదువుతో మంచి అలవాట్లతో మెలగాలని, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై నిత్యం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలన్నారు. అనంతరం అదనపు ఎస్ఐ నాగబిక్షం మాట్లాడుతూ విద్యార్థులు ఈ దశలో మంచి నడవడికతో చదువుతూ మంచి పేరు ప్రఖ్యాతలు అందుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సిహెచ్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పివో జి శ్రీనివాస్, అధ్యాపక బృందం, కానిస్టేబుల్ ఎస్ పిచ్చయ్య, రాము, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధునిక కోర్టు భవనాలకు అనుమతులు మంజూరు

ఫలించిన కూనంనేని కృషి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**జిల్లా కోర్టు నూతన భవన సముదాయాల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలు శిధిలావస్తకు చేరడం, అసౌకర్యంగా ఉండటంతో స్థానిక శాసన సభ్యులు నూతన భవన సముదాయాల కోసం చేసిన కృషి ఫలించింది. టెన్ ప్లస్ టూ జిల్లా కోర్టు భవనాలు, ఫోక్సో అండ్ ఫ్యామిలీ కోర్టులతో సహ నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్అండ్‌బి రాష్ట్ర ఆర్కిటెక్ట్ వింగ్ నుంచి సత్వరమే చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ భవనాలను పట్టణ పరిధిలోని కొత్తగూడెం ఫ్యూన్స్ బస్తీ ఏరియా సర్వే నెంబరు 143లోని 10 ఎకరాల స్థలంలో నిర్మించనున్నారు. గౌరవ తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు పూర్తి ప్రాజెక్ట్ రిపోర్టు సిద్ధం చేయడం, సాయిల్ టెస్ట్ లే అవుట్ ప్రణాళిక, నిర్మాణ రూపకల్పన సిద్ధం చేయడానికి కన్సల్టెంట్లు నియామకానికి ఆర్అండ్‌బి శాఖ ఇప్పటికే టెండర్లు ప్రకటించింది. ఈ టెండర్ ప్రక్రియను కొత్తగూడెం ఆర్అండ్‌బి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చేపట్టనున్నారు. కోర్టు భవన సముదాయాలు పూర్తయితే జిల్లా న్యాయ వ్యవస్థకు ఆధునిక మౌళిక సదుపాయాలు సమకూరనున్నాయి. నూతన భవన నిర్మాణాలకు స్థల సేకరణకు కృషి చేసిన ఎమ్మెల్యేకూనంనేని సాంబశివరావుకు న్యాయవాదులు, జిల్లా ప్రజలు, వివిధ వర్గాల ప్రజల నుంచి అభినందనలు అందుతున్నాయి.

## 42 శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయాల్సిందే

18న బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ను ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల విషయంలో ద్వంద వైఖరిని అవలంభిస్తున్నాయని ఆయన ఆరోపించారు. గురువారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించినప్పుడు అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిచ్చాయని కానీ దొడ్డి దారిన కొన్ని పార్టీలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తెలిపారు. రిజర్వేషన్‌పై స్టే విధించడం వెనక కొన్ని పార్టీల కుట్ర దాగి ఉందని సురేష్ తెలిపారు. తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి రిజర్వేషన్ అమలయ్యేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బిసి రిజర్వేషన్ అమలు కోరుతూ ఈనెల 18న బిసి సంఘాలు తలపెట్టిన సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. సిపిఐ కార్యకర్తలు బంద్‌లో పాల్గొని బంద్ జయప్రదానికి కృషి చేయాలని సురేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 20 మాసాలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను అందించడం లేదని ఇప్పటికే అనేక మంది పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే పెన్షనర్స్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్స్ చేపట్టే ఆందోళనకు సిపిఐ పూర్తి మద్ధతునిస్తుందన్నారు. పత్తి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలని మద్ధతు ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. క్వింటాకు రూ. 10070 చొప్పున కొనుగోలు చేయాలని సురేష్ కోరారు. సిసిఐని వెంటనే రంగంలోకి దించాలని సురేష్ కోరారు.

# స్లాట్ బుకింగ్ పద్ధతిలో పత్తి కొనుగోళ్లు

రైతులు కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పత్తి రైతులకు దళారుల సమస్య లేకుండా ఇక నుంచి నేరుగా స్లాట్ బుకింగ్ పద్ధతిలో పత్తి పంటను విక్రయించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశపెట్టిందని ఈ యాప్‌ను రైతులు స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా సమీపంలోని ఏ జిన్నింగ్ మిల్లులో పత్తి విక్రయించాలనుకుంటే ఆ రోజు స్లాట్ బుక్ చేసుకోవచ్చునని ఈ యాప్ వల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆధార్ సంఖ్యను జతపర్చి, మొబైల్ నెంబర్‌ను నమోదు చేసి స్లాట్ బుక్ చేసుకోవచ్చునన్నారు. పత్తి నాణ్యతా ప్రమాణాలు ఉంటే (8 నుంచి 12 శాతం తేమ) స్లాట్ బుకింగ్ రోజు కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలన్నారు. 12 శాతం మిర్చి తేమ ఉంటే సిసిఐ కొనుగోలు చేయదన్నారు. ఎనిమిది శాతం తేమ ఉంటే రూ. 8,110, 12 శాతం తేమ ఉంటే రూ.7786 మద్దతు ధర లభిస్తుందన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న రోజు వెళ్లలేని పక్షంలో అట్టి స్లాట్‌ను 24 గంటల ముందు రద్దు చేసుకోవాలని, ఒక రైతు మూడు సార్లు మాత్రమేస్లాట్‌నురద్దుచేసుకునేఅవకాశంఉంటుందని కలెక్టర్ తెలిపా రు.

**ఆలయ నిర్మాణానికి స్థలం అప్పగింతకు చర్యలు**

జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం అప్పగింతకు వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలంగాణ దేవాదాయ శాఖ స్థపతి ఎన్.వాళ్ళినాయగం, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం అర్బన్ మండలంలోని అల్లిపురం వద్ద 20 ఎకరాల స్థలం గుర్తించి తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం, విడిది, అన్ని వసతులకు అనుగుణంగా స్థల సేకరణ చేశామన్నారు. వేద పాఠశాల, కళ్యాణ మండపం, కళాక్షేత్రం, భజన మండపం తదితర అన్ని సౌకర్యాల కల్పనకు ఆగమ శాస్త్ర ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ప్రముఖుల సందర్శనకు విడిది, హెలిప్యాడ్ సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు చేయాలన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో జిల్లా ఆధ్యాత్మిక శోభతో పాటు పర్యాటకంగా, ఉపాధి పరంగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో జి. నర్సింహారావు, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం. వీరస్వామి, డిఈ రమేష్ బాబు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా వైరా బస్టాండ్





**ప్రజాపక్షం/వైరా :**వైరా ఆర్టీసి బస్టాండ్ శిధిలావస్థకు చేరుకొని పగుళ్లతో ప్రమాదకరంగా దర్శనమిస్తు పెచ్చులుఊడి పడుతున్నాయని దీంతో ప్ర యాణీకులు భయపడుతున్నారు. ఈబస్టాండ్‌కు రాష్ట్రంనలుమూలలనుంచి వందలాదిమంది ప్ర యాణీకులు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఉదయం సాయంత్రం విద్యార్థులు పెద్ద ఎత్తున బస్టాండ్ లో కూర్చుంటున్నారు. ఆర్టీసి బస్టాండ్ పైభాగంనుంచి పెచ్చులూడి పడటంతో పాటు పిల్లర్లకు సైతం పగుళ్లు వచ్చాయి. బస్టాండ్ 1978 సంవత్సరంలో నిర్మించారు. బస్టాండ్‌కు ఆర్టీసీ అధికారు లు పర్యవేక్షణ చేసి మరమ్మత్తులు చేపట్టిన సందర్భాలు లేవు. ఎక్కడైనా పెచ్చులూడినప్పుడు మసిపూసి మారేడుకాయ చేశారేతప్ప పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టలేకపోయారు. బస్టాండ్‌కు డిఎం, ఆర్ఎం లు సైతం వచ్చిపోతు ఉంటారు. వారికి ప్రమాదకరంగా మారిన బస్టాండ్ కనిపించడం లేదా అని ప్రయాణీకులు ప్రశ్నిస్తున్నారు. బస్టాండుకు పొంచిఉన్న ప్రమాదాన్ని అధికారులు వెంటనే గుర్తించి పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టి ప్రయాణీకులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

క్రీడ

# నెట్స్‌లో చెమటోడ్చిన కోహ్లి, రోహిత్..



భారత దిగ్గజాలు విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మలు ఆస్ట్రేలియా పర్యటనలో దంచేసేందుకు సిద్ధమవుతున్నారు. స్క్వాడ్‌తో కలిసి కంగారూ దేశం చేరుకున్న ఈ స్టార్ ఆటగాళ్లు గురువారం నెట్స్‌లో సాధన చేశారు. పెర్త్‌లో ఆదివారం తొలి వన్డే కోసంవిరాట్, హిట్‌మ్యాన్ పెద్ద షాట్లు ఆడుతూ చెమటోడ్చారు. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న ఇరువురు.. మునపటి తరహాలో ఆసీస్‌పై చెలరేగిపోవాలనే కసితో ఉన్నారు. ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్ తర్వాత రోకో టీమిండియా జెర్సీతో ఆడతున్న తొలి సిరీస్ ఇది. దాంతో, అంచనాలకు మించి రాణించి.. అభిమానులను అలరించేందుకు రెడీ అవుతున్నారీ టాప్ గన్స్.సుదీర్ఘ కాలం భారత జట్టుకు ఆటగాడిగా, నాయకుడిగా రోహిత్, విరాట్ విశేష సేవలందించారు. అయితే.. యువతరానికి అవకాశమిస్తూ ఒకరితర్వాత ఒకరు టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వీరు కొనసాగుతున్న ఫార్మాట్ వన్డే మాత్రమే. వచ్చే వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలనుకుంటున్న ఈ వెటరన్ బ్యాటర్లకు.. ఆస్ట్రేలియా సిరీస్ ఎంతో కీలకం కానుంది. మూడు వన్డేల్లో పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడింతే.. మరో సిరీస్‌కు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. దాంతో, అనుభవజ్ఞులైన ఈ ఇద్దరూ తమ సత్తా చాటితే టీమిండియాకు తిరుగుండదని విశ్లేషకులు అంటున్నారు. ఆస్ట్రేలియాపై రోహిత్, కోహ్లీకు మెరుగైన రికార్డుంది. రోహిత్ 19 మ్యాచుల్లో.. 990 రన్స్ సాధించగా.. రన్ మెషీన్ విరాట్ 18 మ్యాచుల్లో 802 పరుగులు బాదాడు.

## ఆస్ట్రేలియాను ఊరిస్తున్న లక్ష్యం!

వరల్డ్ కప్‌లో రెండో విజయం కోసం శ్రమిస్తున్న బంగ్లాదేశ్ స్వల్క స్కోర్‌కే పరిమితమైంది. ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొని ఓపెనర్ రుబియా హైదర్(44) శుభారంభమిచ్చినా మిడిలార్డర్ వైఫల్యంతో చూస్తుండగానే ఆరు వికెట్లు కోల్పోయింది. ఆ దశలో శోభన మోస్త్రే(66 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా వెరవకుండా క్రీజులో నిలిచిన తను డార్సీ బ్రౌన్ వేసిన 40వ ఓవర్లో మూడు బౌండరీలతో జట్టు స్కోర్ 150 దాటించింది. అజేయంగా నిలిచిన మేస్త్రీ జట్టుకు పోరాడగలిగే స్కోర్ అదించింది. దాంతో, ఈ వరల్డ్ కప్‌లో మొదటిసారిగా ప్రత్యర్థిని ఆలౌట్ చేయలేకపోయింది ఆసీస్. ప్రపంచ కప్‌లో బౌలింగ్‌లో రాణిస్తూ.. బ్యాటింగ్‌లో తేలిపోతున్న బంగ్లాదేశ్ కీలక మ్యాచ్‌లోనూ స్వల్ప స్కోర్‌తోనే సరిపెట్టుకుంది. వైజాగ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మ్యాచ్‌లో బంగ్లా.. 198 పరుగులే చేయగలిగింది. టాపార్డర్‌లో ఓపెనర్ రుబియా హైదర్(44) రాణించగా.. అషే గార్డ్‌నర్(248) ధాటికి మిడిలార్డర్ కుప్పకూలింది. 131 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి ఆలౌట్ అంచున నిలిచింది బంగ్లా. 150లోపే ఆ జట్టు చాపచుట్టేయడం ఖాయమనిపించింది. కానీ, శోభన మోస్త్రీ (66 నాటౌట్) పట్టుదలగా క్రీజులో నిలిచి ఆసీస్ బౌలర్లకు సవాల్ విసిరింది.



## అభిషేక్, మంధానాకు ఐసిసి అవార్డు



అంతర్జాతీయ క్రికెట్‌లో అదరగొడుతున్న భారత క్రికెటర్లు అభిషేక్ శర్మ , స్మృతి మంధాన ఐసిసి అవార్డుల్లోనూ సత్తా చాటారు. ప్రతినెలా అందించే 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'అవార్డును గెలుచుకున్నారు. సెప్టెంబర్ నెలకు మహిళల విభాగలో స్మృతి మంధాన, పురుషుల విభాగంలో అభిషేక్ శర్మలు ఈ ప్రతిష్టాత్మక అవార్డు సాధించారు. ఆసియా కప్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లకు బహుమతిగా అభిషేక్‌కు.. మూడు స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రెండు శతకాలతో మెరిసినందుకు మంధానకు ఈ అవార్డు వరించింది. 'ఐసిసి అవార్డు గెలిచినందుకు చాలా గర్వంగా ఉంది. జట్టు విజయాల్లో భాగమైనందుకు నాకు ఈ అవార్డు దక్కినందుకు చాలా సంతోషపడుతున్నా. కష్ట సమయాల్లోనూ గెలుపు దిశగా సాగిన జట్టులో భాగమైనందుకు గర్వపడుతున్నా. ఈమధ్య పొట్టి క్రికెట్‌లో అద్భుత విజయాలకు సానుకూల దృక్పథమే కారణం. నాకు ఎంతగానో మద్దతుగా నిలుస్తున్న సహచరులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని అభిషేక్ వెల్లడించాడు. కాగా ఈ ఏడాది భీకర ఫామ్‌లో ఉన్న మంధాన విషయానికొస్తే.. నాలుగు శతకాలతో రికార్డు నెలకొల్పింది. అయితే.. ఆస్ట్రేలియాపై వరుసగా రెండు మ్యాచుల్లోనూ శతకాలతో కదం తొక్కిందీ బ్యాటరు. మూడు వన్డేల సిరీస్‌లో 58, 117, 125 పరుగులతో మెరిసింది మంధాన అందుకే.. ఓటింగ్‌లో దక్షిణాఫ్రికా సంచలనం తంజిమ్ బ్రిట్స్, పాకిస్థాన్ క్రికెటర్ సిద్రా అమిన్‌లను వెనక్కి నెట్టి అవార్డుకు ఎంపికైందీ స్టయిలిష్ బ్యాటర్.

ఫోకస్


# సంకల్పబలానికి ప్రతిరూపం జానీ ఎక్



అమెరికాలోని బాల్టిమోర్ పట్టణంలో, 1911 ఆగస్టు 27న జాన్ ఎక్‌హార్ట్ జూనియర్ (జానీ ఎక్) జన్మించాడు. ఒక జననంలో విశేషం లేకపోయినా, శరీరం పూర్తిగా ఏర్పడకముందే జానీ భూమిపైకి రావడాన్ని అరుదైన ఘటనగా పేర్కోవచ్చు. సాక్రల్ ఏజెనెసిస్ అనే అరుదైన లోపం వలన అతని కాళ్లు, పాదాలు ఉపయోగించరాని స్థితిలోనే ఉండిపోయాయి. నడుము దగ్గరనే తెగిపోవడం వల్ల అతని ఎత్తు కేవలం పద ఎనిమిది అంగుళాలు మాత్రంగానే ఉంది. ఎంతో సమస్యాత్మక శారీరక పరిమితులు ఉన్నా, జానీ మనసు మాత్రం అపారమైన ఉల్లాసంతో పొంగిపొర్లేది. 'నాకు కాళ్లు ఎందుకు కావాలి? ఉంటే ప్యాంట్ ఇస్త్రీ చేసుకోవాల్సిందే కదా'! అని నవ్వుతూ చెప్పడంలో, ఎంతో ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. 'నీళ్ల మీద నడవడం తప్ప నేను చేయలేనిది ఏముంది?' అని తనను హేళన చేసిన వారిని నిలదీసేవాడు. సమాజం ఎన్ని మాటలు అంటున్నా, ఎంతగా హేళన చేసినా, జానీకు తన కవల సోదరుడు రాబర్ట్ నుంచి మద్దతు ఉండేది. ఒక రకంగా జానీ ఆశలకు రాబర్ట్ శాశ్వత భాగస్వామి అయ్యాడు. బాల్యంలోనే తన చేతులపై నడవడం నేర్చుకున్న జానీ, పన్నెండేళ్ల వయసులోనే 'సైడ్ షో'ల రంగంలోకి అడుగుపెట్టాడు. అయితే, తన వెంట రాబర్ట్ ఉండితీరాలని, అతను లేనిది తాను లేనని స్పష్టం చేసేవాడు. అతను చేతుల మీద చేసే విన్యాసాలు, మాయాజాల ప్రదర్శనలు, టాక్సెడో ధరించి చేసే సాహసాలు ప్రేక్షకులను విస్మయపరిచేది. జానీ ప్రతిభను జీఎంజి స్టూడియోస్ గుర్తించి, టాడ్ బ్రౌనింగ్ రూపొందించిన ఫ్రీక్స్ (1932) చిత్రంలో హాఫ్‌బాయ్ పాత్రని ప్రవేశపెట్టి, దానిని అతనికి ఇచ్చారు. ఆ తరువాత టార్జాన్ సినిమాల్లోనూ జానీ తన ప్రతిభను నిరూపించుకున్నాడు. జానీ కేవలం ప్రదర్శనకారుడు లేదా నటుడు మాత్రమే కాదు... అతను ఒక చిత్రకారుడు, సంగీతకారుడు, బొమ్మల నాటక దర్శకుడు, మోడల్ మేకర్, స్క్రీన్ పెయింటర్. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నప్పటికీ ఎంతో మంది చేయలేని అద్భుతాలను జానీ రెండు కాళ్లూ లేకపోయినా సాధించడం అపూర్వం. బాల్టిమోర్‌లోని ఓ చిన్న రో హౌస్‌లో రాబర్ట్‌తో కలిసి ఆటపాటల పరికరాలు తయారు చేసేవాడు. చిన్నారుల కోసం బొమ్మల ప్రదర్శనలు ఇస్తూ జీవితం రంగులమయం చేసుకున్నాడు. జానీ, రాబర్ట్‌ల సోదర బంధం, పరస్పర ప్రోత్సాహం వారి చిరంజీవులను చేసింది. అయితే, కాలం రోజుల్లో జానీ జీవితంపై నీలి మేఘాలు గాఢంగా అలముకున్నాయి. 1987లో జరిగిన ఇంటి దోపిడీ అతని హృదయాన్ని బలంగా కుదిపింది. ఆ సంఘటన తరువాత అతను సమాజానికి దూరమైపోయాడు. 1991లో, 79 ఏళ్ళ వయసులో గుండెపోటు అతని ఉత్సాహభరిత ప్రస్థానం ముగిసింది. రాబర్ట్ కూడా నాలుగేళ్లకు, 1995లో తుదిశ్వాస విడిచాడు. వీరి ఇద్దరి సమాధులు ఇప్పుడు బాల్టిమోర్లోని గ్రీన్ మౌంట్ సెమెంట్రీలో పక్కపక్కనే ఉన్నాయి. జానీ ఎక్ జీవితం మనకు 'శరీరంలోని పరిమితులు మన ఆత్మశక్తిని అడ్డుకోలేవు. ధైర్యం, విన్యాసం, చిరునవ్వు వెన్నంటే ఉన్నపుడు మనిషి అసాధ్యాన్ని సైతం సాధ్యం చేయగలడు' అనే సుందేశాన్ని ఇస్తుంది. దివ్యాంగులకు అతని జీవితం స్ఫూర్తిదాయకం.

# వయోభార సంకేతాలు పంపే ప్రొటీన్!

సీనియర్ సిటిజన్స్



మనిషికి వయోభారం వచ్చిందని ఎలా తెలుస్తుంది? శరీరంలోని అవయవాలు శక్తిని కోల్పోతున్నప్పుడు లేదా శిథిలమవుతున్నప్పుడు వయోభారం గురించి తెలుస్తుంది. అయితే, శరీరంలోని అన్ని అవయవాలకు లేదా భాగాలకు వృద్ధాప్యాన్ని గురించిన సంకేతాలు ఎలా వెళతాయన్నది ప్రశ్న. ఎంతోకాలంగా వేధిస్తున్న ఈ ప్రశ్నకు సమాధానం లభించింది. ఇటీవలి పరిశోధనా ఫలితాలను అనుసరించి, హెచ్‌ఎంజిబి1 అనే ప్రోటీన్ ఈ సంకేతాలను శరీరమంతా వ్యాప్తి చేస్తుంది. హెచ్‌ఎంజిబి1 అనేది మూలంగా న్యూక్లియస్‌లో డిఎన్ఎ స్థిరత్వం, రిపేర్, క్రోమాటిన్ నిర్మాణంలో పాత్ర వహించే బహుళకార్య ప్రోటీన్. కణం గాయపడినప్పుడు లేదా ఒత్తిడిలో ఉన్నప్పుడు బయటకు విడుదలై ఇమ్యూన్ సిస్టమ్‌ను హెచ్చరించే డిఎఎంపి/అలార్మిన్‌లా పని చేస్తుంది. వయస్సు పెరిగేకొద్దీ హెచ్‌ఎంజిబి1 స్థాయిలు అనేక కణజాలాల్లో, రక్తంలో పెరుగుతాయని పాత అధ్యయనాలు తెలియజేశాయి. ఇది మెదడు పనితీరులో మార్పు, మెటబాలిక్ డిస్ఫంక్షన్ వంటి వయస్సుతో అనుసంధానిత లక్షణాల్లో భాగం. కొత్త ఆధారాలను అనుసరించి, కణాల్లో పి21, పి16 వంటి వయోసూచకాలు, ఎస్ఎఎస్‌పి కారకాలను రీ–హెచ్‌ఎంజిబి1 ప్రేరేపించింది. అయితే ఆక్సిడైజ్డ్ రూపం (Oxహెచ్‌ఎంజిబి1) ఇదే ప్రభావం చూపలేదు. ప్రయోగానికి జరిపిన ఎలుకల్లో రీ–హెచ్‌ఎంజిబి1 వ్యవస్థపరంగా ఇవ్వగానే కండరాల పనితీరు దెబ్బతినడం, సెనెసెన్స్ సూచకాలు పెరగడం వంటి లక్షణాలు కనిపించాయి. హెచ్‌ఎంజిబి1నుద్దేశించిన యాంటీబాడీ ఇచ్చినపుడు సెనెసెన్స్ తగ్గి కండరా పునరుద్ధరణ, శారీరక పనితీరు మెరుగుపడ్డాయి. దీనిని బట్టి, హెచ్‌ఎంజిబి1 ద్వారా వృద్ధాప్య సమాచారం శరీరం మొత్తానికి అందుతున్నదని స్పష్టమవుతున్నది. వయస్సుతో హెచ్‌ఎంజిబి1ను న్యూట్రలైజ్ చేసే సహజ ఐజిఎం యాంటీబాడీ ప్రతిస్పందన బలహీనమవుతుందని, దాన్ని పెంచే ఇమ్యూనైజేషన్ వ్యూహాలు వయోసంబంధ అనారోగ్యాల్లో చికిత్సా లక్ష్యాలుగా ఉండొచ్చని పరిశోధకులు తాజా నివేదికలో సూచించారు. హెచ్‌ఎంజిబి1ని సంప్రేషక అణువుగా గుర్తించిన తాజా ఫలితాలు పరబయోసిస్ పరిశీలనలకు జైవికకారణాన్ని ఇస్తూ, రక్త ఆధారిత వయోభ్రంశ ప్రసార మోడల్‌ను స్పష్టం చేస్తున్నాయి. శాస్త్రీయ శ్రద్ధలు, పరిమితులుఇప్పటివరకు నిర్ధారణ ప్రధానంగా మౌస్ మోడళ్ల, మానవ కణాలపై ఆధారపడి ఉంది. మానవులలో దీర్ఘకాల భద్రత, మోతాదు, రెడాక్స్‌స్పెసిఫిసిటీ, ఆఫ్‌టార్గెట్ ఇమ్యూన్ ప్రభావాలపై క్లినికల్ సాక్ష్యాలు అవసరం. ప్రస్తుతం శాస్త్రవేత్తలు క్లినియల్ ప్రయోగాలను మొదలు పెట్టారు. వృద్ధాప్య సమాచారం శరీరం మొత్తం వ్యాప్తి చెందకపోతే, వృద్ధాప్యం అనేది వస్తుందా? రాదా? అనేకి ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్న.

## రిజర్వేషన్లు ఇవ్వకుండా కేంద్రం కాలయాపన

సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి వెల్లడి

ప్రజాపక్షం / మహబూబాబాద్ : స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిసి సంఘాలు, రాజకీయ పార్టీలు అక్టోబర్ 18న చేస్తున్న బందుకు సిపిఐ కూడా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి షెడ్యూల్ 9లో చేర్చి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని, రాష్ట్రంలో ఉన్న బిజెపి నేతలు మాట్లాడకుండా బీసీలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎంపిలు ఢిల్లీ వెళ్లి ప్రధాని వద్ద ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా బిజెపి దాటవేత ధోరణి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. బిసిలకు 42% రిజర్వేషన్ కల్పించకుంటే ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్టోబర్ 18న బిసి సంఘాలు చేస్తున్న బందుకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు తెలుపుతూ మహబూబాబాద్ జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో పార్టీ శ్రేణులు బందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఫీజు బకాయిల విడుదల చేయకపోతే మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తాం

**18న బంద్ ఫర్ జస్టిస్‌కు ఎఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు : ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**




ప్రజాపక్షం/నల్లగొండ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల పాలనలో హానికర మద్యానికి ఆ శాఖకు మంత్రిని కేటాయించి భవిష్యత్తు విద్యార్థుల చదువులకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం సిగ్గు చేటని, విద్యారంగ సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఫీజు రియింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని విద్యార్థుల ఫీజు బకాయిలు మొత్తం విడుదల చేయకపోతే ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్య ఉపాధిలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించకుండా బిజెపి చేస్తున్న కుట్రలను నిరసిస్తూ ఈనెల 18వ తేదీన బంద్ ఫర్ జస్టిస్‌తో నిర్వహించే తెలంగాణ బంద్‌కి ఎఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాగ్దూమ్ భవనంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో మణికంఠ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయడంలో హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిల విడుదల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకుండా వారి చదువులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకొని ఎవరిని కలవకుండా సమస్యలు పరిష్కరించడం లేదని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలల్లో ఫీజుల దోపిడీ అరికట్టడంలో, విద్యా హక్కు చట్టం అమలు చేయడంలో, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకుండ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఆర్‌టిసి బస్సు పాస్ చార్జీలు పెంచి విద్యార్థులపై భారం మోపారని విద్యార్థులకు ఆర్‌టిసిలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని,ఎన్నికల హామీల్లో విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు ఇస్తామని చెప్పారని మరి నేటి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వం వారం రోజుల్లో విద్యార్థుల ఫీజు బకాయిలు మొత్తం విడుదల చేయకపోతే ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్,జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు వలమల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు రమావత్ శోభన్ బాబు,నాయకులు ఎస్ వినయ్, ఉదయ్,విప్లవ్,వినయ్,రాము,హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# కూనంనేని సమక్ష్యంలో సిపిఐలో 60 కుటుంబాలు చేరిక

- సింగభూపాలెం గ్రామీణులకు సిపిఐ అండగా ఉంటుంది
- పోరాటాలు, ఉద్యమాల ఫలితమే సిపిఐకి జనాదరణ
- గ్రామాల అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనపై దృష్టి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సమక్ష్యంలో సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామానికి చెందిన 60 కుటుంబాల వారు నల్లవెల్లి ఏసురత్నం, ధీట్ల ఇమ్మానియేలు, గోరంట్ల వేణు, తంబళ్ల సన్నీ, కల్లో డేవిడ్ రాజు, మైపారాజు, దారా దేవదానం, శెట్టి అరుణ , భీమాల వసంత, పూరేటి సామేలు తదితరుల నాయకత్వంలో గురువారం సిపిఐలో చేరారు. వీరికి ఎర్రకుండావ కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా వందేళ్లుగా సిపిఐని ఆదరిస్తున్నారని అన్నారు. ఎంఎల్‌ఏగా గడిచిన ఇరవై నెలలుగా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నామన్నారు. గ్రామీణ రహదారులు,విద్యుత్ సౌకర్యం, ఇతర మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అనునిత్యం శ్రమిస్తున్నట్లు చెప్పారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐకి ఎదురులేదని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా, అందుబాటులో ఉంటారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐకి ఘన విజయాన్ని అందించడం ద్వారా సమస్యల పరిష్కారానికి బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా ధ్రస్తు, కంచర్ల జమలయ్య, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, నాయకులు జక్కుల రాములు, పొదిలి శ్రీనివాస్, ఎండి యూసుఫ్, మూడ్ గణేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బంద్‌లో వర్గాల పాల్గొనాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

ప్రజాపక్షం / మంచిర్యాల : బిసి జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన జరుగు తెలంగాణ రాష్ట్ర బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి ఎన్నికలు జరపాలని, ఈ విషయంలో హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బిసి సంఘాల జెఎసి బంద్‌కు పిలుపు ఇచ్చిందని ఆయన అన్నారు. గురువారం సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బంద్‌లో వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలతో పాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ ఆలీఖాన్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాస్, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, దేవి పోచన్న, కుంచాల శంకరయ్య, కాదండి సాంబయ్య, చాడ మహేందర్ రెడ్డి, పూజారి రామన్న, నాయకులు ఎగుడ మొండి, సిరికొండ రాయమల్లు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



## రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకమైన ఎన్‌డిఎను గద్దె దింపాలి

రాష్ట్రబంద్‌కు ఎఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు

బావండ్లపల్లి యుగేందర్



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ : బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి ఐక్య కార్యచరణ కమిటీ బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈనెల 18న తలపెట్టిన రాష్ట్రబంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య కరీంనగర్ జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, బంద్‌లో ప్రత్యక్షంగా రాష్ట్రవ్యాప్తంగా పాల్గొంటామని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయన్నారు. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనన్నారు. ఇప్పటికైనా రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన, సర్వే నిర్వహించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు. బిజెపి కులతత్వ, మనువాద పార్టీ అయినందున కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. బిసిల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రిజర్వేషన్లు 50 శాతం పరిమితి పేరుతో ఏళ్ల తరబడి బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏ మాత్రం తగదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికే దాటిపోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల నిర్ణీత కాలపరిమితిలోగా ఆమోదం లభించకపోతే నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచాల మురళి, మాడిశెట్టి అరవింద్, శ్రావణ్‌రాజ్, సమన్, మనోహర్, కసిరెడ్డి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి బిల్లుకు అనుకూలమంటూనే అడ్డుకునే ప్రయత్నాలు

నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఫయాజ్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : బిసిలకు సంబంధించిన 42శాతం బిల్లు ఆమోదానికి అడ్డుకట్టవేస్తున్న తీరుకు నిరసనగా ఈనెల 18వతేదిన నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతిస్తుందని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో 50శాతానికిపైపడ్డ బిసిలకు సమన్యాయం జరిగేందుకు ప్రవేశపెట్టిన బిసిబిల్లును రాజకీయపక్షాలు ఒక్క అనుకూలమని ఆమోదిస్తూనే, మరొపక్క దానిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా బిజెపిలాంటిపార్టీ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మద్దతుగా మాట్లాడిన బిజెపి శాసనసభపక్షం రాష్ట్ర నాయకులు కేంద్రంలో ఢిల్లీకి వెళ్లగానే మాట మార్చి బిల్లును అడ్డుకునే తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కావున ఈనెల 18న జరిగే రాష్ట్రబంద్‌లో జిల్లావ్యాప్తంగా సిపిఐశ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని బిసిసంఘాల జేఏసి ఇతర రాజకీయ ప్రజాసంఘాలతోకలిసి బంద్‌ను విజయవంతం చేయడానికి తమపార్టీ నాయకత్వం అంతాకృషిచేస్తుందన్నారు.



## చిగురుమామిడి ఎంపిడిఒగా విజయ్‌కుమార్

**ప్రజాపక్షం/చిగురుమామిడిః** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఎంపిడివోగా టి.విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. చిగురుమామిడిలో పనిచేసిన ఎంపిడివో మధుసూధన్ సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపివోగా కిరణ్‌కుమార్ సైతం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడివో టి.విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో తిమ్మాపూర్, జమ్మికుంట మండలంలో ఎంపిడివో బాధ్యలు నిర్వహించానని చెప్పారు. మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బాధ్యతగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోదారి అజయ్‌కుమార్‌తో పాటు వివిధ గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందించి ఘనంగా సన్మానించారు. స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బింగి గణేష్, కరీంనగర్ జిల్లా కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల రాజేష్, కారోబార్లు జి.సత్యనారాయణ, తిరుపతి, బిక్షపతి, శంకర్‌బాబు, రాజు తదితరులున్నారు.



## తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి సర్టిఫికెట్లను ప్రజలకు అందించవలసిందిగాఅధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, స్థానిక మండల తహసిల్దార్ ఎండి మాజీద్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు అభినందన




**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష గురువారం దర్యాపూర్ మోడల్ పాఠశాల,కళాశాలను సందర్శించి,అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. పాఠశాల విద్యా, సహపాఠ్య కార్యక్రమాలను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయులు అందిస్తున్న నాణ్యమైన విద్యా సేవలను ఆయన అభినందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి పాఠశాలలోని వనరులను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు.ప్రిన్సిపాల్, సిబ్బంది ఆయన విలువైన సందర్శనకు,ప్రేరణాత్మక మాటలకు ధన్యవాదాలు తెలిపారు.

## సాఫ్ట్‌బేస్‌బాల్ పోటీలకు ట్రినిటీ విద్యార్థులు




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** సబ్ జూనియర్స్ సాఫ్ట్ బేస్ బాల్ క్రీడలో ట్రినిటీ ఉన్నత పాఠశాలకు చెందిన జి. రక్షిత్ అజ్జన్న,కే వర్షిత్ ,రాజేశ్వరి విద్యార్థులు ప్రతిభ సాధించారు.ఈ నెల 18,19 తేదీన కోరుట్ల, లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పెద్దపల్లి జిల్లా తరుపున అర్హత సాధించినట్లు పాఠశాల పేటి తెలిపారు.ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి ,పాఠశాల కరస్పాండెంట్ దాసరి ప్రశాంత్ రెడ్డి , పెద్దపెల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మమత రెడ్డి విద్యార్థులను అభినందించారు. పిఈటీలు రాకేష్, షఫీ,కిషోర్ సింగ్ సంతోషాన్ని వ్యక్తం చేసి అభినందించారు.

## కబడ్డీ పోటీలకు శ్రీకృష్ణవేణి విద్యార్థినీలు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అండర్ 14 ఎస్జీఎఫ్ పటాన్ చెరువు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థినిలు టీ.సహస్విత 9వ తరగతి, బి ఆశ్రిత రెడ్డి 8వ తరగతి విద్యార్థినిలు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ పల్లె రాజు రెడ్డి తెలిపారు. మా పాఠశాల నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షనీయమని పేర్కొన్నారు. వీరిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజన్న సిరిసిల్ల ఎస్జీఎఫ్ సెక్రటరీ నారా శ్రీనివాస్ రెడ్డి, తడకల సురేష్, పిడి వ్యాయామ ఉపాధ్యాయులు నవీన్ బాబు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ఆల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో దీపావళి




**ప్రజాపక్షం / కరీంనగర్ :** దీపావళీ పండుగ వెలుగులు నింపే పండుగ అని ఆనందోత్సవాల మధ్య వేడుకగా నిర్వహించుకునేటువంటి గొప్ప పండుగని, చీకటిపై వెలుగు చెడుపై మంచి సాధించిన విజయం ఈ పండుగను సూచిస్తుందని, నరకాసురుడిని శ్రీ కృష్ణుడు సంహరించిన సందర్భంగా ఈ వేడుకలను చా లా గొప్పగా జరుపుకుంటారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో ముందస్తుగా నిర్వహించినటువంటి దీపావళి సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డిసిసి పదవిపై అభిప్రాయ సేకరణ

### కాంగ్రెస్ నూతన ఒరవడి

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా దేశంలో కాంగ్రెస్ పార్టీ నూతన ఒరవడిని తీసుకొచ్చిందని కర్నాటక రాష్ట్ర హంగల్ శాసన సభ్యుడు మానే శ్రీనివాస్ అన్నారు. గురువారం రోజున హుజురాబాద్ పట్టణంలో ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్ లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, టీపిసిసి ఉపాధ్యాక్షుడు చిట్ల సత్యనారాయణ, టిపిసిసి పరిశీలకులు మ్యాడం బాలకృష్ణ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతానికంటే భిన్నంగా ఈ సారి జిల్లా అధ్యక్షుల ఎంపికను వార్డు, గ్రామం, మండల, నియోజకవర్గ స్థాయి నాయకుల అభిప్రాయాలు తీసుకుని జిల్లా అధ్యక్షున్ని ఎన్నుకోవడం జరుగుతుందని, దేశంలోని ఐదు రాష్ట్రాల్లో పూర్తి చేసుకుని దక్షిణ భారత దేశంలోని తెలంగాణకు ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. జిల్లాల వారీగా పరిశీలకులు నాయకుల అభిప్రాయాలు తీసుకుంటున్నామని, ప్రజల మధ్య ఉండి ప్రజలతో మమేమకం అయ్యే నాయకులకు అవకాశం దక్కుతుందని, రాబోయే రోజుల్లో జిల్లా అధ్యక్షులకే కాదు, మండల నాయకులను కూడా ఇదే విధంగా ఎన్నుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాకీ కార్డు పేరిట బిఆర్ఎస్ నాటకాలు

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్లే వారి బాకీలకు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని రాష్ట్ర, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల శాఖామంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎద్దేవాచేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ తీరుపై విమర్శలు గుప్పించారు. పదేళ్ళపాటు సాగిన బీఆర్ఎస్ పాలనలో వారు మేనిఫెస్టోలో ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇల్లు,దళిత కుటుంబానికి మూడెకరాల భూమి,ఇంటికో ఉద్యోగం, దళిత ఉపముఖ్యమంత్రి ఇలా అన్ని హామీలను తుంగలో తొక్కారని దానికి పర్యవసానంగా ప్రజలు గద్దె దించి తగిన గుణపాఠం చెప్పారని అడ్లూరి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై కొత్త నాటకానికి తెరలేపుతూ బాకీ కార్డు అంటూ పత్రాలు చూపడం సిగ్గుచేటన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎన్ని హామీలు నెరవేర్చరో బహిరంగ చర్చకు రావాలని కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావులకు అడ్లూరి సవాల్ విసిరారు. ప్రజల కష్టంతో నిండిన రాష్ట్రాన్ని అప్పుల బాట పట్టించి ఇప్పుడు ప్రజలే మోసపోయినట్లు నటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల పన్నులతో కేటీఆర్ టిఆర్ఎస్ పార్టీని నడిపారని,వారి పాలనలో అభివృద్ధి కి కాకుండా ప్రచారానికి ప్రభుత్వ ఖాజానాను ఖాళీ చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుల ఊబిలో నున్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టే బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుందని అన్నా రు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పూర్తిచేస్తున్నదని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500 గ్యాస్ సిలిండర్,10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పెంపు, పేదలకు సన్నబియ్యం,కొత్త రేషన్ కార్డులు అందించి అందరి మెప్పుతో ఇందిరమ్మ రాజ్యం రాష్ట్రంలో కొనసాగుతున్నదని మంత్రి అడ్లూరి చెప్పారు.ఇకనైనా కాంగ్రెస్ పాలనపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని ధర్మపురిలో డిగ్రీ కళాశాల,పాలిటెక్నిక్ కళాశాల,బస్ డిపో త్వరలోనే ఏర్పడబోతున్నాయని చెప్పారు. గోదావరి నదిలో మురుగునీరు కలవకుండా రూ.17 కోట్లతో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నేరేళ్ల వద్ద రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ కళాశాల నిర్మాణానికి త్వరలో డిప్యూటీ సిఎం చేతుల మీదుగా భూమిపూజ జరగనుందన్నారు. 2027 గోదావరి నది పుష్కరాలను ధర్మపురి లో నభూతో నభవిష్యత్ రీతిలో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ఎన్ని కుటిల యత్నాలు చేసినా ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు.వారి మోసానికి సమాధానంగా ఓటు ద్వారానే జవాబు ఇస్తారని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. నాయకులు ఎస్.దినేష్, వేముల రాజేశ్,జక్కు రవీందర్, చీపిరిశెట్టి రాజేశ్, చిలుముల లక్ష్మణ్, నిశాంత్ రెడ్డి,సంగ నర్సింహులు, మొగిలి, తిరుపతి,మధుకర్‌రెడ్డి, శ్రీధర్, రవి, సత్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ 'మెటాఫండ్' మోసంలో సూత్రధారి అరెస్టు




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీఃఆన్** లైన్‌లోమెటాఫండ్ అనే నకిలీ కాయిన్ యాప్‌ను సృష్టించి అధికలాబాల ఆశ చూపి ప్రజల నుంచి సుమారు రూ.25 కోట్ల నుంచి రూ.30కోట్ల వరకు పెట్టుబడులు వసూలు చేసి మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు వరాల లోకేశ్వర్‌రావు(32)మల్కాజ్‌గిరి, హైదరాబాద్‌ని వాసిని కరీంనగర్ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల తయారీలో నైపుణ్యం కలిగిన లోకేశ్వర్‌రావు కరీంనగర్‌కు చెందిన తులసి ప్రకాష్(56), బూర శ్రీధర్(54), దాసరి రాజు(39), దాసరి రమేష్ (50), కట్ల సతీష్ (49)లతో కలిసి ఈ మోసానికి ప్రణాళిక రచించారు. రూ. 90వేల పెట్టుబడికి వెయ్యి కాయిన్స్ ఇస్తామని, నెల రోజుల్లో మూడు రెట్లు లాభంతో అమ్ముకోవచ్చని ప్రజలను నమ్మించారు. రిసార్టులు, గోవా, విదేశీ ట్రిప్‌లకు తీసుకెళ్లి ప్రలోభాలకు గురిచేశారు. బాధితుల నుంచి డబ్బు తీసుకుని కేవలం ఆన్‌లైన్లో నకిలీ ఐడిలు, కాయిన్లను కేటాయించారు. డబ్బు విత్‌డ్రా చేయలేని విధంగా యాప్‌ను రూపొందించారు. చివరికి యాప్‌ను ఆన్‌లైన్ నుంచి తొలగించి ప్రజలను మోసం చేశారు. కరీంనగర్ రూరల్, కరీంనగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కాగా ప్రాథమిక దర్యాప్తులో తులసిప్రకాష్, బూర శ్రీధర్, దాసరి రాజు, దాసరి రమేష్, కట్ల సతీష్‌లను గతంలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ప్రధాన నిందితుడు వరాల లోకేశ్వర్‌రావును బుధవారం రాత్రి ఎల్ఎండి అల్గునూరు వద్ద అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి బాధితులడబ్బుతో కొనుగోలు చేసిన ఆస్తుల పత్రాలు, 30 తులాల బంగారం, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, ప్రధాన నిందితుడి వద్ద నుంచి ఒక బిఎండబ్ల్యూ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని చేధించిన పోలీసు సిబ్బందిని కరీంనగర్ సిపి అభినందించారు. తప్పుదోవపట్టించే యాప్‌లు, అనుమానాస్పద పెట్టుబడి పథకాలలో డబ్బు పెట్టి మోసపోవద్దని సిపి ప్రజలకు తెలియజేశారు.

# అభివృద్ధి పనులు పూర్తిపై ప్రత్యేక దృష్టి : కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అభివృద్ధి పనులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మం థని పాత పాల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్, రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో మహిళ కుట్టుమిషన్ శిక్షణ,ఉత్పత్తి కేంద్రం కుట్టు సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. మంథని పట్టణంలోని పురపాలక కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, సంగీత కళాశాల, డే కేర్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంథని పట్టణంలో చేపట్టిన అంతర్గత సి.సి రోడ్లు, డ్రైయిన్లు , స్ట్రీట్ లైట్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. పాల కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ మరియు రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో మహిళ కుట్టు మిషన్ శిక్షణ కుట్టు మిషన్, శిక్షణ కేంద్రం ద్వారా ప్రసక్తి మహిళా సం ఘాల్లోని ఆసక్తి గల మహిళలకు కుట్టు మిషన్‌లో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఏకరూప దుస్తులు ఆర్డర్ ను ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఆర్.డి. ఓ.సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్,పి.డి. ఎన్. హెచ్ కీర్తి భరద్వాజ, మెగా ఏజెన్సీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి సప్లై చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన చొప్పరి పృథ్విరాజ్ ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ధర్మపురి ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.గంజాయి సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం తో పృథ్విరాజ్‌ను తనిఖీ చేయగా 103 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు చెప్పారు. నిందితుడిని పంచనామా నిర్వహించి గంజాయిని,మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. గంజాయి సరఫరా చేసినా కలిగి ఉన్నా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# వయాగ్రాలతో హత్యకు ప్లాన్

**15 మాత్రలు ఒకేసారి భోజనంలో కలిపిన భార్య**
**హత్య కేసును ఛేదించిన పోలీసులు**




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః** కత్తి సురేష్ హత్యకేసును కరీంనగర్ పోలీసులు చేధించారు. తాగుడుకు బానిసై వేధింపులకు పాల్పడుతున్న కత్తి సురేష్‌ను (36) బార్య మౌనిక మద్యంలో నిద్రమాత్రలు కలిపి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాక కిటికీకి చీరతో ఉరివేసి చంపేసినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం వెల్లడించారు. ఈ హత్యకు పరోక్షంగా సహకరించిన మొత్తం ఐదుగురిని సైతం అరెస్టు చేసినట్లు సిపి తెలిపారు. సెప్టెంబర్ 17న కరీంనగర్ జిల్లా కేంద్రంలో అనుమానాస్పద స్థితిలో కత్తి సురేష్ మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు బార్యే హంతకురాలిగా గుర్తించారు. ఈ కేసులో మృతుడి బార్యతో పాటు మొత్తం ఆరుగురు నిందితులను కరీంనగర్ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను గురువారం కరీంనగర్ సిపి గౌష్‌ఆలం తన కార్యాయలంలో వెల్లడించారు. పట్టణానికి చెందిన కత్తి సురేష్(36)కు 2015లో మౌనిక(29)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు వీరికి ఇద్దరు పిల్లలు., సుమారు తొమ్మిది నెలల క్రితం కత్తి మౌనిక సెక్స్ వర్కర్ వృత్తిలో ప్రవేశించింది. ఈ క్రమంలో ఆమెకు దొమ్మాటి అజయ్‌తో పరిచయం ఏర్పడి అక్రమ సంబందం కొనసాగించింది. భర్త తరచుగా డబ్బు కోసం వేధించడం భరించలేకపోయింది. అజయ్ సూచన మేరకు భర్తను అంతమొందించాలని నిర్ణయించుకుంది. మౌనికతో పాటు సహ సెక్స్ వర్కర్ అయిన శ్రీజ ఈ విషయాన్ని చర్చించింది. కాగా పోతుశివకృష్ణ(మెడికల్ ఏజెన్సీ యజమాని), సహ సెక్స్‌వర్కర్ వేములరాధ( నల్లసంధ్య)లను శ్రీజ మౌనికకు పరిచయం చేసింది. వీరంతా కలిసి సురేష్‌ను చంపడానికి ఒక ప్రణాళికను రూపొందించారు. మెడికల్ ఏజెన్సీ యజమాని శివకృష్ణ వయాగ్రా, అధిక బిపి మాత్రలను ఉపయోగించి మృతుడిని చంపే పద్దతిని సూచించాడు. మొదటి ప్రయత్నంలో 15 వయాగ్రా మాత్రలను మౌనిక తినే కూరలో కలిపింది. సురేష్ వాసన గుర్తించి తినడానికి నిరాకరించడంతో అది విఫలమైంది. రెండవ ప్రయత్నంలో నిందితుల సూచనల మేరకు బిపి మాత్రలు (టెల్మికిండ్ హెచ్80), కొన్ని నిద్ర మాత్రలు(ట్రైకా) ఉపయోగించి సురేష్ మద్యం సేవిస్తున్న సమయంలో మాత్రలను చూర్ణం చేసి అతని పానీయంలో కలిపింది. దీని ప్రభావంతో సురేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అనంతరం మౌనిక ఒక చీరను ఉపయోగించి కిటికీ గ్రిల్‌కు కట్టి దానిని సురేష్ మెడకు చుట్టి గట్టిగా లాగి ఉరేసి మరణానికి కారణమయ్యింది. మరణాన్ని నిర్ధారించుకున్న తర్వాత మౌనిక తన అత్తమామలకు ఫోన్ చేసి లైంగిక చర్య సమయంలో తన భర్త స్పృహ కోల్పోయాడని తప్పుదోవ పట్టించింది. కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. దర్యాప్తులో శాస్త్రీయ సందర్భోచిత ఆధారాల ద్వారా ఇది హత్య అని నిందితుల కుట్ర పన్నారని స్పష్టమైంది. మొత్తం ఆరుగురు నిందితులు ఏ1 కత్తిమౌనిక, ఏ2 అరిగె శ్రీ, ఏ3 పోతు శివకృష్ణ, ఏ4 దొమ్మాటి అజయ్, ఏ5 నల్ల సంధ్య, ఏ6 నల్ల దేవదాస్‌లను అరెస్టు చేసి జ్యూడీషియల్ కస్టడీకి తరలించనున్నారు. నిందితుల వద్ద మొబైల్ ఫోన్లు, మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ టౌన్ ఏసీపి వెంకటస్వామి, కరీంనగర్ టూటౌన్ ఇన్స్‌పెక్టర్ సృజన్‌రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు అధికారులు, సిబ్బంది ఈ కేసును చేధించడంలో చేసిన కృషిని పోలీసు కమిషనర్ ప్రశంసించారు.

## బిసి రిజర్వేషన్లు అడ్డుకోవద్దు

**ప్రజాపక్షం /రామగిరి :** కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో గురువారం విలేకరుల సమావేశంలో పెద్దపల్లి జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు దక్కాల్సిన 42% రిజర్వేషన్ అమలచేయకుండా అడ్డుకుంటున్న కుట్రలను నిరసిస్తూ ఈనెల 18న జేఏసీ రాష్ట్ర బంద్ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని, బహుజనులు అందరూ భాగస్వాములు కావాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9 ను వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టుకు వెళ్లడంతో స్టే ఇవ్వడం జరిగిందన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే బీసీలు స్వాగతించిన విషయాన్ని విస్మరించడం బాధాకరమన్నారు.బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాకుండా చట్టసభల్లో కూడా జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్ కల్పించే విధంగా చట్టం చేయాల్సిన అవసరం ఆవశ్యకత ఉందన్నారు. ఆ దిశగా కూడా బీసీల పోరాటం కొనసాగుతుందన్నారు.బీసీల రిజర్వేషన్ ల సాధన కోసం జేఏసీ ఇచ్చిన కార్యక్రమాలను, చేపడుతూ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించని యెడల తెలంగాణ సాధన ఉద్యమం మాదిరిగా బీసీల ఉద్యమం కొనాసాగించే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు.బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గ అధ్యక్షులు తోట రాజ్ కుమార్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము, బీజేపీ మండల అధ్యక్షులు కొయ్యడ సతీష్ యాదవ్ ఉన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని బాలాజీ ఇండస్ట్రీస్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 298 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని హుజురాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

## బిసి రిజర్వేషన్ అమలయ్యే వరకూ పోరు

### ఎఐటియుసి కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు

**ప్రజాపక్షం/కోరుట్లః** బీసి రిజర్వేషన్ అమలయ్యేవరకు పోరాటం ఆగదని ఎఐటియుసి డిమాండ్ చేసింది.గురువారం ప్రభాకర్ భవన్‌లో ఏఐటియుసి కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు సుతారి రాములు మాట్లాడారు. పార్లమెంట్‌లో పెట్టిన బీసిబిల్లునుఆమోదించాలని రిజర్వేషన్లు దక్కకుం డా అగ్రకులాలు చేస్తున్న కుట్రలను బీసీలు తిప్పి కొట్టాలని బీసీ శ్రేణుల ఐక్యత చాటుకుందామని ఈనెల 18న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బీసీలకు రాజ్యాధికారం లభించే వరకు ఎలాంటి త్యాగాలకైన సిద్ధపడి పోరాడుతానని హెచ్చరించారు. కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బిసి హక్కుల సాధన సమితి , బీసి జేఏసి ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర బంద్‌లో భాగంగా రవాణా వ్యా పార వాణిజ్య దుకాణ హోటల్, పాఠశాలలను బంద్ చేసి నిరసన వ్యక్తంచేశారు.బీసినేతలు గోపాల్, రాజయ్య ఉన్నారు. **బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలోః** గురువారం రోజున కోరుట్ల పట్టణంలో గాంధీ రోడ్డులో నున్న ఎస్ఎస్ కే భవన్‌లో బిసి యువజన సంఘం బీసి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శికారి గోపికృష్ణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. చిన్న విశ్వనాథం, చింత భూమేశ్వర్, విజయ, మమత సుతారిరాములు,రాజేశం, నల్ల వెంకటేశ్వర్, గట్ల నరేష్, కే రాజేశం, ఎన్ గంగాధర్, బాలే అజయ్ పాల్గొన్నారు




# కరీంనగర్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు

### ఎఐసిసి పరిశీలకుల ఎదుటే బాహాబాహీ



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః** కరీంనగర్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. డిసిసి అధ్యక్షుడు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎంపిక కోసం ప్రజాభిప్రాయ సేకవరణకు వచ్చిన ఏఐసిసి ప్రతినిధుల ఎదుటే కార్యకర్తలు బాహాబాహాకి దిగారు. ఒక దశలో తగువులాటకు దారితీసింది. కరీంనగర్ డిసిసి అధ్యక్షుడి ఎంపిక కోసం ఏఐసిసి ప్రతినిధులు శ్రీనివాస్ మనే, ఆత్రం సుగుణ గురువారం డిసిసిభవన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ క్రమంలో కార్యాలయ సిబ్బంది డిసిసి కార్యాలయానికి తాళం వేసి నిరసనకు దిగారు. దీంతో డిసిసి అధ్యక్ష పదవికి ధరఖాస్తు చేసుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జిగా కొనసాగుతున్న వెలిచాల రాజేందర్ రావు గేటు బయటే ఉండిపోయారు. ఆయనతో పాటు మరో రెండు వర్గాలు గేటు బయటే ఉండిపోయాయి. కొంత మంది నేతలు కావాలనే వచ్చి పరిశీలికులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండానే అధ్యక్షుడి ఎంపిక ఎలా చేస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. నియబనిబంధనల ప్రకారమే పదవులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ నుంచి ఎప్ప టి నుంచో పనిచేస్తున్న వారికే పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక దశలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకరికొకరు గల్లా లు పట్టుకునే పరిస్థితి దాపురించింది. పార్టీ ప్రతినిధులు ఎంత వారించినా వినకుండా కార్యకర్తలు ఒకరినొకరు తగువులాడుకున్నారు. ఇలాంటి ఘర్షణలకు పాల్పడే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని వారించినా ఇరువర్గాల కార్యకర్తలు పోటాపోటీగా దూషణల పర్వానికి దిగారు. దాదాపు రెండు గంటల పాటు ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. కాగా బయట ఉన్న వ్యక్తులతో సంబంధం లేకుండా ముఖ్యనేతల అభిప్రాయాలనే లోపల ఉన్న పరిశీలకులు తీసుకుంటారని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పుకొచ్చారు. కార్యకర్తలను, నాయకులను శాంతింపజేసే ప్రయత్నం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చి సద్దుమణిగింది.



# స్థానికం REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రైతు నిరసనతో ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఎడపల్లి మండల రైతులు బుధవారం బోధన్‌నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, తమ పంటను సేకరించడంలో ఆలస్యం జరుగుతోందని, దీని వల్ల అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కష్టార్జితం వృథా కాకూడదనే ఉద్దేశ్యంతో కొనుగోళ్లను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు రోడ్డెక్కారు. రైతుల నిరసనపై అధికారులు వెంటనే స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లు తక్షణమే ప్రారంభించాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో గురువారం ఎడపల్లి సోసైటీ ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసే పక్రియ మొదలైంది. రైతుల పంటకు తూకం వేసి సేకరించడం ప్రారంభించారు. తమ డిమాండ్ నెరవేరడం, ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కావడంతో ఎడపల్లి మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

## తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సర్వేలో భాగస్వాములు కావాలి :కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్:** రాష్ట్రాన్ని రానున్న రోజులలో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' అంశాలతో డాక్యుమెంట్‌ను రూపొందిస్తుందని, ఈ సర్వేలో ఉద్యోగులు, అన్ని వర్గాల వారు భాగస్వాములు కావలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతిఒక్క పౌరుడు పాల్గొనేలా సిటిజన్ సర్వే చేపట్టారన్నారు. అక్టోబర్ 10న ప్రారంభమైన ఈ సర్వేలో ఇప్పటికే ప్రజలు, ప్రవాస భారతీయులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సర్వేలో ప్రతి ఉద్యోగి పాల్గొని తమ సలహాలు, సూచనలు అందించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14న సర్క్యులర్ జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 25 వరకు కొనసాగే విజన్ 2047 సర్వేలో అందరూ ఉద్యోగులు పాల్గొనటంతో పాటు ఈ సర్వే లింక్‌ను క్యూఆర్ కోడ్‌ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించాలని, ఈ సర్వేపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంటరీని రూపొందించటంలో ప్రతి రాష్ట్ర పౌరుడు భాగస్వామ్యమైన సిటిజన్ సర్వేలో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవాలని తెలిపారు. ఈ సర్వేలో పాల్గొనేందుకు లింక్ ద్వారా పాల్గొనాలని సూచించారు.

## దాన్యం కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ కొనుగోళ్లు జరగాలని, దశల వారీగా జరిగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబందించిన బిల్లులు వెంటనే లబ్ధిదారులకు అందేలా క్షేత్ర స్థాయి అధికారులు కృషి చేయాలనీ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పోడ్చన్ పల్లి లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఇందిర ఇమ్డ్ల నిర్మాణ పురోగతి పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు కొనుగోళ్లు జరగాలని, ఏ కేంద్రం లోను ఎలాంటి సమస్య రాకూడదని అధికారులకి తెలిపారు. తేమ శాతాన్ని సరిగ్గా నిర్ధారించాలని, కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఏమైనా ఎదురైతే తమ దృష్టి కి తీసుకవస్తే, తప్పకుండ పరిష్కరిస్తామని అక్కడ ఉన్న రైతులకు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలను, గన్ని సంచులకు సంబందించిన వివరాలని, రిజిస్టర్లను, ఆన్లైన్ ప్రక్రియ ను ఈ సందర్బంగా కలెక్టర్ పరిశీలించారు. నాణ్యతగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరగాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా కల్పించాలి: సిపి



**ప్రజాపక్షం/హాజీపూర్:** పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా కల్పిస్తూ, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మంచిర్యాల జోన్ పరిధిలోని హాజీపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పోలీస్ అధికారులు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సిపి పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, పనితీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనితీరును పరిశీలించారు. రిసెప్షన్ సిబ్బందితో కమ్యూనికేషన్ సెట్ ద్వారా కంట్రోల్ రూమ్‌తో సమన్వయాన్ని తనిఖీ చేశారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులను సిపి క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలో నేరాల పరిస్థితులు, ప్రజల జీవన విధానం, గ్రామాల్లోని సమస్యలు, ముఖ్యమైన ప్రాజెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీ, డిసిలు, మిస్సింగ్, ప్రాపర్టీ నేరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం సిపి మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ నిర్వహించి ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని, ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతో పాటు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి అని పేర్కొన్నారు. తనిఖీల అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్, ఎసిపి ప్రకాష్, మంచిర్యాల రూరల్ సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ స్వరూప్ రాజ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ పిల్మ్ పోటీలకు ఆహ్వానం:ఎస్‌పి



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీసు ఫ్లాగ్ డే ను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లాలో గల ఔత్సాహిక ఫోటో గ్రాఫర్లకు ఫోటో గ్రఫీ షార్ట్ పిల్మ్ కు సంబందించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆద్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే ,పోలీసు అమర వీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహించనున్న వారోత్సవాలలో బాగంగా అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంబందించి గత సంవత్సరం 2024 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటి వరకు తీసిన 3 పోటోలు తక్కువ నిడివి ( 3 నిమిషాలు) గల షార్ట్ పిలిమ్స్, మాత్రమే ఈ పోటీల నామినేషన్లకు పంపించాల్సి ఉంటుంది. షార్ట్ ఫిలిమ్స్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10X8 సైజ్ 3 పోటోలను పెన్ డ్రైవ్లో సాఫ్ట్ కాపీని రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఈ నెల 22 వ తేదిలోపు సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ పిఆర్ఓ సెక్షన్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం పిఆర్ఓ నెంబర్ 8712539040 ను సంప్రదించగలరు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత ముఖ్యం

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/చెన్నూరు:** జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. నాణ్యమైన సిమెంట్, ఇసుక వాడాలని, పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం తెలంగాణ సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, మూత్రశాలలు, భోజనశాల వంటి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా నిర్మిస్తున్న నీటి ట్యాంకుల పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెన్నూరు పట్టణంలోని భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన ఉమ్మడి వరంగల్ రైతులు

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రంలో గురువారం స్పైస్ బోర్డు వరంగల్ వారి ఆధ్వర్యంలో 40 మంది రైతు సోదరులు నేక్కొండ, కేసముద్రం, చింతపల్లి, ఒడిస్సా నుండి పరిశోధన కేంద్రానికి రావటం జరిగింది. పరిశోధన స్థానంలోని పసుపు రకాలు, యంత్రాలు, పరిశోధనలను వారు పరిశీలించారు. వారికి ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పసుపు పంటలు మెలకువలు తెలుపడమైనది. వాల్యూ ఎడిషన్ గురించి కూడా వివరించారు. రైతు సోదరులు ఒక ఎఫ్‌పిఓ గ్రూప్‌గా నెక్కొండ ఎఫ్పిఓతో ఇక్కడికి రావటం జరిగింది. పసుపు రకాలపై పరిశోధనపై పరిశీలించారు. కార్యక్రమంలో పసుపు పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త మహేందర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఎంపిని కలిసిన ప్రతిభ



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రానికి చెందిన ప్రముఖ చెస్ బాక్సింగ్ చాంపియన్ ప్రతిభ తక్కడపల్లి ఇటీవల సెర్బియా దేశంలో జరిగిన ప్రపంచ స్థాయి చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని వెండి పతకం సాదించారు. ఈ నేపథ్యంలో ఆమె జహిరాబాద్ సురేష్ షెట్కార్‌ను హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని ఎంపీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడాకారిణి ప్రతిభ 4వ సారి ప్రపంచ స్థబూయి చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ సాధించిన విజయాన్ని ఎంపీ ప్రశంసించారు. ముఖ్యమంత్రి వద్దకు తీసుకువెళ్తానని చెప్పినట్లు ప్రతిభ వెళ్ళడించారు.

## పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన



**ప్రజాపక్షం/నిర్మల్:** జిల్లాలో పోషణ మాసం ముగింపు వేడుకలు గురువారం పట్టణంలోని దివ్య గార్డెన్స్ లో ఘనంగా జరిగాయి. మాతా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు చేపట్టిన పోషణ మాసం కార్యక్రమం ఎంతో ఉపయోగకరమన్నారు. ఇది ఒక్క నెల కర్యాక్రమంగా కాకుండా, ప్రజల్లో నిరంతరం పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన పెంచేలా చర్యలు కొనసాగించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పోషకాహారం అందుతోందని భరోసా కల్పించాలని అన్నారు. ప్రతి చిన్నారి అంగన్వాడీలో చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెల 17వ తేదీ నుంచి నేటివరకు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోసకాహార లోపాల నివారణపై విస్తృత అవగాహన లోపాల నివారణపై విస్తృత అవగాహన కల్పించామన్నారు. జిల్లాలోని 931 అంగన్వాడీ లో ప్రతిరోజు పోషక విలువలతో కూడిన సంపూర్ణ ఆహారం అందిస్తోందని, వైద్యారోగ్య శాఖ సహకారంతో గర్భిణీ స్త్రీలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నిర్మూలించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. గర్భిణీ స్త్రీలకు పండ్లు, సారెలు పంపిణీ చేసి సాముహిక శ్రీమంతం నిర్వహించగా చిన్నారులకు అన్న ప్రాసన జరిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, డిఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్; సీడీపీవోలు, సంక్షేమ శాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు అధికారులు పాల్గొన్నారు.

# బిసి బంద్‌కు సిపిఐ మద్దతు



**ప్రజాపక్షం /బెల్లంపల్లి:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న బిసి సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా పట్టణ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం బిసి రిజర్వేషన్లపై చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం జిఒ 9 ద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆమోదం ఇవ్వకపోవడంతో ఎన్నికలు నిలిచిపోయాయని విమర్శించారు. రెడ్డి సామాజిక వర్గం హైకోర్టులో వేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకుని బిసి రిజర్వేషన్ల అమలుకు అడ్డంకులు తొలగించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అగ్రవర్ణాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ బిసిలను విస్మరిస్తోందని ఆరోపించారు. పార్లమెంటులో చట్టం చేసి బిసిలకు ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న బంద్‌ను విజయవంతం చేయడానికి వ్యాపారవేత్తలు, ఆర్‌టిసి, బ్యాంకులు, ఆటోలు, సినిమా హాళ్లు సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బొల్లం తిలక్, రత్నం రాజన్న, రాజేశం, ఉపేందర్, రామచందర్, స్వామి దాస్ పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఎంఎల్ సి దండే విఠల్



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** అంకుసాపూర్ గ్రామంలోని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎంఎల్‌సి దండే విఠల్ అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ పర్యటించారు. ఈ సందర్భంగా అంకుసాపూర్ వాగుపై వంతెన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, రాకపోకల సౌలభ్యం కోసం తాత్కాలిక మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అలాగే వంజరి గ్రామ పంచాయతీ పరిధిలోని సిఆర్ నగర్, ఎస్ కాలనీ ప్రాంతాల్లో తీవ్రంగా ఎదురవుతున్న త్రాగునీటి సమస్యను ఎంఎల్‌సి దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే అధికారులను పిలిపించి శాశ్వత పరిష్కారం తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం పలువురు గ్రామ నాయకులు ఎంఎల్‌సి విఠల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపిటిసిలు ఠాక్రే కమలాబాయి, లక్ష్మణ్ నాయకులు, సాంబయ్య, నారాయణ, రాజు, వసంతరావు, మురళి, సోనేరావు, పులి మేర, వత్తు ధర్మయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాజామాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే :కలెక్టర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి/పటాన్‌చెరు:** గురువారం పటాన్చెరు మైత్రి క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి 69 వ ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మెదక్ ఎంపి. రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలు హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని, రానున్న కామన్వెల్త్ ఓలపింక్ క్రీడల్లో పథకాల సంఖ్య పెంపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడా పోటీల్లో పాల్గొనాలని, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఈ మూడు రోజులు అత్యంత కీలకమన్నారు. ఈ మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. చదువుతో పాటు విద్య ఉద్యోగ ఉపాది, అవకశాలను ప్రాముఖ్యం లభించే వీలు ఏర్పడుతుందన్నారు. క్రమ శిక్షణతో క్రీడా పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేలా ప్రతి ఒక్క క్రీడాకారుడు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పటాన్‌చెరులో జరిగేలా అతిథ్యం కల్పించినందుకు స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి కృతజ్ఞతులు తెలిపారు. ప్రపంచంలో అత్యధిక జనాబా మన దేశంలో ఉన్నప్పటికి కామన్వెల్త్ ఒలిపింక్ క్రీడల్లో పథకాల ప ట్టికలో మన దేశం చివరి స్థానంలో ఉంటున్నదన్నారు. అలాంటి పరిస్థితి రూపు మాపేందుకు ప్రధానిమంత్రి మోడీ ఆద్వర్యంలో గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికి తీయడం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే విధంగా క్రమశిక్షణకు క్రీడాపోటీల్లో పాల్గొనాలని, తమ పోలీసు శాఖ ఆద్వర్యంలో క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు విద్యార్థులకు అవసరమైన భద్రత పరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ క్రీడ శాఖల అధికారి ఖాసీం బేగ్, ఆర్డిఓ రాజేందర్, సంబందిత శాఖ అధికారులు కోచ్‌లు ఉపాధ్యాయులు కార్పోరేటర్లు ,ప్రజాప్రతినిధులు ,విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతన ఓటర్లకు సకాలంలో గుర్తింపు కార్డులు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్:** నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి ఇతర అధికారులతో కలిసి సీఈఓ సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ నూతనంగా ఓటర్లుగా నమోదైన ప్రతిఒక్కరికి తపాలా శాఖ ద్వారా ఓటరు గురిపు కార్డులను చేరవేయాలని సూచించారు. ఓటరు జాబితాలో 100 సంవత్సరాల వయస్సు కలిగిన ఓటర్లను గుర్తించి వారి వయస్సును తగిన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు. బూత్‌స్థాయి అధికారులకు గుర్తింపు కార్డుల పంపిణీ చేయాలని ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, కరోలిన్ చింగ్తియాన్ మావి, ఏఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## గురుకులాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ: కలెక్టర్

**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ, విద్యార్థులు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా లక్షెట్టిపేట (బాలికల) గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమమర్పించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంకు ధ్రువీకరణ పత్రాల నకలు ప్రతులు జత పరచాలని సూచించారు. లక్షెట్టిపేట, చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లి (బాలికలు), బెల్లంపల్లి, కాసిపేట, కోటపల్లి, మంచిర్యాల, జైపూర్ (బాలుర) సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 18న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల గురుకులాలలోని 6వ తరగతిలో ఎస్‌సి 6, ఎస్‌టి 2, బిసి 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు ఉన్నాయని, 7వ తరగతిలో బిసి 5 సీట్లు, 8 వ తరగతిలో ఎస్‌సి 4, ఎస్‌టి 1, బిసి 10, జనరల్ 6, మైనారిటీ 5, 9వ తరగతిలో ఎస్‌సి 3, ఎస్‌టి 4, బిసి 4, జనరల్ 5, మైనారిటీ 3 సీట్లు ఉన్నాయని తెలిపారు.
బాలుర గురుకులాలలో 5వ తరగతిలో, ఎస్‌టి 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు, 6వ తరగతిలో ఎస్‌సి 9, ఎస్‌టి 5, జనరల్ 1, మైనారిటీ 6 సీట్లు, 7వ తరగతిలో ఎస్‌సి 5 సీట్లు, 8వ తరగతిలో ఎస్‌సి 8, బిసి 8, జనరల్ 6, మైనారిటీ 8, 9వ తరగతిలో ఎస్‌సి 11, బిసి 4, ఒసి 7, మైనారిటీ 5 సీట్లు ఉన్నాయని తెలిపారు.

# మునిపల్లి గ్రామాభివృద్ధికి రూ.2.29 కోట్ల నిధులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం రూరల్ నియోజకవర్గం జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్, మునిపల్లి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గ్రామాభివృద్ధి పనుల కోసం రూ. 2 కోట్ల 29 లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. మునిపల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయటానికి కృషి చేస్తానన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.2400 గా నిర్ణయించిందని, ఈ కేంద్రాల ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రత్యేక కృషి చేశారని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, సోలార్ ప్లాంట్లు, వడ్డీ లేని రుణాలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరా శక్తి క్యాంటీన్ వంటి పథకాలతో మహిళలకు అండగా ఉంటుందన్నారు. బీసీ 42 శాతం రిజర్వేషన్‌కు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యతిరేకంగా ఉన్నాయని, శాసనసభలో చట్టం చేసి గవర్నర్‌కు కేంద్రానికి పంపిన బిల్లు బీజేపీ బీఆర్ఎస్ ఎంపీలు అడ్డుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధి కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఐసీడీయంయస్ చైర్మన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, అర్గుల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గంగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నసాయిరెడ్డి, యూత్ నాయకుడు వినోద్, తహసీల్దార్, కిరణ్మై, సంఘ డైరెక్టర్లు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వచ్చే
# ఫెడరేషన్లకు ప్రభుత్వ సహకారం

**రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించేందుకు ముందుకు వచ్చే క్రీడా ఫెడరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందజేస్తుందని రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.2026 ఉమెన్స్ హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్ టోర్నమెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించే అవకాశాలపై పరిశీలన కోసం వచ్చిన హాకీ ఇండియా ప్రతినిధులు గురువారం మంత్రిని అధికారిక నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని సన్మానించి, తెలంగాణలో క్రీడలకు ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను వివరించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ పోటీల నిర్వహణకు తగిన సదుపాయాలు, మౌలిక వసతులు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా అభివృద్ధి పట్ల కట్టుబడి ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు జరిగేలా అన్ని విధాల సహకారం అందిస్తాం అని ఆయన తెలిపారు. తదుపరి, హాకీ ఇండియా ప్రతినిధులు గచ్చిబౌలి, బేగంపేట హాకీ స్టేడియాలను పరిశీలించారు. గచ్చిబౌలి స్టేడియంలోని సదుపాయాలు పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ వేదికను ఉమెన్స్ వరల్డ్ కప్ క్వాలిఫయర్ పోటీలకు అనుకూలంగా గుర్తించారు. ఫిబ్రవరి 28 నుండి మార్చి 15 మధ్య కాలంలో ఈ పోటీలు జరిగే అవకాశముంది.ఇందుకోసం చేపట్టాల్సిన పనులపై హాకీ ఫెడరేషన్ ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సమావేశమై చర్చించారు. వీటిపై నివేదిక సిద్ధం చేసి, ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనీ బాలాదేవి, హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ బోలా నాథ్ సింగ్, కోశాధికారి శేఖర్ జై మనోహరన్, డైరెక్టర్ జనరల్ వి.ఎస్.ఎం. ఆర్.కె. శ్రీవాత్సవ, డైరెక్టర్ బి.ఎన్.భూషణ్ విక్రమ్ పాల్, తెలంగాణ హాకీ అసోసియేషన్ కార్యదర్శి బీమ్ సింగ్, కోశాధికారి కళ్యాణి, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.
















































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com